ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 18.02.2026 | సంపుటి : 12 సంచిక : 210 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా హైదరాబాద్

"హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా నిలిచింది. రెండేళ్లలో జీవవిజ్ఞాన రంగంలో రూ.73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు. ఇటీవల దావోస్‌లో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకటించాం. ప్రపంచస్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో' ప్రారంభించాం. ఇటీవల తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రకటించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం లక్ష్యం. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టి జీసీసీలను స్థాపించాలి. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, యువత మీ విజయ భాగస్వాములుగా ఉంటారు. హైదరాబాద్ ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుంది." - సీఎం రేవంత్ రెడ్డి

## భారత్‌తోనే కాదు ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీపడుతున్నాం

- గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్
- నాణ్యమైన విద్యాసంస్థలకు నెలవుగా నగరం
- జీవవిజ్ఞాన రంగంలో రూ.73వేల కోట్లకు పైగా పెట్టుబడులు
- రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం
- బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సీఎం రేవంత్ రెడ్డి
- లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగ నిపుణులకు సత్కారం
- జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును బ్రూస్ లెవిన్‌కు అందజేత

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు. హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు.

మిగతా 2లో..

## లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం

ఇప్పటికే హైదరాబాద్‌లో ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు
బయో ఏషియా సదస్సులో విదేశీ ప్రతినిధులతో సీఎం చర్చలు

2లో..

## చెత్త కనిపిస్తే జాగ్రత్త!



- అధికారులకు సీఎం రేవంత్ హెచ్చరిక
- నగరంలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి
- విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించం
- ప్రకటనల ఆదాయం పెంపుపై కసరత్తు
- మల్టీలెవల్ పార్కింగ్... స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయండి: సీఎం రేవంత్ రెడ్డి

2లో

## రేపు ఢిల్లీకి సీఎం రేవంత్ బృందం

కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు

- కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు

# మరో ఏడు మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశం

### కోరం లేకపోవడంతో మూడు స్థానాల్లో చైర్మన్ ఎన్నిక రేపటికి వాయిదా




- జనగామ, తొర్రూర్‌లో కాంగ్రెస్‌నే వరించిన అదృష్టం
- లాటరీ పద్ధతితో రెండు స్థానాలూ హస్తగతం
- ఇంద్రేశం మున్సిపాలిటీని దక్కించుకున్న బీఆర్ఎస్

**హైదరాబాద్(జనంసాక్షి):** మంగళవారం వాయిదా పడిన 11 మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు జరిగాయి. ఇందులో 7 కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లగా, ఒక మున్సిపల్ స్థానాన్ని బీఆర్ఎస్ చేజిక్కిచ్చుకుంది. కోరం లేకపోవడంతో కూడా 3 చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు సర్వశక్తులా ప్రయత్నాలు చేశాయి. పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఆందోళనకు దిగాయి. ఇల్లందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా దొడ్డ కిరణ్‌మిత్ర, వైస్ ఛైర్మన్‌గా పెండేల రాజు ప్రమాణ స్వీకారం చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీజేపీ మద్దతుతో హస్తం పార్టీ దక్కించుకుంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ చెందిన షాహిన్ సుల్తానా ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. మున్సిపల్ ఛైర్ పర్సన్‌గా కొండేటి రాజకుమారి, వైఎస్ ఛైర్ పర్సన్‌గా మాద లావణ్యను ఎన్నికున్నారు. జనగామ, తొర్రూర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ఉత్కంఠ మధ్య జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రెండుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బలాబలాలు సమానంగా ఉన్నాయి. దీంతో అధికారులు లాటరీ తీశారు. లాటరీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఛైర్మన్ అభ్యర్థుల పేర్లు రావడంతో ఆ 2 మున్సిపాలిటీలూ కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సుల్తానా బాద్ మున్సిపాలిటీ ఛైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు. జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. ఛైర్మన్‌గా యూనుస్ ఎన్నికయ్యారు. ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ కైవసం చేసు కుంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎంపీ సురేష్ షెట్కార్ ఓటు వేశారు. ఇంద్రేశం మున్సిపాలిటీని మాత్రం బీఆర్ఎస్ దక్కించుకుంది. ఛైర్‌పర్సన్‌గా కె. ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా హరీశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక వాయిదా పడింది. ఇరువర్గాల గొడవతో ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ ఎన్నిక వాయిదా వేశారు. కోరం వచ్చినా అధికారులు ఎన్నిక నిర్వహించలేదు. ఎన్నిక చేపట్టాలని బీఆర్ఎస్ (10), సీపీఐ (4) సభ్యుల డిమాండ్ చేశారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ పార్టీ అభ్యర్థులతో కలిసి బయటకు వెళ్లారు.

మిగతా 2లో..

## మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికలో అక్రమాలు

ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

2లో..

### కఠిన షరతులతో ఐబొమ్మ రవికి

# బెయిల్

- ఇంటర్నెట్ వాడకంపై నిషేధం
- కోర్టుకు పాస్‌పోర్టు సరెండర్
- విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు



**హైదరాబాద్(జనంసాక్షి):** టాలీవుడ్‌తో పాటు ఇతర చిత్ర పరిశ్రమలను వణికించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' వ్యవస్థాపకుడు రవికి న్యాయస్థానం షర తులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ బెయిల్ సాధారణంగా కాకుండా అత్యంత కఠినమైన నిబంధనలతో కూడి ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా సాగుతున్న విచారణ అనంతరం, ఆయనకు ఉపశమనం కలిగిస్తూ బెయిల్ మంజూరు చేస్తూ, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి

మిగతా 2లో..

## హర్యానా నిట్‌లో తెలంగాణ విద్యార్థి మృతి

ఉరేసుకుని మృతి చెందినట్లు అనుమానం

2లో..

### సిద్ధార్థరెడ్డి నాలుగు వారాల్లో

# లొంగిపోవాలి

## సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడికి సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడు సిద్ధార్థ రెడ్డికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. నాలుగు వారాల్లో పోలీసుల ఎదుట లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు విధించిన రెండేళ్ల శిక్షను సుప్రీం ధర్మాసనం సమర్థించింది. పోస్టుమార్టంను అన్ ప్రొఫెషనల్‌గా నిర్వహించారని ఉన్నతన్యాయస్థానం వ్యాఖ్యానించింది. కాగా, 2002 ఫిబ్రవరి 23న నటి ప్రత్యూష, ఆమె ప్రియుడు సిద్ధార్థ రెడ్డి కలిసి పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్ తాగడం తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రత్యూష మరుసటి రోజు మరణించగా.. సిద్ధార్థ రెడ్డి చికిత్స తర్వాత కోలుకున్నాడు. ఇది ఆత్మహత్యాయత్నమా లేక ఆత్మహత్యకు ప్రేరేపించడమా అనే దానిపై వివాదం చెలరేగింది. ఇది హత్యే అని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు తర్వాత సిద్ధార్థ రెడ్డిపై సెక్షన్ 306 కింద కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో 2004లో సిద్ధార్థ రెడ్డికి సెషన్స్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. 2011లో హైకోర్టు.. ఈ శిక్షను రెండేళ్లకు తగ్గించి, రూ.50,000 జరిమానా విధించింది. ఈ తీర్పుపై సిద్ధార్థ రెడ్డి, ప్రత్యూష తల్లి ఇద్దరూ 2012లో సుప్రీం కోర్టులో అప్పీల్ చేశారు. హైకోర్టు విధించిన జైలుశిక్షను సవాలు చేస్తూ నిందితుడు సిద్ధార్థరెడ్డి, అతడికి శిక్ష పెంచాలంటూ నటి ప్రత్యూష తల్లి సరోజిని సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 2025 నవంబర్‌లో వాదనలు విన్న సుప్రీంకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది.

మిగతా 2లో..




# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

- మార్చి చివరి నాటికి లబ్దిదారుల ఎంపిక
- యుద్ధప్రాతిపదికన లబ్దిదారుల ఎంపిక
- ఈనెల చివరిలోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి మంజూరు పత్రాలు
- హౌసింగ్ పాలసీపై మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్ సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్దిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను

మిగతా 2లో..

### భారత్-ఫ్రాన్స్ సంబంధాలు

# ప్రత్యేకమైనవి

- ఆ దేశం దశాబ్దాలుగా మనకు వ్యూహాత్మక భాగస్వామిగా ఉంటోంది
- అత్యాధునిక హెలికాప్టర్లు భారత్‌లోనే తయారీ :మోదీ



**ముంబయి(జనంసాక్షి):** భారత్- ఫ్రాన్స్ సంబంధాలు ప్రత్యేకమైనవని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ దేశం దశాబ్దాలుగా భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామిగా ఉందన్నారు. కర్ణాటకలోని వేమగల్‌లో ఎయిర్‌బస్ హెచ్-125 హెలికాప్టర్ల తయారీ అసెంబ్లీ లైన్‌ను ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఫ్రాన్స్ సాయంతో ఎవరెస్టంత ఎత్తు వెళ్లగలిగే హెలికాప్టర్‌ను తయారు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముంబయిలోని లోక్‌భవన్‌లో సమావేశమైన ఇరువురు నేతలు.. ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అనంతరం మీడియా ముందు ఆ వివరాలు వెల్లడించారు.' భారత్‌కు పురాతన వ్యూహాత్మక భాగస్వామిగా ఫ్రాన్స్ కొనసాగుతోంది. రఫేల్ జెట్‌ల నుంచి సబ్‌మెరైన్ వరకు రక్షణ రంగంలో సహకారం అందించుకుంటున్నాయి. ఎవరెస్టంత ఎత్తు వెళ్లగలిగే హెలికాప్టర్లను ఫ్రాన్స్ సహకారంతో భారత్‌లోనే తయారు చేయనున్నాం. యావత్ ప్రపంచానికి ఇక్కడ నుంచే ఎగుమతి

మిగతా 2లో..

### నిబంధనలను అతిక్రమిస్తే

# సహించేదిలేదు

- ఎలాంటి వీసాలనైనా వెంటనే రద్దు చేస్తాం
- అమెరికా భద్రతకు భంగం కలిగిస్తే ఊరుకోం
- విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో విదేశీయులకు మరో వార్నింగ్ ఇచ్చారు. అమెరికా జాతీయ భద్రతకు వ్యతిరేకంగా వ్యవహరించే విదేశీయుల వీసాలను రద్దు చేసి వారిని వెనక్కు పంపించేస్తామని స్పష్టం చేశారు. అమెరికా ఈసా హక్కు కాదని గుర్తుంచుకోవాలన్నారు. అమెరికాకు వచ్చిన విదేశీ టూరిస్టులు, జర్నలిస్టులు, విద్యార్థులు అందరికీ ఈ హెచ్చరిక వర్తిస్తుందని అన్నారు. అమెరికా జారీ చేసే వీసాకు పలు పరిమితులు ఉంటాయని మంత్రి మార్కో రూబియో చెప్పారు. విదేశీ పర్యాటకులు వీటికి లోబడే ఉండాలని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు చెప్పినా జనాలకు ఎందుకు బోధపడటం లేదో తనకు అర్థం కావటం లేదని కామెంట్ చేశారు. అమెరికా వీసాను

మిగతా 9లో..

# సామాజిక మాధ్యమాల వినియోగంపై వయసుల వారీ పరిమితులు



### విధించే యోచన పరిశీలిస్తున్నాం : అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సామాజిక మాధ్యమాల వినియోగంపై వయసుల వారీ పరిమితులు విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆయా టెక్ కంపెనీలతో (సామాజిక మాధ్యమాలు) చర్చలు జరుపుతోంది. సోషల్‌మీడియా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల దృష్ట్యా ఫ్రాన్స్, ఆస్ట్రేలియా..తదితర దేశాలు చిన్నారులు సోషల్‌మీడియా వినియోగంపై నిషేధం విధించాయి. ఈ నేపథ్యంలో భారత్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో భాగంగా కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుతం మేం డీప్‌ఫేక్‌లు, వయసు ఆధారిత నియంత్రణలపై వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో చర్చలు జరుపుతున్నాం. అనేక దేశాలు వయసు ఆధారిత నియంత్రణలను అంగీకరించాయి. భారతదేశంలో ఇది అవసరమని భావిస్తున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సైతం డిజిటల్ ఎడిక్షన్‌ను తగ్గించేందుకు వయసు ఆధారిత సోషల్ మీడియా అందుబాటు వ్యవస్థను ప్రవేశపెట్టాలని అభిప్రాయపడింది. పలువురు ఎంపీలు సైతం ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అంశం సంప్రదింపుల దశలో ఉంది.



# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో 72 కిలోల కేక్ కట్‌చేసిన కేటీఆర్

2లో..

# సిద్ధార్థరెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలి

**– సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడికి సుప్రీం ఆదేశం**

తాజాగా ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు తుది తీర్పు ఇచ్చింది. సిద్దార్థ రెడ్డి పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం.. హైకోర్టు శిక్షను సమర్థించింది.

**సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నా కానీ..**

**– మాకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదు : ప్రత్యూష తల్లి**

**హైదరాబాద్(జనంసాక్షి):** తన కుమార్తె, నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై సరోజినీదేవి స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నానని, కానీ తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని అన్నారు."ప్రత్యూష మృతి సమయంలో కొన్ని బెదిరింపులు వచ్చాయి. నా కూతురిది ఆత్మహత్య కాదు హత్యే. న్యాయం కోసం మొదటి నుంచీ ఒంటరి పోరాటం చేస్తున్నా. ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన నా కూతురి జీవితం నాశనమైంది. నిందితుడు సిద్ధార్థరెడ్డి విదేశాల్లో ఉన్నాడని తెలిసింది. ఈ కేసును తొలి దశలోనే తారుమారు చేశారు. నా వద్ద ఉన్న కొన్ని సాక్ష్యాలతోనే పోరాటం చేస్తూ వచ్చా. అప్పుడే అన్ని సాక్ష్యాలు ఉండి ఉంటే అతడికి తప్పకుండా జీవితకాల శిక్ష పడేది""కన్నతల్లిగా నేను చెప్పిన స్టేట్‌మెంట్‌నూ పక్కన పెట్టేశారు. 24 ఏళ్లుగా నరకం అనుభవిస్తున్నా. ఇన్నేళ్లలో ఎవరూ నాకు తోడుగా నిలవలేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యూష మృతి కేసులో సుప్రీం కోర్టు మంగళవారం తుది తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. హైకోర్టు విధించిన జైలు శిక్షను సవాలు చేస్తూ నిందితుడు సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ.. నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది.

# కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

చర్యలకు పాల్పడకుండా కోర్టు పలు ఆంక్షలు విధించింది.ప్రధానంగా రవి ఇంటర్నెట్ వినియోగంపై కోర్టు పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించింది. ఆయన ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే కేవలం పోలీసుల ముందస్తు అనుమతితో మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. దీనితో పాటు నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా కట్టడి చేస్తూ, ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. భద్రతా చర్యల్లో భాగంగా రవి తన పాస్‌పోర్ట్‌ను వెంటనే కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే వాటిని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తూ చిత్ర పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టాన్ని చేకూర్చారనే ఆరోపణలపై రవి అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున, ఆయన మళ్లీ వెబ్‌సైట్ నిర్వహణ లేదా పైరసీ పనులు చేపట్టకుండా ఉండేందుకే కోర్టు ఇంటర్నెట్‌పై ఇటువంటి అరుదైన , కఠినమైన ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

# హర్యానా నిట్‌లో తెలంగాణ విద్యార్థి మృతి

### ఉరేసుకుని మృతి చెందినట్లు అనుమానం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** హర్యానాలోని కురుక్షేత్రలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మహేశ్వరం మండలం రంగారెడ్డి జిల్లాకు చెందిన అంగోత్ శివ (19) నిట్ కురుక్షేత్రలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం హాస్టల్ గదికి వెళ్లిన శివ.. భోజనానికి రాకపోవడంతో తోటి విద్యార్థులు గదికి వెళ్లి చూశారు. ఈ క్రమంలో, శివ.. సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నట్లు సమాచారం. కళాశాల యాజమాన్యం దీనిని ఆత్మహత్యగా అనుమానిస్తోంది. విద్యార్థి మృతదేహాన్ని నిట్ సివిల్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, శివ మృతిపై కుటుంబ సభ్యులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిట్ కురుక్షేత్ర క్యాంపస్ ముందు కుటుంబ సభ్యులు పడిగాపులు కాస్తున్నారు. కనీసం ఆస్పత్రి లోపలికి కూడా సిబ్బంది అనుమతించని పరిస్థితి. తమ కుమారుడి మృతిపట్ల కాలేజీ యాజమాన్యం సరిగా స్పందించకపోవడంపై శివ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# ఏఐ సదస్సులో సమస్యలు.. కేంద్రమంత్రి క్షమాపణలు

భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో సరైన సౌకర్యాలు లేకపోవడంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలిరోజు సందర్శకులు భారీగా రావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారీ క్యూలైన్లు, ప్రవేశ ఆలస్యంతో ఇబ్బందులు తలెత్తాయి. దీనిపై కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ.. సదస్సుకు హాజరైన వారికి క్షమాపణలు చెప్పారు. సదస్సు సజావుగా సాగేలా చూస్తామని హామీ ఇచ్చారు. 'ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సమిట్. ఈరోజు 70వేల మంది ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యారు. సోమవారం జరిగిన సమిట్‌లో ఎవరైనా సమస్యలు ఎదుర్కొని ఉంటే.. దానికి ప్రభుత్వం తరఫున క్షమాపణలు కోరుతున్నాం. మీ అభిప్రాయాలను మాతో పంచుకోండి. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడానికి మా బృందం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది' అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కాగా సోమవారం సాయంత్రం ఏఐ సమిట్ ప్రారంభమైన సమయంలో భారత మండపం వద్ద సిబ్బంది రద్దీని నియంత్రించలేకపోయారని పలువురు నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. అందరికి సరిపడా కుర్చీలు, ఇతర సదుపాయాలు లేవన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో యూపీఐ పేమెంట్ సదుపాయం లేదని, లోపలికి వెళ్లడానికి గంటల తరబడి లైన్లలో వేచి ఉండాల్సి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు. పలు స్టాళ్ల వద్ద తొక్కిసలాట వంటి పరిస్థితులు నెలకొన్నాయన్నారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**నీటిపారుదల & కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ**
**కార్యనిర్వాహక ఇంజినీరు, నీటిపారుదల విభాగం నెం.5, ఎల్ఎండీ కాలనీ, కరీంనగర్**

బహిరంగవేల ప్రకటన నెం.01/ఈఈ/ఐడీ5/ఐసీ-2/2025-26 తేది: 13.02.2026

ప్రాఫ్: జి.వి.సుధాకర్‌రావు లోయర్ మానేరు ఆనకట్ట పరిధిలో అటవీశాఖ ఆమోదించిన 594 చెట్ల నరికివేత/తొలగింపు హక్కుల కోసం బహిరంగవేలం నిర్వహించబడును. రిజర్వుధర: రూ.3,58,038/-, బిడ్ సెక్యూరిటీ రూ. 35804/-, వాల్టా సెక్యూరిటీ డిపాజిట్ రూ.2,97,000/-, టెండరు షెడ్యూల్ తీసుకొనుటకు, బిడ్ సెక్యూరిటీ సమర్పించుటకు తేది/సమయం: 18.02.2026(ఉ॥11) నుండి 25.02.2026(సా॥4గం॥లకు).వేలం తేది: 26.02.2026 సమయం: ఉదయం 11.30గం॥లకు. స్థలం: కార్యనిర్వాహక ఇంజినీరు కార్యాలయము, నీటిపారుదల విభాగం నెం.5, ఎల్ఎండీ కాలనీ, కరీంనగర్, వేలం 'యథాస్థితి-యథా ప్రదేశం' ప్రాతిపదికన జరుగును. పాల్గొనేవారు ముందుగా పరిశీలించినట్టుగా పరిగణించబడును. తరువాత ఫిర్యాదులు స్వీకరించబడవు. నిర్దేశిత బిడ్ సెక్యూరిటీ చెల్లించాలి. విజయవంతమైన బిడ్డర్ వేలం రోజునే పూర్తి మొత్తాన్ని చెల్లించాలి. వాల్టా మరియు అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. ఇతర వివరాలకు కార్యనిర్వాహక ఇంజినీరు కార్యాయాన్ని సంప్రదించాల.( ఫోన్: 9959961950) ఏదైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు కార్యనిర్వాహక ఇంజినీరుకు కలదు.

**సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, నీటిపారుదల విభాగం నెం.5, కరీంనగర్**

DIPR No.15438-PP/CL/ADVT/1/2025-26



**అగ్రికల్చరల్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్**
**జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయము**
**ఖమ్మం జిల్లా**

'షార్టు' టెండరు నోటీసు

No.DMO/KMMS/SA/Kharif/112/2025-26 Dt: 16.02.2026

ఖమ్మం జిల్లాలోని అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీలో లోడల్ స్ప్రింగ్ సిస్టం కోసం మాన్యువల్ ప్యాడీ క్లీనర్ నుంచి ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్‌ను సక్షన్‌పైప్ ద్వారా అనుసంధానించుకుటకు 50 కన్వర్షన్‌లకు సీల్డ్‌టెండర్లు ఆహ్వానించడమైనది. స్పెషిఫికేషన్‌లు, నిబంధనలు, షరలతులు,మిగతా వివరాలు టెండరు షెడ్యూల్‌లో పొందుపరచడమైనది. టెండరు షెడ్యూల్‌ను జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, కాటన్ మార్కెట్ యార్డ్, గుట్టలబజార్, ఖమ్మం -507003 నుండి ఆఫీసు పనివేళల్లో రూ.1000 లను డీడీ రూపంలో 'జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, ఖమ్మం' పేరున చెల్లించి పొందవచ్చును. మిగతా వివరాలకు : ఎం. రామకృష్ణ, సెల్: 9441979482(కార్యాలయ పనివేళల్లో) టెండరు వివరాలు: టెండరు షెడ్యూల్ జారీ చేయు తేది: 20.02.2026 ఉ॥ 10.30 గం॥ల నుండి, చివరి తేది: 27.02 2026 మ॥ 3 గం॥ల నుండి 4॥ల వరకు. టెండరు తెరచుతేది సమయం: 28.02.26

**సం/- పి.శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కలెక్టర్, ఖమ్మం**

DIPR No.15376-PP/CL/ADVT/1/2025-26


# ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రంగా హైదరాబాద్

ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయో ఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూ స్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు. సైన్స్, ఏఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

## చెత్త కనిపిస్తే జాగ్రత్త!

**హైదరాబాద్(జనంసాక్షి):** మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాను ప్రత్యక్ష పరిశీలనకు వస్తానని... ఎక్కడైనా చెత్త కనపడితే సహించమని అధికారులను సీఎం హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆదాయం పెంపునకు తీసుకోవాల్సిన పలు అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్‌ల్లోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు.

## రేపు ఢిల్లీకి సీఎం రేవంత్ బృందం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ భేటీ తర్వాత తెలంగాణ క్యాబినెట్‌లో మార్పులు లేదా చేర్పులు ఉండొచ్చనే ఊహాగానాలు కూడా రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి.ఖాళీల భర్తీతో పాటు పలువురి మంత్రి పదవుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకునే వీలుందని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా గ్యారెంటీల అమలు తీరుపై అధిష్టానం సమీక్షించనుంది. అలాగే ఇటీవల వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలపైనా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంతృప్తితో ఉంది. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ నిర్మాణం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం , పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దిశానిర్దేశర చేయనుంది. అలాగే విపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం , భవిష్యత్తు ఎన్నికల వ్యూహాల గురించి రాహుల్ గాంధీ స్వయంగా నాయకులకు సూచనలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 19వ తేదీ ఉదయం తెలంగాణ నేతలతో సమావేశమై, అదే రోజు సాయంత్రం మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో భేటీ కానుంది. రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వం , పార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

# భారత్- ఫ్రాన్స్ సంబంధాలు ప్రత్యేకమైనవి

అవుతాయి.భారత్, ఐరోపా సంబంధాల్లో ఈ ఏడాది ఎంతో కీలకం. కొన్నిరోజుల క్రితమే ఐరోపా కూటమితో చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్న వేళ.. ప్రపంచ స్థిరత్వానికి ఇరు దేశాల భాగస్వామ్యం ఓ శక్తిగా మారుతుంది. బహుళ ధ్రువ ప్రపంచాన్ని మేం విశ్వసిస్తాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మాట్లాడుతూ.. భారత్ తమకు ఎంతో విశ్వసనీయ భాగస్వామి అన్నారు. ఇరు దేశాలు చట్టబద్ధ పాలనను బలంగా నమ్ముతాయని, కొన్నేళ్లుగా దీన్ని రెండు దేశాలు నిరూపించాయన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సహకరిస్తామన్నారు.

ఏఐ కళ్లద్దాలతో ప్రధాని మోదీ..

భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026, సమిట్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి ఈ సదస్సు జరుగుతోన్న వేళ మన స్టార్టప్ 'సర్వం ఏఐ' చేసిన ప్రకటన వార్తల్లో నిలిచింది. త్వరలో ఏఐ స్మార్ట్ గ్లాసెస్ తీసుకువస్తామని వెల్లడించింది. ఆ అద్దాలు ధరించిన ప్రధాని మోదీ ఫొటో ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారింది.బెంగళూరు కేంద్రంగా 2023లో వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్ ఈ సర్వం ఏఐ (రాజీటీలజీఎఐ)ని స్థాపించారు. గ్లాసెస్ గురించి ప్రత్యూష్ ఒక వీడియోను షేర్ చేశారు. ఆ గ్లాసెస్‌కు 'సర్వం కేజ్' అని పేరుపెట్టారు. ఆ తర్వాత మోదీ ఆ అద్దాలను ధరించిన ఫొటోను షేర్ చేశారు. "వాటిని ధరించిన మొదటి వ్యక్తి ఎవరో తెలుసా..? ప్రధానమంత్రి" అని ప్రత్యూష్ తన పోస్టులో రాసుకొచ్చారు. అది ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో దిగిన చిత్రంగా తెలుస్తోంది. సర్వం కేజ్ కళ్లద్దాలను భారత్‌లోనే అభివృద్ధి చేశామని కుమార్ వెల్లడించారు. ఇది తొలి స్వదేశీ ఏఐ హార్డ్‌వేర్ అని పేర్కొన్నారు. "ఇది యూజర్ రియల్ వరల్డ్‌లో చూసేవాటిని గమనిస్తుంది.. అర్థం చేసుకుంటుంది.. ప్రతిస్పందిస్తుంది.. క్యాప్చర్ చేస్తుంది" అని వాటి పనితీరు గురించి వివరించారు. త్వరలో వాటికి చాట్ ఫీచర్‌ను కూడా తీసువస్తామని చెప్పారు. ఏఐ గ్లాసెస్‌ను తమ అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు. మేలో ఈ ప్రొడక్ట్ మార్కెట్‌లోకి రానుంది.ప్రపంచవ్యాప్తంగా ఈ స్మార్ట్ గ్లాసెస్ పై ఆసక్తి పెరుగుతోంది. మెటా ఇప్పటికే 'రేబ్యాన్ మెటా' పేరిట గ్లాసెస్‌ను లాంచ్ చేసింది. 2025లో 7మిలియన్ల గ్లాసెస్‌ను విక్రయించింది. త్వరలో యాపిల్ సంస్థ కూడా ఈ తరహా గ్లాసెస్‌ను తీసుకురానుంది. భారత వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఏఐ నమూనాలపై పనిచేస్తోన్న సంస్థల్లో సర్వం కూడా ఒకటి. ఈ సంస్థ ఇప్పటికే సర్వం అక్షర్ (డాక్యుమెంట్ డిజిటైజేషన్), సర్వం స్టూడియో (బహుభాషా కంటెంట్‌ను రూపొందించడంలో సహకరిస్తుంది), సారస్ వీ3 (స్పీచ్ రికగ్నిషన్ మోడల్)ని తీసుకువచ్చింది.కాగా...కృత్రిమ మేధ (ఏఐ) రంగంపై విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత్‌లో ఏఐ సమిట్ జరుగుతోంది. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి.. లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఇప్పటికే మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే.

ముంబయిలో మెక్రాన్-మోదీ భేటీ

# లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులు, కంపెనీలు పెట్టాలని యోచించే గ్లోబల్ ఇన్వెస్టర్లకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ మహానగరంలో ఇప్పటికే ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీ(గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. ఇదే విషయమై మరింత లోతుగా దృష్టి సారించడానికి, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఇన్నోవేషన్ సెంటర్‌లను సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఫ్యూచర్ సిటీలో జిసిసిల కోసం ఒక ప్రత్యేక జోన్‌ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బయో ఏషియా సదస్సు-2026 జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్... లైఫ్ సైన్సెస్ రంగంలో గ్లోబల్ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిగ్యూటివ్‌లతో భేటీ అయ్యారు.ఫ్రాన్స్ లో తన ప్రపంచ ప్రధాన కార్యాలయంతో సనోఫీ నుండి విడిపోయిన గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ కంపెనీ అయిన ఒపెల్లా హెల్త్‌కేర్, దాని జిసిసి కార్యకలాపాలను 42,000 చదరపు అడుగుల సౌకర్యంతో విస్తరిస్తోంది. వచ్చే ఏడాదిలోపు 500 ఉద్యోగాలను ఈ కంపెనీలను సృష్టించనుంది. జీఏపీఎఫ్ఏ ఇండోనేషియా విభాగమైన వాక్సిండో యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక బీఎస్ఎల్-3 వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం కోళ్లు, పశువులు, స్వైన్. ఆక్వాకల్చర్ కోసం వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయడంపై దృష్టి పెడుతుంది. ఏఐ, డేటా సైన్స్ కంపెనీగా పేరొందిన ట్రైడెన్స్ ఐఎన్సీ, ఏఐ-ఆధారిత హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ పై కీలక సేవలు అందించిన సంస్థ, తన హైదరాబాద్ కార్యకలాపాలను నిర్వహించాలని ప్రకటించింది. ఈ కేంద్రం సుమారు 18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండగా, దీనిలో ప్రపంచ స్థాయి కార్యకలాపాలను నిర్వహించ తలపెడుతున్నది.

# మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలో అక్రమాలు

### ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

**హైదరాబాద్(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దౌర్జన్యాలపై మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్ల దౌర్జన్యం, ఇబ్రహీం పట్నం ఎన్నిక స్టే అంశం పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..116 మున్సిపాలిటీ ,7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరిగాయి. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసి, దాడులు చేశారని మండిపడ్డారు. ఎన్నికలు సజావుగా జరగలేదు. ఇవాళ చైర్మన్ ఎన్నికలో సైతం దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. జనగామలో మహిళా కౌన్సిలర్ చేయి పట్టి లాగారు. వాళ్లకు అనుకూలంగా ఉంటే అనౌన్స్ చేస్తున్నారు. లేదంటే దాడులు, వాయిదాలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం పనితీరు నామ్ కే వాస్తేగా ఉంది. ఇబ్రహీంపట్నంలో ఎన్నిక అయ్యాక కోర్టు స్టే అని ఆపారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. 30 మున్సిపాలిటీ లో హంగ్ వచ్చినా ఇష్టానుసారంగా ప్రవర్తించారు. పోలీసులను ఉపయోగించి వాళ్లకు అనుకూలంగా ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. గవర్నమెంట్ సంస్థలాగా ఎన్నికల సంఘం మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మరో ఏడు మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశం

ఎన్నికల గదిలో బీఆర్ఎస్ సభ్యులు తమపై దురుసుగా ప్రవర్తించారని వివేక్ ఆరోపించారు.కాంగ్రెస్ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని బీఆర్?ఎస్ నేతలు ఆరోపించారు. ప్రమాణ స్వీకారం తర్వాత అధికారులు కావాలని 10 నిమిషాలు విరామం ఇచ్చారని, తమని కిడ్నాప్ చేయాలని కాంగ్రెస్ పథకం వేసిందని ఆరోపించారు. ఎన్నిక జరిగే సమావేశం మంత్రి వివేక్ ప్రసంగించడానికి అధికారులు అవకాశం ఇచ్చారని, బీఆర్ఎస్, సీపీఐ బలాన్ని చూసి వివేక్ జీర్ణించుకోలేక పోయారని విమర్శించారు. సజావుగా జరపాల్సిన ఎన్నికలను ఉద్దేశ్యపూర్వకంగానే వాయిదా వేశారని అన్నారు.నిర్మల్ జిల్లా ఖానాపూర్?లోనూ మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. రెండో రోజు కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు.ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను ఎస్ఈసీ వాయిదా వేసింది. ఎన్నికపై హైకోర్టు నుంచి స్టే రావడంతో అధికారులు వాయిదా వేశారు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కౌన్సిలర్ యాదగిరి కుమారుడు కిడ్నాప్‌పై హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఎల్లుండిలోపు యాదగిరిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించింది. అనూహ్యంగా ఉదయం బీఆర్ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు యాదగిరి హాజరయ్యారు. ఛైర్మన్ ఎన్నిక పూర్తయిన తర్వాత అధికారులకు కోర్టు ఆదేశాలు అందాయి. స్టే కారణంగా బీఆర్ఎస్ ఛైర్మన్ అభ్యర్థికి ధ్రువీకరణపత్రం ఇవ్వలేదు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశాయి.

కన్నీళ్లు పెట్టుకున్న ఎర్రబెల్లి : తొర్రూర్ మున్సిపాలిటీ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఉద్రిక్తత తలెత్తడంతో దయాకర్ రావును నర్సింహుల పోలీస్ స్టేషన్?కు తరలించారు. మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తానేం సమాధానం చెప్పాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పని చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల మధ్య ఘర్షణ కారణంగా ఎన్నిక వాయిదా వేసినట్లురిటర్నింగ్ అధికారి సతీష్ ప్రకటించారు.

నిన్న 105 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ల ఎన్నిక : తెలంగాణ రాష్ట్రంలోని పురపాలిక సంఘాల్లో 116 పురపాలక సంఘాల ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా ఇవాళ కూడా పలు చోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దీంతో 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 81 కాంగ్రెస్ పార్టీ దక్కాయి. బీఆర్ఎస్ 18 చోట్ల, బీజేపీ ఒక చోట (నారాయణపేట) గెలిచాయి. నాలుగు చోట్ల స్వతంత్రులు (ఆదిలాబాద్, భైంసా, మహబూబాబాద్, జమ్మికుంట) ఛైర్మన్ స్థానాలు దక్కించుకొంటే, మరోచోట ఫార్వర్డ్‌బ్లాక్ కైవసం చేసుకొంది.

# ఏప్రిల్‌లో బెంగాల్, తమిళనాడు ఎన్నికలు..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు ఎన్నికల కమిషన్ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు రాష్ట్రాలతో పాటు అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో ఒకేసారి పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ను మార్చి మధ్యలో ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడానికి ఈసీ అధికారులు ఇప్పటికే పర్యటన ప్రారంభించారు. ప్రస్తుతం అస్సాంలో ఉన్నారు.పుదుచ్చేరి అసెంబ్లీ పదవీకాలం జూన్ 15న ముగుస్తుండగా.. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల పదవీకాలాలు మేలో ముగుస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఈసీ నిర్వహిస్తోన్న 'సర్' ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. పుదుచ్చేరి ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 14న ప్రచురించింది. తమిళనాడు తుది జాబితాను నేడు విడుదల చేయనుంది. అస్సాంలో ఫిబ్రవరి 10న, కేరళలో ఫిబ్రవరి 21న, పశ్చిమ బెంగాల్లో ఫిబ్రవరి 28న తుది జాబితాలు విడుదలకానున్నాయి.

# బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణస్వీకారం

**ఢాకా(జనంసాక్షి):** బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ ఆయనతో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులతో ప్రమాణం చేయించారు. రాజధాని నగరం ఢాకాలో ఈ కార్యక్రమం జరిగింది. బంగ్లా ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. బంగ్లాదేశ్‌లో గత 35 ఏళ్లుగా మహిళలే ప్రధానులుగా కొనసాగారు. ఈ కాలంలో అవామీ లీగ్ అధినేత నేత షేక్ హసీనా, బీఎన్‌పీ నాయకురాలు ఖలిదా జియాలే దేశానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు బీఎన్‌పీ ఛైర్మన్‌గా ఉన్న తారిఖ్ రెహమాన్ 35 ఏళ్ల తర్వాత ఆ పదవిని అధిష్ఠించిన పురుష ప్రధానిగా నిలిచారు. ఖాలిదా జియా కుమారుడైన రెహమాన్ 2008లో బంగ్లా విడిచి వెళ్లారు. 17 ఏళ్ల పాటు బ్రిటన్‌లో ప్రవాస జీవితం గడిపారు. గతేడాది డిసెంబరులోనే స్వదేశానికి వచ్చారు. తల్లి మరణించడంతో పార్టీ బాధ్యతలు స్వీకరించి బీఎన్‌పీని విజయపథంలో నడిపారు. ఎన్నికల్లో తాను పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఆయన గెలుపొందారు. 299 పార్లమెంట్ స్థానాలకుగానూ 209 చోట్ల పార్టీ విజయం సాధించింది. 2024లో హసీనా ప్రధాని పదవిని కోల్పోయిన తర్వాత నేడు బంగ్లా లో ప్రజాస్వామ్యయుతమైన ప్రభుత్వం ఏర్పడింది.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చేస్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్దిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిధిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు.మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు.చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్దిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు.2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్దిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.ఆర్,ఆర్, ఆర్, - ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, - ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్(జనంసాక్షి):** భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ తాను జాతిపితనని ఏనాడూ చెప్పుకోలేదని, తమ జాతికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన నేతను ప్రజలు అలా పిలుచుకుంటున్నారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేసీఆర్ 72వ జన్మదినం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో కేటీఆర్ హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితర నేతలు పాల్గొన్నారు. 72 కిలోల కేక్ కోశారు. కేసీఆర్ ఉద్యమ ప్రస్థానం, పదేళ్ల పాలనపై తయారు చేసిన డాక్యుమెంటరీని విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యమకారుల మీదకు తుపాకులు తీసుకొని దాడికి వెళ్లిన వారికి జాతి నిర్వచనం ఎలా తెలుస్తుందని అన్నారు. జై తెలంగాణ నినాదం ఇవ్వడానికి భయపడే వారికి, కిరాయి సర్కార్‌కు, తెలంగాణ సోయి లేని వారికి జాతి విలువ ఎప్పటికీ తెలియదని వ్యాఖ్యానించారు. "తెలంగాణలో ప్రజల బాగోగులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరులు, విద్యార్థి అమరవీరుల జాతి మాది. గిరి గీసి కొట్లాడే తెగువ ఉన్న కేసీఆర్ జాతి మాది. రాష్ట్రంలో తెలంగాణవాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతి మాత్రమే ఉన్నాయి. మాది ఫైటర్ల జాతి, వారిది ద్రోహుల జాతి. నా తండ్రి తెలంగాణ జాతికి హీరో అన్న విషయం వాస్తవం. కొంతమంది కేసీఆర్ ఆనవాళు చెరిపేస్తామని అంటున్నారు.

# గంజాయితో మహాశివుడికి అపచారం


- దుండుగుల దుందుడుకు చర్యలపై సీపీ ఆగ్రహం
- తక్షణ చర్యలకు సజ్జన్నార్ ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : శివరాత్రి పర్వదినం వేళ గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. దేవాలయం వద్ద శివునికి గంజాయిని ప్రసాదంగా సమర్పించబోయారు కొందరు ప్రబుద్ధులు. అంతేకాదు.. దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు.. సదరు వ్యక్తుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని నేరుగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సీరియస్‌గా స్పందించిన సీపీ సజ్జనార్.. వీడియోలోని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు.. సదరు గంజాయి బ్యాచ్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని శంషాబాద్ ధర్మగిరి దేవాలయం వద్ద మహా శివునికి గంజాయిని ప్రసాదంగా పెడుతున్నామంటూ కొందరు యువకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దేవుడికి అందరూ కొబ్బరికాయ కొడితే.. తాము ప్రత్యేకంగా గంజాయి పెడుతున్నామంటూ వీడియోలో వివరించారు. దీనిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు.. నగర సీపీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీడియోను పరిశీలించి.. సదరు యువకులు బడంగ్‌పేట్‌కు చెందిన చరణ్‌తోపాటు అతడి స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ తరహా రీల్స్ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యువకులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

- పది మున్సిపాలిటీల్లో హస్తం హవా
- అన్నింటా కాంగ్రెస్ చైర్మన్ల ఎన్నిక



వరంగల్, ఫిబ్రవరి17 (జనంసాక్షి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 12 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. ఆ జాబితాలోని 10 మున్సిపాలిటీలలో ఆ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. ఇక హంగ్ ఏర్పడిన తొర్రూర్, జనగామ మున్సిపాలిటీలు లక్కీ డ్రా ద్వారా చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. తొర్రూరు, జనగామలో సోమవారం పరస్పర విమర్శలు, ఆరోపణల మధ్య ఉద్రిక్తత నెలకొంది. అయితే అనూహ్యంగా ఇక్కడ ఎన్నికను వాయిదా వేశారు. దీంతో మంగళవారం తిరిగి ఎన్నికల నిర్వహించారు. ఇదిలావుంటే తొర్రూరు మున్సిపాలిటీ పీఠం బీఆర్‌ఎస్‌కు దక్కకుండా ఉండాలని కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడిందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో చైర్మన్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించు కునేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నిందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు వెళ్లకుండా ఇంచార్జిలు మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తొర్రూరు వెళ్లకుండా మహబూబాబాద్‌లోనే సత్యవతి రాథోడ్‌ను హౌస్ అరెస్టు చేశారు. ఇక వంధునాదనచారిని హన్మకొండ శాంతినికేతన్ అపార్ట్‌మెంట్‌లో సుబేదారి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా సోమవారం నాడు ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. నిన్న ఉద యం 10 గంటలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి తొర్రూరుకు చేరుకున్నారు. అయితే, అన్నారం రోడ్డు వద్ద ఆయనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం తెలుపడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. మరోవైపు ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగారు. మాజీ మంత్రి దయాకర్‌రావును అడ్డుకోవడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకునే క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. ఒకే ఓటును రెండుచోట్ల వినియోగించొద్దని అంటూ ఖమ్మం -వరంగల్ జాతీయ రహదారిపై కారుకు అడ్డంగా బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ లాఠీచార్జ్ చేసి కార్యకర్తలను చెదరగొట్టి, ఎంపీని అనుమతించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో దయాకర్‌రావు పీఏ భాసర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని ఆయనను రక్షించారు. విషయం తెలుసుకున్న దయాకర్‌రావు మున్సిపల్ కార్యాలయం సమీపంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. తన 45 ఏండ్ల రాజకీయ జీవితంలో ఇంత నీచమైన రాజకీయాలు ఎప్పుడూ చూడలేదని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు.

| మున్సిపాలిటీ | చైర్మెన్ /చైర్‌పర్సన్ | వైస్ చైర్మెన్/చైర్‌పర్సన్ |
|---|---|---|
| జనగామ | బాలామణి (కాంగ్రెస్) | పర్వతాలు (బీఆర్ఎస్) |
| తొర్రూరు | తూనం శ్రవణ్ (కాంగ్రెస్) | రజిని |
| డోర్నకల్ | కుందేటి రాజకుమారి | లావణ్య |
| భూపాలపల్లి | బుర్ర కొమురయ్య | శ్రీనివాస్ |

## వరంగల్ చరిత్రలో తొలిసారిగా
# మోడల్ రాకెట్ ప్రయోగం

- మీడియా సమావేశంలో కూడా చైర్మన్ ఇనగాల



హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 17 (జనం సాక్షి) : ఎక్స్‌ప్లోరా – స్పేస్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ డ్రైవ్ లో భాగంగా, ఫిబ్రవరి 18 నుండి 27 వరకు వరంగల్ భద్రకాళి బండ్ వద్ద ప్రజల కోసం స్టార్ గేజింగ్ కార్యక్రమాలు నిర్వహించబ డుతున్నాయని.. ఈ కార్యక్రమం కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో, స్పేస్ రీసెర్చ్ ల్యాబ్, రిజిస్టర్డ్ ఇస్రో స్పేస్ ట్యూటర్ శశాంక్ భూపతి, ఎన్ఐటి వరంగల్ అకడమిక్ భాగస్వామ్యంతో నిర్వహించబ డుతోందని వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా వైస్ ఛైర్మన్ మరియు వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పేయి , ఎన్ఐటి డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి, ఇస్రో ఎన్ఐటి నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రంలో కూడా సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కోసం నాలుగు ప్రొఫెషనల్ ఖగోళ టెలిస్కోపులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడి, చంద్రుడు, గ్రహాలు మరియు లోతైన ఆకాశ వస్తువుల పరిశీలనకు ప్రజలు మరియు విద్యార్థులకు అవకాశం కల్పించబడింది. ఖగోళ పరిశీలనతో పాటు, వరంగల్ ఐ ఎస్ ఆర్ ఓ మిషన్ గ్యాలరీ థీమ్ ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఈ మిషన్ గ్యాలరీలో రాకెట్ మోడల్స్, మిషన్ నమూనాలు ప్రదర్శించబడి, భారతదేశ అంతరిక్ష ప్రయాణాన్ని సులభంగా అర్థమయ్యే విధంగా చూపించబడు గ్యాలరీనేషనల్ సైన్స్ డే సందర్భంగా, ఎక్స్‌ప్లోరా స్పేస్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ రాకెట్ ప్రయోగం పిల్లలో ఊహాశక్తిని పెంచి "నేనూ రాకెట్ చేయగలను" అనే ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. ఇది తల్లిదండ్రులు కూడా పిల్లలతో కలిసి శాస్త్రం మరియు అంతరిక్షం గురించి తెలుసుకునేలా ప్రోత్సహిస్తుంది. భారతదేశ అంతరిక్ష రంగం వేగంగా అభివృద్ధి చెందుతూ వివరాల ప్రకారం, భారతదేశ అంతరిక్ష రంగం ప్రస్తుతం 8 బిలియన్ల విలువను కలిగి ఉండగా, 2033 నాటికి 44 బిలియన్లకు చేరుకునే అవకాశం ఉంది. విద్యార్థులకు భవిష్యత్ అవకాశాలను తెరుస్తున్నదని తెలిపారు.

# తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్ (జనంసాక్షి) ం తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ 2025 –26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకారులకు ఇష్టమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ గేమ్స్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా రంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణిక్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సీఎం కప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. క్రీడాకారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేసే విధంగా సీఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంటర్ ద్వారా 24 గంటల సమాచారాన్ని క్రీడాకారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. 44 క్రీడాంశాలు 12 జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీలు విజయవంతం కావాలని ఈ క్రీడలనుంచి మంచి ఛాంపియన్లు వృద్ధిలోకి రావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు పలువురు పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీలకు రూ.256కోట్ల నిధులు విడుదల

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు మంగళవారం గ్రామ పంచాయతీలకు రూ.256 కోట్ల నిధులు విడుదల చేశారు.



### బత్తుల సోమయ్యకు డాక్టర్ చెరుకు సుధాకర్, అనంతుల మధు పరామర్శ

ఖమ్మం (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయల పాలై ఖమ్మం లోని ఒక ప్రయివేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తెలంగాణ బత్తుల సోమయ్య, వారి భార్య పంకజ గారి తీవ్ర ఖమ్మం జిల్లా కేంద్రం లో గల భవాని హాస్పిటల్ లో తెలంగాణ ఉద్యమ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు పరామర్శించారు. భవాని హాస్పిటల్ నిర్వహకులు డాక్టర్ రవికుమార్‌తో సోమయ్య దంపతులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పరామర్శించిన వారిలో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర నాయకులు ాఖ రహమాత్ పాషా, ముక్కామల శ్రీను ఉన్నారు.

### ఐఎఎస్ శ్రీలక్ష్మికి దక్కని ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : వైసిపి అధినేత వైఎస్.జగన్ అక్రమస్తుల కేసులో ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. జగన్ అక్రమాస్తుల కేసులో తన పేరును తొలగించాలని కోర్టులో దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఈ పిటిషన్ రిజెక్ట్ చేసింది. ఓబులాపురం గనుల కేసులో నిబంధనలకు అనుగుణంగా వెళ్లానని ఐఎఎస్ శ్రీలక్ష్మి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. అయితే శ్రీలక్ష్మి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆమె మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని ధర్మాసనానికి సిబిఐ వెల్లడించింది. ఆమె లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్ష్యాలు వాంగ్మూలం ఇచ్చారని సుప్రీం ధర్మాసనానికి సిబిఐ అధికారులు తెలిపారు. విచారణ అనంతరం శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

# పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలి

- గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్



మహబూబాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నాయకుల ఆశయం పాఠశాలలో ఈ రోజు ఆశ్రమ పాఠశాలల హెడ్మాస్టర్లు మరియు హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్ అధ్యక్షత వహించారు. సమావేశంలో మాట్లాడుతూ, పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు, హెడ్మాస్టర్ మరియు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులకు అదనపు బోధన అందించాలని ఆదేశించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు మరియు వసతి సౌకర్యాలు అందించాల్సిన బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఈ విషయంలో ఏటిడిఓ లు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏటిడిఓ భాస్కర్, ఉపేందర్, ఏసిఎంఓ రాములు, డిప్యూటీ ఇఓ సారయ్య, జీసీడిఓ విజయ, ఎస్ఓ కొమ్మలు, డిఆర్పి శ్రీకాంత్, అకౌంటెంట్ సుహాసిని మరియు ఆశ్రమ పాఠశాలల హెడ్మాస్టర్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ మాసంలో ప్రభుత్వం ద్వారా
# మౌలిక సౌకర్యాలు కల్పించండి

- ఇఫ్తార్ వేళల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల నుంచి ట్రాఫిక్ చాలన్లను మినహాయించండి
- అధికారులకు ఎంఐఎం నేతల వినతి పత్రం



కరీంనగర్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : ఫిబ్రవరి 19వ నంచి పవిత్రమైన రమజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నగరంలోని అన్ని మస్జిదుల వద్ద, ముస్లిం కాలనీల్లో అధికారులు చేయాల్సినటువంటి ఏర్పాట్లపై కరీంనగర్ ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు, జిల్లా సీపీకి, నగరపాలక సంస్థ కమిషనర్ కు జిల్లా ట్రాన్స్కో ఎన్పీడీసీఎల్ ఎస్ఈలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. రంజాన్ పండగ ఏర్పాట్లకు ప్రభుత్వం ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రంజాన్ నెలలో నగరంలో ముస్లిం కాలనీల్లో, మస్జిద్ లలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదుల వద్ద నీటి ట్యాంకర్ల ఏర్పాటు చేయడంతో పాటు, నగరంలో నీటి ట్యాంకర్ల కొరత లేకుండా చూడాలని సూచించారు. నగరంలో మసీదుల వద్ద అదనపు క్లీనింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎక్కడ కూడా అపరిశుభ్ర వాతావరం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైనేజి లను శుభ్రపరచాలని, మస్జిద్ లలో పనిచేస్తున్న ఇమామ్ లకు ,మౌజన్ లకు జీతాలు రిలీజ్ చేయాలన్నారు. రంజాన్ నెల కోసం కరీంనగర్లో ఏర్పాటు చేసిన విధంగా అన్ని మున్సిపల్ ఏరియాలో గ్రామాలలో ఏర్పాటు చేయాలని కోరారు. దింతో పాటు నగరంలో కిరాణా షాపులు, ఫ్రూట్స్, కూరగాయలు, హోటల్స్, హరీస్ స్టాల్స్ లకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, పుట్ పాత్‌ల వద్ద అమ్ముకునే చిరు వ్యాపారులను పోలీసులు ఇబ్బందులు పెట్టకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కు.. పోలీస్ కమిషనర్ కు నగరపాలక సంస్థ కమిషనర్కు ఎంఐఎం నేతలు విజ్ఞప్తి చేశారు. వేసవికాలం దృష్ట్యా రంజాన్ నెలలో నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అదనపు లోడ్ పడినపుడు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రీట్ లైట్స్ ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు మసీదుల వద్ద లైటింగ్ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.. చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేపట్టాలని చెత్త సేకరణ ఆటోలు పూర్తిగా అన్ని కాలనీలో తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్, ఏసీపీ లు మాట్లాడుతూ రంజాన్ నెలను ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా జరుపుకోవాలని సూచించారు. రంజాన్ నెలకు సంబంధించి ఏర్పాట్లపై త్వరలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఎంఐఎం నేతలు కోరిన విధంగా రంజాన్ మాసం సందర్భంగా షాపులు 24 గంటలు నడుపుకోవడాన్ని పరిశీలించాలన్నారు.. పుట్ పాత్ ల పై ఉండే చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రంజాన్ నెలలో ఇఫ్తార్ తో పాటు సహార్ సమయాల్లో తనిఖిల పేరుతొ, చాలన్ల పేరుతో ఇబ్బందులు కలిగించద్దని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని టౌన్ ఏసీపీకి కు ఎంఐఎం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, జాయింట్ సెక్రటరీలు హాఫీజ్ యూసుఫ్, ఆతిన, కోశాధికారి ఇబ్రహీం, కార్పొరేటర్లు మొహసీన్ మొహియుద్దీన్, మాజిద్ హుస్సేన్, నాయకులు బాబుజానీ, అరిఫ్ అహ్మద్, తాజుద్దీన్, షబ్బీర్, శ్రీనివాస్, రాజు, సురేశ్, సుధాకర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## బహ్రెయిన్ ఎన్నారై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో
# కేసీఆర్ జన్మదిన వేడుకలు



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర జాతిపిత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ ఆధ్వర్యంలో బహ్రెయిన్‌లోని అండాలస్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ అధ్యక్షుడు రాధారపు సతీష్ కుమార్ అధ్యక్షతన కేక్ కట్ చేశారు. ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ అధ్యక్షుడు రాధారపు సతీష్ కుమార్ ,ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను, 62ఏళ్ల కలను సాకారం చేయడమే కాకుండాతన ప్రాణాల్ని పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ జాతిపితగా ప్రజల హృదయాల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సొంతం చేసుకున్నారు కేసీఆర్. నా రాష్ట్రం నాకు ముఖ్యం , నా ప్రాణం తెలంగాణ , తెలంగాణ కి నీళ్లు రావాలె ,నా ప్రజలు బాగుపడాలే నేను కండ్లకర చూసి సంతోషపడాలన్నదే నాలక్ష్యం. అదే స్ఫూర్తి, అదే పట్టుదలతో ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణకు రెండు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చడమే కాకుండా తెలంగాణను అభివృద్ధిలో, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారు. రాష్ట్రం ఏర్పడిన పదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించింది . నిజం నిప్పులాంటిది అబద్దాలతో కప్పివేయాలని చుస్తే దాగదు . పదేండ్లలో కేసీఆర్ సాధించిన ప్రగతి కేంద్రం ప్రకటించిన ఆర్థిక సర్వే నివేదికతో స్పష్టమైంది. ఇప్పటికే కాగ్ రిపోర్ట్ , నీతి ఆయోగ్ తో పాటు అంతర్జాతీయ సంస్థలు కూడా తెలంగాణ లో జరిగిన అభివృద్ధిని గుర్తించాయి . కేసీఆర్ పాలనపై దుష్ప్రచారం చేసేరాజకీయ నేతలు ఇప్పటికైనా మార్చుకోవాలి అన్నారు. తెలంగాణ ప్రజలు కన్న కలలు సాకారం కావాలంటే రాబోవు రోజుల్లో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాక్షించారు. భగవంతుడి ఆశీర్వాదం తో నిండు నూరేళ్లు చల్లగా, ఆయురోగ్యాలతో ఉండాలని అన్నారు. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు కేసీఆర్ వెంట ఎలా ఉన్నామో, భవిష్యత్తులో కూడా వారి వెంటే ఉంటామని రాధారపు సతీష్ కుమార్ తెలిపారు. ఈకార్యక్రమములో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్ , ప్రధాన కార్యదర్శి , అన్నారం సుమన్ , కార్యదర్శులు , చెన్నమనేని రాజేందర్ , ఉత్కం కిరణ్ గౌడ్, మల్లెల ప్రమోద్ , పుప్పలవాయి వంశీ బిఆర్ఎస్ నాయుకులు హాజరైన వారిలో వున్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : వివాహాది శుభకార్యాల సీజన్ మొదలైన వేళ బంగారం ధరలు స్వల్పంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గడచిన రెండు రోజుల్లో రూ.2,840 మేర ధర తగ్గడం విశేషం. ఇక అభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. బంగారంతో పాటే వెండి ధర కూడా భారీగా పతనమై కేజీ ధర రూ.2,65,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల మార్కు నుంచి 4,930 డాలర్ల స్థాయికి పడిపోవడంతో దేశీయంగా కూడా ధరలు దిగొచ్చాయి. దానికి తోడు డాలర్ విలువలో మార్పులు కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.

# ఎప్‌స్టీన్ ఫైల్స్: భారత్ ద్వంద్వ వైఖరి

## బిల్ గేట్స్‌కు ఆహ్వానం లేదు.. మనవాళ్లకు ఎందుకు పదవులు నుండి మినహాయింపు?



జెఫ్రీ ఎప్‌స్టీన్ పేరు నేడు ప్రపంచవ్యాప్తంగా సిగ్గు, అమానవీయత మరియు దుర్మార్గానికి పర్యాయపదంగా మారిపోయింది. ఆ అమెరి కన్ ఫైనాన్షియర్, చైల్డ్ సెక్స్ నేరస్తుడి అక్రమాలను ఆవిష్కరించిన ఎప్‌స్టీన్ ఫైల్స్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. అతని విమానాలలో, అతని ద్వీపాలలో జరిగిన అమానుష ఘటనలలో ప్రముఖ రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు పాల్గొన్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఫైల్స్ లో మైక్రో సాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేరు ఉండటం, ఆయన రష్యన్ మహిళలతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఆరోపణలు రావడం, దీనిపై ఆయన క్షమాపణలు చెప్పడం జరిగింది. అయితే ఇక్కడ ప్రశ్న ఒక్క వ్యక్తి గురించి మాత్రమే కాదు, ఇది సామాజిక న్యాయం, నైతికత మరియు చట్టం ముందు సమానత్వం గురించి.

ప్రపంచ దేశాలు ఈ ఫైల్స్ వెల్లడైన తర్వాత ఎలా స్పందించాయి? యూరోపియన్ దేశాలలో తమ పేర్లు వెల్లడైన ప్రముఖులు స్వయం గా రాజీనామాలు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులు, సమా జం, వారు పనిచేస్తున్న సంస్థలు వారిని దూరం పెట్టాయి. ఇది చూపించేది ఒక్కటే – అమానవీయ చర్యలకు పాల్పడిన వారెంతటి ఉన్నత స్థానంలో ఉన్నా వారిని సమాజం నుండి బహిష్కరించాలన్న సామాజిక నిబద్ధత. ఇది కేవలం చట్టానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు, అది మానవత్వానికి సంబంధించిన ప్రశ్న.

ఈ నేపథ్యంలో భారతదేశం తీసుకున్న వైఖరి ఆలోచనీయం. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న కృత్రిమ మేధపై శిఖరాగ్ర సదస్సుకు బిల్ గేట్స్‌ను ఆహ్వానించకూడదని నిర్ణయించడం సరైన దిశగా తీసుకున్న మంచి అడుగు. ఎప్‌స్టీన్ ఫైల్స్ నేపథ్యంలో బాధితుల పక్షాన నిలబడాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇది సానుకూలమైన చర్య. కానీ ప్రశ్న ఒక్కటే – ఇది సరిపోతుందా? భారతదేశం ఇంతటితో ఆగిపోవచ్చా?

వాస్తవానికి ప్రస్తుత కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి పేరు కూడా ఎప్‌స్టీన్ ఫైల్స్ లో ఉన్న విషయం తెలిసిందే. ఈ విషయం వెల్లడైన తర్వాత ఆయన ఎలాంటి చర్యలు తీసుకోలేదు ఎందుకు ? సిగ్గుచేటు ఇంకా తన పదవిలో కొనసాగుతున్నారు. ఇక్కడే మనం రెండు మార్గాలను చూడవచ్చు. బిల్ గేట్స్ విషయంలో బాధితుల పక్షాన నిలబడి ఆయనను సదస్సుకు ఆహ్వానించకూడదని నిర్ణయించిన భారత ప్రభుత్వం, తన సొంత మంత్రి విషయంలో ఎందుకు అలాంటి నిబద్ధత చూపించడం లేదు? ఇది ద్వంద్వ ప్రమాణం కాదా?

చిన్న పిల్లలతో అమానుషంగా ప్రవర్తించిన వారి పట్ల సమాజం చూపించాల్సిన వైఖరి చాలా కఠినంగా ఉండాలి. అలాంటి నేరస్థులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా వారినైనా సరే ఉపేక్షించేది లేదు. వెంటనే ఆ పదవుల నుండి తప్పించాలి. వారి కుటుంబ సభ్యులు, సమాజం, వారు పనిచేస్తున్న సంస్థలు వారిని బహిష్కరించాలి. చట్టం వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇది కేవలం ప్రతీకారం కోసం కాదు, ఇది సామాజిక న్యాయం కోసం, భవిష్యత్తులో ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా నిరోధించడానికి, బాధితులకు న్యాయం చేయడానికి.

యూరోపియన్ దేశాలలో చూస్తున్నాం, అక్కడ తమ పేర్లు వెల్లడైన ప్రముఖులు స్వయంగా రాజీనామాలు చేసుకుంటున్నారు. ఎందుకంటే అక్కడ సామాజిక ఒత్తిడి, నైతిక బాధ్యత, చట్టపరమైన చర్యల భయం ఉన్నాయి. అక్కడి సమాజం ఇలాంటి నేరాలను క్షమించదు. భారతదేశంలో కూడా ఇదే వైఖరి ఉండాలి. తమ పేర్లు ఎప్‌స్టీన్ ఫైల్స్ లో ఉన్నవారు – వారు ఏ పార్టీకి చెందినవారైనా, ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా – వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలి. ఇది వారి వ్యక్తిగత నైతికతకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, ఇది దేశం మొత్తం మీద నమ్మకానికి సంబంధించిన విషయం. భారత ప్రభుత్వం కూడా ఈ విషయంలో స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. ఎప్‌స్టీన్ ఫైల్స్ లో పేర్లు ఉన్న వారిపై స్వతంత్ర విచారణ జరపాలి. నిజమైన నేరస్థులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇది అంతర్జాతీయ సమాజానికి భారతదేశం న్యాయం పట్ల, మానవత్వం పట్ల తనకున్న నిబద్ధతను చూపించే అవకాశం.

బిల్ గేట్స్ ను సదస్సుకు ఆహ్వానించకూడదన్న నిర్ణయం ఒక మంచి ప్రారంభం. కానీ ఇది ఆరంభం మాత్రమే. నిజమైన పరీక్ష మన దేశంలోనే ఉన్న వారి విషయంలో ఎలా వ్యవహరిస్తామన్నది. మనం మన సొంత వారి విషయంలో కూడా అదే నైతిక ప్రమాణాలను అన్వయించుకోగలమా? లేదంటే మనకు విదేశీయుల విషయంలో మాత్రమే నైతికత ఉంటుందా?

చివరగా, ఇది కేవలం కొంతమంది వ్యక్తుల గురించిన చర్చ మాత్రమే కాదు. ఇది సమాజంగా మనం ఎలాంటి విలువలను కలిగి ఉన్నామనే ప్రశ్న. చిన్న పిల్లలతో అమానుషంగా ప్రవర్తించే వారిని మనం క్షమించగలమా? వారిని ఉన్నత పదవులలో కొనసాగనివ్వ గలమా? ఇది మన సామాజిక నైతికతకు పెద్ద సవాల్. ఈ సవాల్ ను ఎదుర్కొనే సమయం ఆసన్నమైంది. మన నిర్ణయాలు మన దేశం యొక్క ముఖాన్ని ప్రపంచానికి చూపిస్తాయి. కాబట్టి సరైన నిర్ణయం తీసుకోవడం మనందరి బాధ్యత.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# తుపాకీల స్వర్గంలో మరణంమే శాశ్వతం



నగరం ఉదయం లేచే ముందే లోడ్లు తేస్తాయి. మెట్రో మొదటి సైరన్ వినిపించే సమయానికి శ్వాస వేగం పెరుగుతుంది. పదేళ్ల క్రితం ఊహించని ఉక్కు సర్పం పైకి పరుగెత్తుతోంది. రోడ్లు విస్తరించాయి, హైటవర్లు పెరిగాయి, విల్లాలు ఆకాశాన్ని ముట్టేట్టు విస్తరించాయి. పైకి చూస్తే పురోగతి. లోపలికి చూస్తే మనసు అడిగే ప్రశ్న -- "ఇది పురోగతేనా? లేక ప్రదర్శన మాత్రమేనా?" మెట్రోలో వేలాది ముఖాలు ఒకేలా కనిపిస్తాయి. అందరూ పరిగెడుతున్నారు, కానీ ఎందుకో తెలియదు. మొబైల్‌లో మునిగిపోయి బయట జరుగుతున్నది చూడలేకపోతున్నారు. భవనాలు పెరిగాయి, సంబంధాలు తగ్గాయి. ఒకప్పుడు బస్సులో పలకరించుకునేవారు ఇప్పుడు పక్కన కూర్చున్నా చూపుల్లోనూ పలకరించరు. నాగరికత పెరిగింది, మనిషితనం తగ్గిపోయింది. విల్లాలు రాజమందిరాల్లా ఉంటాయి. కానీ గేట్లు మూసుకున్నప్పుడే భయం మొదలవుతుంది. పెద్ద గేట్లు, సెక్యూరిటీ -- బయట ప్రపంచం నుంచి రక్షణా? లేక లోపల బందీలా? పక్కింటి మనిషి పేరు తెలియని జీవితం ఏ పురోగతి? ఒకప్పుడు సంబంధాలు సంపద. ఇప్పుడు సెక్యూరిటీ ఆస్తి. విల్లాల్లో అందమైన తోటల్లో నడుస్తారు, కానీ మనసులోని ఒంటరితనం మీద నడవలేరు. పెద్ద ఇల్లు కట్టించుకుంటారు, కానీ పిల్లలతో పది నిమిషాలు మాట్లాడే సమయం ఉండదు.

రోడ్లు పెద్దవయ్యాయి, ట్రాఫిక్ తగ్గలేదు. అవసరానికి మించిన కార్లు కొనడమే కారణం. మెట్రో స్టేషన్లు అందంగా ఉన్నాయి, ముఖాలు అలసిపోయాయి. రాత్రి పదకొండు గంటలకు కూడా రద్దీ. రాత్రి భోజనం కలిసి కూర్చోవడం నుంచి "టైం లేదు"కి మారింది. అవకాశాలు ఎక్కువ, ఆనందాలు తక్కువ. ఒకప్పుడు పాలవాడు పేరుమేరునా తెలిసినవాడు. పక్కింటి పిల్లలు మన పిల్లల్లాగే. ఇప్పుడు డిజిటల్ లాక్‌లు, బ్లాక్ చేసిన నంబర్లు -- మనుషుల్ని దూరం పెడుతున్నాం. పిల్లలు పది అడుగులు నడవరు, పెద్దలు పది నిమిషాలు నడవరు. సౌలభ్యం ఎక్కువ, ఆరోగ్యం ఎక్కడ? అభివృద్ధి అంటే ప్రశాంతత, ప్రేమ, నిబద్ధత. ఇవి లేకపోతే మెట్రో లైన్లు, విల్లా అంతస్తులు ప్రదర్శన మాత్రమే. మనం సాధించినది ఎంత? కోల్పోయింది ఎంత? మెట్రో వేగంతో వెళ్తుంటే మన మనిషితనం కింద పడిపోతోందా? ఈ ప్రశ్నకు మనమే సమాధానం కనుక్కోవాలి.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## "కూనంనేని" వ్యూహం కమ్యూనిస్టుల

# ఆత్మగౌరవానికి చిహ్నం



తెలంగాణ రాజకీయాల్లో కమ్యూనిస్టులకు ఇదో కొత్త ఊరట. దశాబ్దాల కాలంగా పొత్తుల చుట్టూ తిరుగుతున్న కమ్యూనిస్ట్ రాజకీయాలకు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఒక కొత్త దిశను చూపాయి. ఏ ప్రధాన పార్టీతోనూ పొత్తు లేకుండా, సొంత బలంతో బరిలోకి దిగి, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లను దీటుగా ఎదుర్కొని అతిపెద్ద పార్టీగా అవతరించడం సీపీఐ సాధించిన విజయంగా చెప్పక తప్పదు. ఈ విజయం వెనుక ఉన్న రాజకీయ చదరంగం, నాయకత్వ పటిమ 1977 నాటి బెంగాల్ రాజకీయాల ఛాయలను గుర్తు చేస్తున్నాయి.

గత కొన్ని ఎన్నికలుగా సీపీఐ లేదా సీపీఎం పార్టీలు ఉనికి కోసం కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవడం పరిపాటిగా మారింది. కానీ, ఈసారి కొత్తగూడెంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీసుకున్న నిర్ణయం అత్యంత సాహసోపేతమైనదిగానే చెప్పాలి. ఒక రకంగా

ఇది సాహసోపేత నిర్ణయం మాత్రమే కాదు ఈ ఒంటరి పోరు ఒక వ్యూహాత్మక రిస్క్ కూడా. ఈ రిస్క్ చేసి ఆ పార్టీ విజయం సాధించింది.

ఇక పొత్తుల వల్ల పార్టీ క్యాడర్ నిర్వీర్యం అవుతోందని గుర్తించిన కూనంనేని, "మన బలం ఎంతో మనమే నిరూపించుకుందాం" అనే నినాదంతో ముందుకు వెళ్లారు. ఒకరకంగా ఇదో అత్యున్నతమైన ఆత్మగౌరవ పోరాటం గా చూడాలి. మరోవైపు సింగరేణి గనుల చుట్టూ అల్లుకున్న కొత్తగూడెం రాజకీయాల్లో కార్మిక సంఘం బలాన్ని ఓట్ల రూపంలోకి మార్చుకోవడంలో ఆయన విజయవంతమయ్యారు. 1977లో పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు నాయకత్వంలో కమ్యూనిస్టులు ఎలాగైతే కాంగ్రెస్‌ను ఓడించి, తమ సొంత ముద్ర వేసి దశాబ్దాల పాలనకు పునాది వేశారో, ఇప్పుడు కొత్తగూడెంలో సీపీఐ గెలుపు అలాంటి ఆశలనే చిగురింపజేస్తోంది. అప్పుడు బెంగాల్‌లో ప్రజలు కాంగ్రెస్ పట్ల విసిగిపోయి కమ్యూనిస్టులను ఎలా ఆదరించారో, ఇక్కడ కూడా ప్రస్తుతం అధికార కాంగ్రెస్ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత విభేదాలను సీపీఐ తమకు అనుకూలంగా మార్చుకుంది. ఎన్నికలంటే కేవలం డబ్బు, మద్యం మాత్రమే కాదు, బలమైన కార్యకర్తల వ్యవస్థ ఉంటే విజయం సాధ్యమని ఈ ఫలితాలు నిరూపించాయని చెప్పక తప్పదు. ఈ విజయానికి ప్రధాన శిల్పి కూనంనేని సాంబశివరావు అనడంలో అతిశయోక్తి లేదు. ఆయన ఎమ్మెల్యేగా ఉంటూనే క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై ఆయన స్పందించే తీరు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించింది. పార్టీలో సీనియర్లకు, యువతకు మధ్య సమన్వయం కుదుర్చుతూ, టికెట్ల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పక్కాగా అమలు చేసినట్లుగా పరిశీస్తే అర్థం అవుతోంది. రాష్ట్ర కార్యదర్శిగా ఉంటూనే తన సొంత నియోజకవర్గ గడ్డపై పార్టీ జెండాను రెపరెపలాడించడం ద్వారా తన నాయకత్వాన్ని అధిష్టానం వద్ద మరింత సుస్థిరం చేసుకున్నారు.

ఇక కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నామనే ధీమాతో, స్థానిక నాయకత్వంలోని విభేదాలను పరిష్కరించుకోలేకపోయింది. సీపీఐతో పొత్తు లేకపోవడం వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడం కాకుండా, నేరుగా సీపీఐ ఖాతాలోకి వెళ్ళిందనేది ఫలితాలు చూస్తే అర్థం అవుతున్నది. మరోవైపు గత ఎన్నికల్లో బలమైన ఉనికి చాటిన బీఆర్ఎస్, ఈసారి కేవలం 8 సీట్లకే పరిమితం కావడం ఆ పార్టీ పతనానికి సంకేతంగా కనిపిస్తోంది. క్యాడర్ చెల్లాచెదురు కావడం, స్థానిక నాయకత్వం సీపీఐ వైపు మొగ్గు చూపడం బీఆర్ఎస్‌ను దెబ్బతీసింది.

బీజేపీ, సీపీఎం పార్టీలు జాతీయ స్థాయిలో ప్రభావం ఉన్నా... కొత్తగూడెం గడ్డపై ఈ పార్టీలు కనీస ప్రభావాన్ని కూడా చూపలేకపోయాయి. కేవలం ఒక్కో సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ కొత్తగూడెం మున్సిపల్ ఫలితాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. అయితే సీపీఐ సాధించిన ఈ విజయంతో వామపక్షాలు మళ్ళీ ఉమ్మడి కార్యాచరణ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందనే విశ్లేషణల్లో నిజం లేకపోలేదు. హంగ్ ఏర్పడిన ఈ కార్పొరేషన్‌లో మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ మేయర్ పీఠాన్ని దక్కించుకుంటే, అది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త కూటములకు దారితీయవచ్చు కూడా. ఏదిఏమైనప్పటికీ కొత్తగూడెం మున్సిపాలిటీ ఎన్నిక ల్లో సీపీఐ సాధించిన విజయం కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఇది కమ్యూనిస్ట్ పార్టీలకు ఒక సంజీవని లాంటిది. "పొత్తులు లేకపోయినా.. ప్రజా సమస్యల పై పోరాడితే విజయం వరిస్తుంది" అనే నమ్మకాన్ని ఈ ఫలితం కలిగించింది. ఈ గెలుపు తెలంగాణ రాజకీయాల్లో కూనంనేని సాంబశివరావును ఒక శక్తివంతమైన నాయకుడిగా నిలబెట్టిందనటంలో సందేహం లేదు. ఈ ఫలితంతోనైనా భవిష్యత్తులో కమ్యూనిస్టులు ఐక్యత దిశగా ఆలోచిస్తారని ఆశిద్దాం.



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

# దళిత జన బాంధవుడు భాగ్యరెడ్డి వర్మ

ఫిబ్రవరి 18... భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి



అంటరాని తనంపై ఆయన అలు పెరుగని పోరాటం చేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. జాతిపిత మహాత్మునిచే గౌరవింప బడినాడు. తాను నమ్మిన సత్యాలను అందరికీ తెలిపి సమాజంలో చైతన్యం తేవడానికి నిస్వార్థసేవ చేశాడు. దళిత స్త్రీల స్థాయిని దిగజార్చి, దేవాలయాల్లో దేవతలకు అంకితమైన అవివాహిత మహిళలు దేవదాసీలుగా, జోగినులుగా, పార్వతు లుగా, జీవితాలను అంకితం చేసే జోగినీ వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యతిరేకత, దళితులలో విద్యా వ్యాప్తి, అసమానత లేని సమాజం కోసం అవిశ్రాంత కృషి చేశాడు. మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందు వులం..' అని గర్వంగా చాటాడు. అంటరాని వారుగా దూరంగా ఉంచ బడిన వారిని "ఆది హిందువులు"గా భారత దేశంలో తొట్టతొలుత నివసించిన సంతతిగా ఆయన నొక్కి చెప్పాడు. నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో దళితో ద్యమానికి బాటలు వేసిన ఆ మహానేతనే భాగ్యరెడ్డి వర్మ. హరిజన పదం తెలంగా ణ ప్రాంతంలో వ్యాప్తిలో లేని కాలంలో ఆది హిందువు లుగా, ఆది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్నవర్గ ప్రజలు తమను తాము ప్రకటించు కోవాలని కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, మాడపాటి హనుమంతరావుల సహకారంతో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశాడు. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ సంస్థానానికే పరిమితం కాక, తెలుగు నేలపై పలు ప్రాంతాలకూ విస్తరించాడు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు.

దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22, 1888 – ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్క ర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థా నంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరా బాదు ప్రాంతంలో సంఘ సంస్కర ణలకై కృషి చేశాడు.

మాదరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన జన్మించిన భాగ య్యకు,1888 నవంబరులో వారి కుటుంబ గురువు భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామ కరణం చేశాడు. ఆయన కుల శైవమత గురువు బోధనలు చేసేవారు.

ఆర్యులు హిందూ దేశానికి వలస రాకముందు, అస్పృశ్యులుగా సమాజంచే ముద్ర వేయబడిన ఆది హిందువులే పాలకులని గురువు వాదం. "రెడ్డి" అన్నది పాలకుడనే అర్థం గల "రేడు" అనే పదం నుంచి ఉద్భవించిందని, అందుచేతనే మాదిరి వెంకయ్యగారి భాగ్యయ్యకు రెడ్డిని జత చేశానని ఆయన చెప్పారు. ఆ తర్వాత 1913లో మాదిరి భాగ్యరెడ్డి హిందూ సమాజానికి చేసిన అపూర్వ సేవలకు గుర్తింపుగా ఆర్య సమాజ్ "వర్మ" అనే బిరుదు ప్రదానం చేశారు. ఆనాటి నుండి బాగయ్య భాగ్యరెడ్డిగా మారి, మాదిరి భాగ్యరెడ్డి వర్మగా, ఎం.వి. భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధికెక్కాడు.1913లో 'ఆర్య సమాజ్' ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందాడు. భాగ్యరెడ్డి 1906లో షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్య కోసం హైదరాబాదు లోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించాడు. హరిజనులలో విద్యావశ్యకతను గుర్తించి 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాడు.

భాగ్యరెడ్డి వర్మ అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి, జగన్మిత్ర మండలి కార్యకలాపాలు మన్య సంఘం ద్వారా కొన సాగించాడు. మన్య సంఘం అంటరాని కులాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావటానికి ప్రయత్నించింది. కొంతమంది ఉన్నత కులాల హిందువులు కూడా ఈ భజన మండళ్లను ప్రోత్సహించారు. మన్య సంఘం ఆధ్వర్యంలో ఈ భజన మండళ్లు రీడింగ్ రూములు ఏర్పరచి అందులో ఆంధ్రప్రత్రిక, దీనబంధు మొదలైన పత్రికలను అందుబాటులో ఉంచాయి. ప్రదానంగా దళిత మహిళను, ఆ తర్వాత వెనకబడిన తరగతులకు చెందిన యువతులను ప్రత్యేకంగా దేవునికి అంకితమిచ్చే కార్యక్రమాలు నైజాం రాజ్యం లోని తెలంగాణ, మరట్వాడా, కన్నడ ప్రాంతాల్లో పురోహితులనబడే జంగాలు నిర్వహించేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి భాగ్యరెడ్డి వర్మ దూరదృష్టితో కార్యాచరణ చేపట్టాడు. ఆయన కృషివల్ల నిజాం దేవదాసి వ్యవస్థను నిర్మూలించాడు.

1917లో బెజవాడలో జరిగిన తొలి పంచమ మహా సభకు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించాడు. ఈ మహాసభలో ఆయన ప్రసంగానికి ప్రభావితులైన నిర్వాహకులు "ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర మహాసభ"గా పేరు మార్చారు. తర్వాత 1919లో బందరులో, 1921లో ఏలూరు, భీమవరం, 1925లో అనంతపూర్, 1933లో నాగపూర్, 1938లో కాకినాడ తదితర చోట్ల జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించాడు. 1917లో విజయ వాడలో ఆంధ్ర పంచమ మహాజన సభలో, భాగ్యరెడ్డి వర్మ, ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచము లనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్ట మొదటి నుండి స్థానికులైన ప్రజలు పంచములే కాబట్టి, ఆది ఆంధ్రులనే వ్యవహారం సరైనదని తీర్మానించాడు. 1917 నుండి 1938 వరకు ఆది ఆంధ్ర మహా సభలు దాదాపు ప్రతి ఏటా జరిగాయి. అంటరాని వారిని ఆది హిందువులుగా పిలవాలని డిమాండు చేశారు. ఈ ఆది ఆంధ్ర మహాజన సభల ప్రభావంతో 1931 జనాభా లెక్కలలో మాల, మాదిగ, ధేర్, చమర్ లాంటి వారికి నిజాం ప్రభుత్వం ఆది హిందువులుగా పేర్కొన్నది.

1933 కల్లా ఆది – హిందూ సోషల్ సర్వీసు లీగు ఆధ్వర్యంలో 26 పాఠశా లలు ప్రారంభ మయ్యాయి. వీటిలో దాదాపు 2600 మంది విద్యార్థులకు చదువు చెప్పేవారు. భాగ్యరెడ్డి వర్మకు హిందూమతంపై విశ్వాసం లేక మొదట్లో అర్య సమాజం, బ్రహ్మసమాజం బోధనలను పాటించేవాడు. తర్వాత బౌద్ధం పట్ల ఆకర్షితు డయ్యాడు. గౌతమ బుద్ధుడు ప్రవచించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాల పట్ల ఆకర్షితుడయ్యా డు. 1913 నుండి ప్రతి వైశాఖ పూర్ణిమ రోజున బుద్ధ జయంతిని జరుపు కొనే వాడు. తన ఏకైక కుమారునికి గౌతమ్ అని పేరు పెట్టుకున్నాడు.

1917 డిసెంబర్ 15వ తేదీన కలకత్తాలో మహాత్మా గాంధీ పాల్గొన్న "అఖిల భారత హిందూ సంస్కరణ మహాసభ"లో భాగ్యరెడ్డి వర్మ కూడా పాల్గొని, అనర్గళంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా చేసిన ప్రసంగం గాంధీజీని సైతం ఆకర్షించింది. మరునాట కలకత్తాలో మహాత్మా గాంధీ అధ్యక్షతన మరో సమావేశంలో పాల్గొనడానికి భాగ్య రెడ్డిని ఆహ్వానించి, వేదిక మీదకు తీసుకు రావడానికి తన ప్రైవేట్ కార్యదర్శిని పంపి, భాగ్యరెడ్డిని, గాంధీజీ తన ప్రక్కన కూర్చో బెట్టు కోవడాన్ని బట్టి ఆయన పట్ల గాంధీకి ఎంత గౌరవమో స్పష్ట మౌతున్నది. భాగ్యరెడ్డి వర్మ దళితుల నుద్దేశించి...'దళితులే ఈ దేశపు మూల వాసులు. అవిద్య, అజ్ఞానం వల్ల మాత్రమే దళితులు వెనకబడి ఉన్నారు" అని ఆయన బోధించే వారట. దక్కన్‌లో భాగ్యరెడ్డి వర్మ నిర్మించిన ఆదిజన ఉద్యమం దేశవ్యాపితంగా నడిచిన ఆదిజన మూలవాసీ ఉద్యమానికి అనుసంధాన కర్తగా పనిచేసింది. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్య నగర్ అనే పత్రికలో సాహిత్యంలో తొలిసారిగా తాను రాసిన నవల వెట్టి మాదిగ సాహిత్యాన్ని తానే తొలిసారి ప్రచురించాడు. అస్పృశ్యతా నివారణకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషికి, గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఇసామియా బజార్ ప్రధాన రోడ్‌కు 'భాగ్యరెడ్డి వర్మ మార్గ్' అని నగర పాలక సంస్థ దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే నామకరణం చేయడం విశేషం. భాగ్య రెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో హైదరా బాదులో మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## తెలంగాణలో ప్రైవేటు మెడికల్

# యాజమాన్యాల 'స్టైఫండ్' దగా




తెలంగాణలోని ప్రైవేటు మెడికల్ కళాశాలలు నేడు విద్యా సంస్థలుగా కాకుండా, విద్యార్థుల శ్రమను పిండుకునే కార్పొరేట్ కంపెనీలుగా మారిపో యాయి. ముఖ్యంగా హౌస్ సర్జన్లు (MBBS Interns) మరియు పీజీ విద్యార్థులకు చెల్లించాల్సిన స్టైఫండ్ విషయంలో యాజమాన్యాలు అనుసరి స్తున్న తీరు అత్యంత క్రూరంగా ఉంది.

నేషనల్ మెడికల్ కమిషన్ (NMC) నిబంధనల ప్రకారం, ప్రతి నెల నిర్ణీత తేదీలోపు విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో స్టైఫండ్ జమ కావాలి. కానీ, రాష్ట్రంలోని మెజారిటీ ప్రైవేటు కళాశాలల్లో ఆరు నెలల నుంచి ఏడాది వరకు బకాయిలు ఉంటున్నాయి. అసలు స్టైఫండ్ అనేది విద్యార్థులకు ఇచ్చే దానం కాదు, అది వారు ఆసుపత్రిలో చేసే అలుపెరగని సేవకు దక్కాల్సిన కనీస వేతనం. వీరు ఆసుపత్రిలో 24 గంటల ఆన్-కాల్ డ్యూటీలు, ఎమర్జెన్సీ వార్డుల్లో తీవ్రఒత్తిడి, ప్రసవాలు, ఆపరేషన్లలో సహాయం, ఇలా అన్నింట్లోనూ వీరే కీలకంగా ఉంటున్నారు. ఇంత శ్రమ చేస్తున్న వారిని శ్రమను యాజమాన్యాలు దోచుకుంటున్నాయి. వారికి జీతాల దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఆర్థిక కష్టాల సాకులు చెబుతున్నాయి.

ఈ స్టైఫండ్ దగా వెనుక అనేక దందాలు నడుస్తున్నాయి. . అనేక కళాశా లలు ఎన్.ఎం.సి తనిఖీల సమయంలో మాత్రం రికార్డుల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో స్టైఫండ్ ఇస్తున్నట్లు చూపిస్తున్నాయి. ఇందుకోసం విద్యార్థుల తో బలవంతంగా ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకోవడం లేదా వారి ఏటీఎం కార్డులను యాజమాన్యాలే దగ్గర పెట్టుకోవడం వంటి విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బ్యాంకు ఖాతాలోకి నగదు జమ అయిన వెంటనే, విద్యార్థులను వెంటబెట్టుకుని వెళ్లి బ్యాంకులో నగదు విత్ డ్రా చేయించి, తిరిగి కళాశాల కౌంటర్లో కట్టించుకుంటున్న ఉదంతాలు అనేకం. దీనిని ప్రశ్నించిన విద్యార్థులపై 'అకడమిక్ టెర్రరిజం' ప్రయోగిస్తున్నారు. ఇంటర్నల్ మార్కులు తగ్గించడం, అటెండెన్స్ లేదని పరీక్షలకు కూర్చోనివ్వక పోవడం, చివరికి సర్టిఫికెట్లు ఆపేస్తామని బెదిరించడం వంటి చర్యల ద్వారా విద్యార్థుల గొంతు నొక్కుతున్నారు.కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన నిరసన సమయంలో, గత 18 నెలలుగా స్టైఫండ్ ఇవ్వలేదని విద్యార్థులు ఆరోపించారు. ఒక విద్యార్థికి నెలకు ₹60 వేల చొప్పున లెక్కిస్తే, 18 నెలలకు గానూ ఒక్కో విద్యార్థికి రావాల్సిన ₹10.8 లక్షల సొమ్మును కాలేజీ యాజమాన్యం అక్రమంగా వాడుకుంది.

మరోవైపు, ప్రభుత్వం ప్రైవేటు కాలేజీల్లో ఫీజులను భారీగా పెంచడానికి అనుమతులు ఇస్తోంది కానీ, అదే స్థాయిలో విద్యార్థుల హక్కులను కాపాడటంలో విఫలమవుతోంది.తెలంగాణ ప్రభుత్వం 2025 జూన్ 28న జి.వో.నెం:90 ద్వారా వైద్య విద్యార్థులు స్టైఫండ్ 15% పెంచుతూ విడుదల చేసింది. దీని ప్రకారం హౌస్ సర్జన్లుకు రూ 29,792, పి.జి.మొదటి సంవత్సరం విద్యార్థులకు 67,032 చెల్లించాలి. కానీ ఉత్తర్వులు అమలు చేయడం లేదు. పైగా ఇచ్చే స్టైఫండ్‌లో పూర్తిగా ఇవ్వడం లేదు. కామినేని (నార్కెట్ పల్లి, హైదరాబాద్),సురభి(సిద్దిపేట),పట్నం మహేందర్ రెడ్డి(చెవేళ్ళ),అయాన్(రంగారెడ్డి)మల్లారెడ్డి(మేడ్చల్),షాదన్, డా.వి.ఆర్.కె,కళాశాలలు విద్యార్థులకు ఒక్క రూపాయి చెల్లించడం లేదు. నామమాత్రంగా ఎం.ఎన్.ఆర్ రూ:2080(సంగారెడ్డి),భాస్కర రూ:2000 (రంగారెడ్డి), మమత రూ: 2000 (ఖమ్మం) చెల్లిస్తున్నారు.ఈ మెడికల్ కళాశాలలపై ఎన్నో ఫిర్యాదులు వచ్చినా, వైద్యారోగ్య శాఖ,కాళోజీ హెల్త్ యూనివర్శిటీ గానీ కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రాష్ట్ర వైద్య విశ్వవిద్యాలయం (KNRUHS) కూడా కేవలం నోటీసులతోనే సరిపెడు తోంది తప్ప, గుర్తింపు రద్దు వంటి గట్టి హెచ్చరికలు చేయడం లేదు.

తెలంగాణలో ప్రస్తుతం 27కు పైగా ప్రైవేటు మెడికల్ కళాశాలలు ఉండగా, అందులో దాదాపు 15 కళాశాలలపై స్టైఫండ్ ఎగవేత ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. నేషనల్ మెడికల్ కమిషన్ (NMC) 2024-25 నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని 70% ప్రైవేటు కాలేజీలు విద్యార్థులకు పూర్తిస్థాయి స్టైఫండ్ చెల్లించడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హౌస్ సర్జన్లకు నెలవారీ ₹29,792 చెల్లించాల్సి ఉండగా, చాలా కాలేజీలు కేవలం ₹5,000 నుండి ₹10,000 మాత్రమే ఇస్తున్నాయి. అంటే, ప్రతి విద్యార్థి నుండి యాజమాన్యాలు నెలకు సగటున ₹20,000 నుండి ₹25,000 వరకు అక్రమంగా మిగుల్చుకుంటున్నాయి. ఒక కాలేజీలో 150 మంది హౌస్ సర్జన్లు ఉన్నారనుకుంటే, కేవలం వారి నుండే యాజమాన్యం నెలకు ₹30 లక్షల నుంచి ₹37 లక్షల వరకు శ్రమ దోపిడీ చేస్తోంది.నేషనల్ మెడికల్ కమిషన్ (చీవీజ) సెక్షన్ 13 కింద స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, కళాశాలలు విద్యార్థుల ఏటీఎం కార్డులను తమ వద్దే ఉంచుకోవడం లేదా బలవంతంగా సంతకాలు తీసుకోవడం వంటి క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నాయి.

ఒక విద్యార్థి తన చదువు కోసం లక్షల రూపాయలు అప్పు చేసి, కనీసం తన ఖర్చులకైనా స్టైఫండ్ వస్తుందని ఆశిస్తే, ఆ ఆశను ఈ యాజమాన్యాలు చిదిమేస్తున్నాయి. ఈ దోపిడీ కేవలం ఆర్థికపరమైనది మాత్రమే కాదు, ఇది ఒక మానసిక వేధింపు. సమాజానికి ప్రాణదాతలుగా నిలవాల్సిన వైద్యులను, తమ వృత్తి జీవితం ప్రారంభంలోనే ఇలాంటి అవినీతి కూపంలోకి నెట్టడం దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం.

ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని, ప్రతి ప్రైవేటు కళాశాల స్టైఫండ్ చెల్లింపులను పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక అథారిటీని నియమించాలి. చెల్లింపుల్లో జాప్యం జరిగితే ఆయా కాలేజీలపై భారీ జరిమానాలు విధించాలి.

గత రెండేళ్లలో ఈడీ (ED) జరిపిన దాడుల్లో దాదాపు 12 మెడికల్ కాలేజీలకు చెందిన ₹500 కోట్లకు పైగా ఆస్తుల అక్రమ లావాదేవీల చిట్టా బయటపడింది. ప్రభుత్వం కేవలం కమిటీలను వేసి కాలయాపన చేయకుండా, ఎన్.ఎం.సి (చీవీజ) అధికారాలను ఉపయోగించి, నిబంధనలు ఉల్లంఘించే కాలేజీలపై భారీ జరిమానాలు విధించాలి. అలాగే ప్రతి విద్యార్థికి బయోమెట్రిక్ హాజరుతో పాటు, వారి బ్యాంక్ ఖాతాలను నేరుగా ప్రభుత్వ పోర్టల్‌కు అనుసంధానించడం ద్వారానే ఈ శ్రమ దోపిడీకి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.



టి.నాగరాజు
ఎస్.ఎఫ్.ఐ.రాష్ట్ర కార్యదర్శి
ఫోన్:9490098292

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీలేని కృషి చేద్దాం

- పిఏసి చైర్మన్ అరికెపూడి



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ప్రతి మనిషి ప్రశాంతంగా జీవించే హక్కు ఉంటుందని, ట్రాఫిక్ రహిత భవిష్యత్తు నిర్మాణంకోసం ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు కొండాపూర్ డివిజన్ పరిధిలోని వైట్ ఫీల్డ్ లోగల శ్రీ రామాలయం దేవాలయం నుండి అంజయ్య నగర్ వరకు నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై చేపట్టాల్సిన చర్యల నిమిత్తం డిసి బాలకృష్ణ, ట్రాఫిక్ సిఐ సురేష్, ఇతర అధికారులతో కలిసి ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ వైట్ ఫీల్డ్ కాలనీ వాసుల విజ్ఞప్తి మెరుకు మంగళవారం కాలనీలో పాదయాత్ర చేయడం జరిగినది అని, వైట్ ఫీల్డ్ రామాలయం దేవాలయం నుండి అంజయ్య నగర్ వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై చేపట్టాల్సిన చర్యలలో భాగంగా రోడ్డు విస్తరణను నిర్వహించాల్సిన తీరుతన్నులపై ఆయన ప్రత్యక్షంగా అధికారులతో చర్చించారు. సాఫ్ట్ వెర్ ఉద్యోగులు, పాఠశాలలకు, కళశాలలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగులకు, వ్యాపారస్తులకు నిత్యం ఎటువంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, వాహన దారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టడం జరుగుతుందన్నారు. రోడ్డు ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తూ వాటిని పూర్తిగా తొలగిస్తామని అరికపూడి స్పష్టం చేశారు. వైట్ ఫీల్డ్ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని, రోడ్లు, డ్రైనేజి, స్ట్రీట్ లైట్స్ తదితర ఇతర మౌలిక వసతులపై అసోసియేషన్ సభ్యులతో చర్చించడంద్వారా మెరుగైన ప్రణాళికలను అమలు చేయడానికి మార్గం సుగమమవుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను తొలగించి అనుకూల ప్రదేశాలకు మార్చాలని, అవసరమున్నచోట రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళల్లో ప్రజలకు అందుబాటులోకి ఉంటూ మెరుగైన ప్రజా జీవనానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఈఈ గోవర్ధన్, డిఇ దుర్గాప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఏసిపి కరుణాకర్, టిపిఎస్ సంతోష్, ఎస్డబ్ల్యూఎం డిఇ రూపదేవి, ఏఇ మన్యం, కిరణ్ మరియు నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లలు దాటిన ఏడుపాయల కీర్తి



**పాపన్నపేట, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** మహా వనజాతర కన్నుల పండువగా సాగింది. పుడమి సాక్షిగా ప్రకృతి ఒడిలో కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం.మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయలలో ఈనెల 15 నుండి 17 వరకు ఆదివారం వనదుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ, సోమవారం జోడేడ్ల బండ్ల ఊరేగింపు, మంగళవారం రథోత్సవం కన్నుల పండువగా సాగింది. తెలుగు రాష్ట్రాలు,కర్ణాటక,మహారాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంజీరా నదిపాయల్లో పుణ్య స్నానమాచరించారు. వనదుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, తలనీలాలు, బంగారం, వెండి కానుకలు సమర్పించారు. లక్షలాది భక్తుల రాకతో ఏడుపాయల కిటకిటలాడింది. కోటి సూర్య చంద్ర ప్రభ కాంతులతో వనదుర్గా క్షేత్రం శోభాయమనంగా విరాజిల్లుతుంది.జాతర కు ఆలయ ఈఓ వీరేశం తగు ఏర్పాట్లు చేశారు. పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. గ్రామ సర్పంచ్ దండెం సుశీల దుర్గయ్య,18 కులవృత్తుల వారు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## విద్యార్థి లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకుసాగాలి



**అల్లాదుర్గం, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మంగళవారం నాడు కళాశాల వార్షికోత్సవము తో పాటు, క్రీడా దినోత్సవం, ద్వితీయ సంవత్సరము విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు., ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి కె లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పం తో ముందుకు సాగాలని తెలిపారు. నాకు రాదు అనే ఆత్మ నూన్యతా భావంతో ఏ పని చేసిన జీవితంలో విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని, వాళ్ళ లక్ష్యసాధనలో అకుంఠిత దీక్షతో సాధన చేస్తే విజయం సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ తుకారం మాట్లాడుతూ కళాశాల లో గల సౌకర్యలను గురించి వివరించి రాబోయే వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు వచ్చేలా పరీక్షలు రాయాలని కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా క్రీడాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి కౌన్సిలర్ నరసింహారెడ్డి, అధ్యాపకులు శ్యామ్ రావు, రవికుమార్, రవీందర్, శివకుమార్, డాక్టర్ దత్తు, శంకర్, స్రవంతి, ప్రవీణ్ కుమార్ తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- అంబులెన్స్ డ్రైవర్‌పై వేటు
- డీసీహెచ్ఎస్ డాక్టర్ షరీఫ్



**జోగిపేట, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** జోగిపేట్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎప్పుడు సమస్యలకు నిలయంగా మారింది దీంతో. సోమవారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ సోమవారం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేశారు మంత్రి అక్కడి నుంచి డీసీహెచ్ఎస్ కు ఎంక్వయిరీకి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం డాక్టర్ షరీఫ్ తనిఖీ చేశారు. వార్డుల్లో తిరిగి రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడుగగా పేషెంట్ కు బెడ్ పైన రెస్ట్ గా ఉండేందుకు వీల్ బెడ్స్, రోగులకు వెస్టన్ బాత్రూం కావాలి అని అడుగటంతో సమస్య తీరుస్తామని హామీ ఇచ్చారు అలాగే అంబులెన్స్ సౌకర్యం గురించి రోగులను అడగగా.. 108 మాత్రమే ఉచితంగా సేవ చేస్తుంది కాని హాస్పిటల్కు సంబంధించిన అంబులెన్స్కు మాత్రం వెయ్యి రూపాయల డీజిల్తో పాటు బత్తా రూ. 200 చెల్లిస్తున్నట్లు రోగులు నేరుగా జిల్లా అధికారికి పిర్యాదు చేశారు. వెంటనే ఆ డ్రైవర్ని పిలిపించిన డబ్బులు తీసుకుంటున్న విషయం అడుగగా ఇప్పుడు కొత్త కాదు సార్ గత 25 ఏళ్లుగా వసూలు చేస్తున్నామని చెప్పడం గమనార్హం. మంత్రి వచ్చినప్పుడు లీవ్లో ఉన్న ఏడు మంది వైద్యులు, అలాగే చీటికిమాటికి డుమ్మాలు కొట్టే వైద్యులతో పాటు అంబులెన్స్ డ్రైవర్ పై కూడా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కి నివేదిక పంపనున్నట్లు చెప్పారు ఈ ఆస్పత్రిలో మొత్తంగా 31 మంది డాక్టర్లు అవసరం ఉండగా పది మంది రెగ్యులర్ డాక్టర్లు పనిచేస్తున్నారు. కొందరిని జిల్లాలోని ఆసుపత్రుల నుండి సర్దుబాటు చేస్తూ 23 మంది జోగిపేట హాస్పిటల్లో పనిచేస్తున్నట్లు వివరించారు.

## వెంకటాపురం-నక్కలపల్లి రహదారి గుంతల సమస్యకు పరిష్కారం



**మొయినాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** మొయినాబాద్ మండలంలోని వెంకటాపురం నుండి నక్కలపల్లి వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో దెబ్బతిని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా రహదారి దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గ్రామస్థుల వినతిని స్వీకరించిన వెంటనే వెంకటాపురం సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి స్పందించి రహదారిపై మొరం వేయించే పనులను ప్రారంభించారు. దీంతో గుంతలు పూడ్చి రహదారి సాఫీగా మారడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డికి వెంకటాపురం, నక్కలపల్లి గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ఇలాంటి చర్యలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాజెక్ట్ జల శక్తిని ప్రారంభించిన యునైటెడ్ బ్రూవరీస్



**ఖైరతాబాద్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** హీనెకెన్ కంపెనీలో భాగమైన యునైటెడ్ బ్రూవరీస్ లిమి టెడ్ (యూబీఎల్) సంగారెడ్డి జిల్లాలో తమ ప్రతి ష్టాత్మక సిఎస్ఆర్ కార్యక్రమం 'ప్రాజెక్ట్ జల శక్తి' ని ప్రారంభించిందని యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ గరిమా సింగ్ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ చొర వలో భాగంగా, రైతులు, స్థానిక ప్రజలకు మద్దతు గా పునరుత్పాదక ఇంధనంతో నడిచే రెండు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మల్కాపూర్, కొత్లాపూర్, గుంట పల్లి, గోపులాపురం, హరిదాస్‌పూర్, మాలెపల్లి గ్రామ పంచాయతీలను కవర్ చేస్తుందని తెలిపా రు. భారత్ కేర్స్' భాగస్వామ్యంతో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్ట్ సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహిం చడం, భూగర్భ జలాలను పెంపొందించడం, జీవవై విధ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఈసీఓఈల ద్వారా యుబిఎల్, భారత్ కేర్స్ సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ రైతులకు అండగా నిలుస్తాయని అన్నారు. పంట ఉత్పాదకతను పెంచడానికి నేల, నీటి సంరక్షణపై శిక్షణ అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యుబిఎల్ సిఎస్ఆర్, ఈఎస్జి కమిటీ చైర్‌పర్సన్ గీతూ గిద్వానీ వర్మ, కమిటీ సభ్యురాలు యోలాం డా తలామో, చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ గరిమా సింగ్, భారత్ కేర్స్ ట్రస్టీ భౌమిక్ షా, కొత్లాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెంటాని ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం



**మొయినాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిలి జర్నలిస్ట్ రాములు, కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయం చేయసారు,అండగా ఉంటామని అన్నారు.షాబాద్ మండల మాజీ ఆంధ్రప్రభ రిపోర్టర్ కదుమూరి రాములు ఇటీవలే మృతి చెందడంతో మంగళవారం షాబాద్ లోని ఎమ్మెస్ గార్డెన్ లో ఆయన సంస్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన రాములు లేని లోటు తీరలేదన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పమేనా భీమ్ భరత్,హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ,గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్, సర్దార్నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి,సర్పంచులు అశోక్,ప్రభాకర్ రెడ్డి,నవనీత స్వామి ,స్వరూప మహేందర్ గౌడ్ ,రాజేందర్ రెడ్డి ,యాదయ్య ,లావణ్య చెన్నయ్య ,నాయకులు జానాడిర్ధన్ రెడ్డి ,రామ్ రెడ్డి ,వెంకటరెడ్డి, రాహుల్ ,శ్రీనివాస్ ,రఫీక్ ,సూర్య ,శేఖర్ ,ప్రభాకరెడ్డి ,కిషోర్ ,జర్నలిస్ట్ లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసంపై హర్షం



**తాండూరు ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి 19 మంది కౌన్సిలర్లు ఘనవిజయం సాదించారు. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ల గెలుపుకు కృషి చేసిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తాండూరు పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# బూర్గుల గ్రామములో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**ఫరూఖ్‌నగర్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం లోని బూర్గుల గ్రామములో కేసీఅర్ పుట్టినరోజు సందర్భంగా గ్రామ అధ్యక్షులు లింగారం సంతోష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్వీట్స్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కెసిఆర్ చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు, స్వరాష్ట్ర సాధకుడు అయిన కెసిఆర్ తెలంగాణ ప్రజలకు చేసిన సేవలను వివరించారు.కల్యాణ లక్ష్మి పథకం పేద కుటుంబాల్లోని బాలికల వివాహాలకు ఆర్థిక సహాయం, మిషన్ భగీరథ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించడం, మిషన్ కాకతీయ చెరువుల పునరుద్ధరణ, నీటి వనరుల పునరుజ్జీవనం,రైతు బంధు పథకం రైతులకు ఆర్థిక సహాయం, రైతు భీమా పథకం రైతులకు ప్రమాద భీమా కల్పించింది అని కొనియాడారు.
కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్రామ ప్రజలు అందరూ అయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామా వార్డ్ సభ్యులు,పవన్ కుమార్, శేఖర్ గ్రామా బి అర్ ఎస్ పార్టీ ఉప అధ్యక్షులు,సి నర్సిములు, పి నర్సిములు,మండల నాయకులు మాచారం హరికృష్ణ గౌడ్,పార్టీ సీనియర్ నాయకులు సి పోచయ్య, చక్కటి ప్రభాకర్, మర్గని రవి, బతుక,సురేష్, పుల్లని ఆంజనేయులు, పెంబర్ల శ్రీశైలం, మసారం మాసయ్య గౌడ్,సినాయగారి రాజేందర్,తిరుపతయ్య పాల్గొన్నారు.

## ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తా..



**హయత్‌నగర్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీవాసులు స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారిని ఆత్మీయంగా సన్మానించి తమ ప్రేమాభిమానాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల కాలంలో కాలనీ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని రహదారుల అభివృద్ధి, డ్రైనేజ్ పనులు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య మెరుగుదల వంటి అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రాజకీయాలకు అతీతంగా సేవలు అందించడం ప్రత్యేకమని కొనియాడారు. ఈ ప్రేమాభిమానాలు తనపై మరింత బాధ్యతను పెంచుతాయని, ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి కొనసాగిస్తానని, ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షులు మాణిక్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, సంక్షేమ సంఘ సభ్యులు కృష్ణా, ధర్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగం గౌడ్, శ్రీశైలం, పెంచలయ్య, సత్యనారాయణ గౌడ్, సురేందర్ రెడ్డి, పిచ్చయ్య, లక్ష్మణ్, రాములు బీజేపీ నాయకులు లక్ష్మణ్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలో కీలకమైన ప్రజాప్రతినిధి వార్డు మెంబర్

**జిల్లేడు చౌదరిగూడ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రంలో ఉప సర్పంచ్ లకు వార్డు నంబర్లకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ శిక్షణ తరగతులు ప్రారంభించారు 17నుంచి 21వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీరికి ప్రధానంగా 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారంగా వారి విధులు బాధ్యతల పైన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో దాదాపుగా ఉన్నంత చదువులు చదివిన వారే ఎక్కువగా ఉన్నారు.ఈసారి జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా చదువుకున్న యువతీ యువకులు పాల్గొనడం జరిగింది. ఎన్నికల పోటీలో కనీస విద్యార్హత పెట్టాలని నేటి యువతరం కోరుతుంది. విద్యార్హత ఉంటేనే వారి యొక్క విధులు బాధ్యతలు తెలుస్తాయని పలువురు వ్యక్తపరుస్తున్నారు. అంతే కాదు వారి వార్డు అభివృద్ధి కోసం పనులు ప్రతిపాదించడం గ్రామ సభలో ఓటు హక్కు పంచాయతీ నిధుల ఖర్చులపై ప్రశ్నించడం, గ్రామ ప్రణాళికల తయారీలో పాల్గొనడం, వార్డు ప్రజల సమస్యలను సర్పంచ్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే హక్కులను కలిగి ఉంటారు.

### అభివృద్ధి పనులు..

తన వార్డు పరిధిలో మంచి నీటి సర్ఫరా, వీధి దీపాలు, రోడ్లు నిర్మాణం వంటి పనులను గుర్తించి, గ్రామ పంచాయతీ సమావేశంలో వాటిని చేపట్టాలని కొరవచ్చు.



# ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి




**సిద్దిపేట బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణం పరీక్షలు రాసేలా పగడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణ గూర్చి సంబంధిత శాఖల అధికారులకు జూమ్ సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో ఈ సంవత్సరం 20 వేల 41 మంది ఇంటర్మీడియట్ మొదటి మరియు రెండవ సంవత్సరం విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 42 పరీక్ష కేంద్రాల ద్వారా పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 9946 మంది మరియు రెండవ సంవత్సరం విద్యార్థులు 10095 పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే చేయడం జరిగిందని పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల కేటాయించిన విధులను 100% నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి రూరల్ ప్రాంతాల నుండి ఉదయం 7 గంటల నుండే ప్రత్యేక బస్సులు వెయ్యాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. 42 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరా పనిచేయాలని అన్ని గదుల్లో మంచి వెలుతురు వచ్చేలా ఏర్పాటు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 వరకు ఎలాంటి కొరత లేకుండా విద్యుత్ సరఫరా చెయ్యలా విద్యుత్ అధికారులను ఆదేశించారు. అన్ని సెంటర్ లో మెడికల్ క్యాంపు లు పెడుతూ ఒక ఏఎన్ఎం ను శిబిరంలో పెట్టాలని డి 4ఎం అండ్ ఎచ్ఓను ఆదేశించారు. అన్ని సెంటర్ లో ఎక్కడ కూడా ఇన్విజిలేటర్ కొరత రాకుండా ఎస్ జీ టి ఉపాధ్యాయులను కేటాయించాలని డిఈఓ ను ఆదేశించారు. అన్ని భద్రత చర్యలు, స్ట్రాంగ్ రూమ్ చుట్టూ సెక్యూరిటీ పరీక్ష కేంద్రాలకు ఆయా రూట్ల వారిగా పేపర్ లు పరీక్ష సెంటర్ కు చేర్చేందుకు ఎస్కార్ట్ ఇవ్వాలని జిల్లాలో 163 ఆఫ్ బిఎన్ఎస్ చట్టాన్ని అమలు చెయ్యాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అందరూ అధికారులు సమన్వయంతో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ



**మక్తల్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 16 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం లో జరిగిన 45వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీలలో తెలంగాణలోని 33 జిల్లాల బాలికల జట్లు పాల్గొనగా, నారాయణపేట జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్లు పాల్గొని క్రీడల్లో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో 5వ స్థానం, ఆరవ స్థానం పొంది ప్రశంసా పత్రాలు పొందినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోచ్ బి .గోపాలం తెలిపారు. రెండు జిల్లాల బాలికల జట్ల కోచులుగా పీఈటీలు, టీ .అవంతి, జి. చంద్రకళ చక్కని పాత్ర పోషించారని వారిని బి. గోపాలం అభినందించారు. రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో ప్రతిభ చాటిన బాలికలను, అందుకు కృషిచేసిన పిఈటిలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, తాన్ సింగ్, రమేష్ కుమార్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ. అడమ్స్, బి. పుష్ప, ఫిజికల్ డైరెక్టర్ భవ్య శ్రీ జె .రవి అభినందించారు.

## ఆధ్యాత్మికతతోనే సామాజిక ఐక్యత సాధ్యం

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ఆధ్యాత్మిక చింతన సమాజంలో ఐక్యతను, సాంప్రదాయ విలువలను పెంపొందించడానికి కీలకమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మంగళవారం జడ్చర్ల మండలంలోని మీనాంబరం లో జరుగుతున్న శ్రీ పర్వవేదిశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన భజన పోటీలను తిలకించారు. భక్తి భావంతో ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను, యువతను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ప్రతిభను ప్రశంసించారు. గ్రామాల్లో ఇలాంటి ఉత్సవాలు నిర్వహించడం వల్ల ప్రజల మధ్య సోదరభావం పెరుగుతుందని, మీనాంబరం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒకేషనల్ కోర్సులపై అవగాహన పెంచుకోవాలి

- బ్యూటీ అండ్ వెల్నెస్ ఒకేషనల్ తరగతులు ప్రారంభం
- మెదక్ జిల్లా విద్యాధికారి విజయ



**మెదక్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** హవేలీ ఘనపూర్ పరిధిలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాల కూచన్ పల్లి లోని ఈ సంవత్సరం నుండి పీఎంశ్రీ పథకం కింద మంజూరైన తొమ్మిదవ తరగతి విద్యార్థులకు సంబంధించి బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సులు మంగళవారం రోజు మెదక్ జిల్లా విద్యాధికారి విజయ. పాఠశాల ఆవరణలో ప్రారంభించారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా విద్యాధికారి విజయ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర కోర్సులపై కూడా శ్రద్ధ చూపి, జీవితంలో వారు స్వయంగా ఉపాధి కల్పన కై కృషిచేసి వారే స్వయంగా నిలబడే విధంగా వేరే కోర్సులపై కూడ దృష్టి సాధించాలని అన్నారు. విద్యార్థి దశ నుండే ఒకేషనల్ కోర్సు పట్ల అవగాహన పెంపొందించుకుంటే జీవితంలో ఏదో ఒక రంగంలో స్థిరపడవచ్చునని ప్రసంగించారు. పదవ తరగతి విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షల దృష్టిలో ఉంచుకొని కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. తర్వాత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి.మొదటి ప్రీ ఫైనల్ పరీక్షలను పర్యవేక్షించారు పాఠశాలలో మంజూరైన గ్రంథాలయాన్ని కూడా సందర్శించి పాఠశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్ బ్యూటీ అండ్ వెల్నెస్ ఫ్యాకల్టీ శృతి మేడం, కృష్ణవేణి, గంగమణి,. రుక్మిణి, స్వప్న, సంతోషి కుమారి , విమల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అవినీతికి తావులేకుండా సుపరిపాలన కోసం పని చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** అవినీతికి తావు లేకుండా సుపరిపాలన కోసం పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నూతన ట్రైనీ గ్రూప్ వన్ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నూతన ట్రైనీ గ్రూప్ వన్ అధికారులలో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ట్రైనీ అధికారులు శిక్షణ అనంతరం ఉద్యోగ బాధ్యతలలో అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందించాలని, పారదర్శకంగా,జవాబుదారిగా ఉద్యోగం చేసినపుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. దేశంలో గ్రామీణ వ్యవస్థ చాలా పెద్దదని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల అభివృద్దే దేశ అభివృద్ధి అన్నారు. సేవల్లో తమ చుట్టూ ఉన్న వనరులను ఉపయోగించుకోవాలన్నారు. ఉద్యోగ సేవల్లో టెక్నాలజీని కూడా ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎలఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## బగలాముఖీ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

- శక్తికీ మహామంత్ర హోమం
- అన్నదానం చేసిన పబ్బ రమేష్



**శివ్వంపేట, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** దేశంలోనే ప్రముఖ శక్తిపీఠాలలో ఒకరిగా నిలిచిన శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠం అమావాస్య పర్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం శక్తి పిఠానికి భక్తులు పొట్టేతారు. అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో బగలాముఖీ అమ్మవారికి మహాపూజలు నిర్వహిస్తూ, బగలాముఖీ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి విశేషమైన పసుపుతో హరిద్రార్చన నిర్వహించి, రుద్రాయామల, శ్రీసూక్త, దేవిసూక్త, రుద్రాసూక్త బగలా అష్టోత్తర నామార్చనలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, మంత్రపుష్పం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజలు ముగిసిన తర్వాత అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు బగలాముఖీ శక్తిపీఠం ప్రాంగణంలో అమ్మవారికి మహామంత్ర హోమం వైభవంగా నిర్వహించి, అమ్మవారి దర్శనానికి ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుండి కాకుండా దేశం లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

### అన్నదానం చేసిన పబ్బా వంశం

అమావాస్య పర్వదినం సందర్భంగా మంగళవారం అమ్మవారి దర్శన కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులందరికి స్థలదాత పబ్బ రమేష్ గుప్త – స్వరూప, పబ్బ మహేష్ గుప్త – స్వాతి దంపతులు అన్నదానం చేశారు.

## మెదక్ పట్టణాభివృద్ధికి కృషి చేయండి

- మెదక్ నూతన మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్ కు అభినందన
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** మెదక్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్‌కు సూచించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి శాలువా, పూల మాలలవేసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కొత్త పాలకవర్గానికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. తమ గెలుపులో హన్మంతరావు మార్గదర్శకం ఉందని, ఇందుకు చైర్మన్ దంపతులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

## ఏటిగడ్డ మాందాపూర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



**మెదక్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం ఏటిగడ్డ మాందాపూర్ గ్రామన్ని ట్రేనింగ్ ఐఏఎస్ ఆఫీసర్ల బృందం లుంశావత్ దివ్య, మద్దినేని మురళి, రిషిబ్ తివారి, బి. రవితేజ, డి శాంతి ప్రియ, కర్రెమ్మోళ్ల సంపత్ రెడ్డి మంగళవారం సందర్శించారు. గ్రామంలో మౌలిక వసతులు మరియు అభివృద్ధి పనుల గురించి కొల్చారం ఎంపీడీవో రఫీకొన్నిసా బేగం, మండల పంచాయతీ అధికారి కృష్ణవేణి వారికి వివరించారు. ఏటిగడ్డ మాందాపూర్ లో జరిగిన అభివృద్ధిని పరిశీలించేందుకు వచ్చిన ట్రైనీ ఐఏఎస్ లకు గ్రామ సర్పంచ్ పేరోళ్ల విమలమ్మ, ఉప సర్పంచ్ పంచాయతీ సెక్రటరీ మరియు వార్డ్ మెంబర్స్ ఘన స్వాగతం పలికారు.

## మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి



**నర్సాపూర్, ఫిబ్రవరి 17 (నర్సాపూర్) :** మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు– కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి – కలెక్టర్ రాహుల్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి , తాసిల్దార్ శ్రీనివాస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య భోజనం అందించాలి

- పాఠశాలను సందర్శించిన జిల్లా పరిశీలకులు



**ఊర్కొండ, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనాన్ని అందించాలని జిల్లా పరిశీలకులు నిరంజన్ నెహ్రూ ప్రసాద్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఊరుకొండ మండలం ఊరుకోండపేట లోని జడ్పీ పి హెచ్ ఎస్ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వము ప్రతిష్ఠాత్మకముగా 3వతరగతికి నిర్వహించబోతున్న ఎఫ్ ఎల్ ఎస్ పరీక్ష ప్రాముఖ్యతను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనమును పరిశీలించి శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమములో మండల విద్యాధికారి అబ్దుల్ రహీం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అలివేలు, ఉపాధ్యాయులు శ్రీనువాసులు, భాగ్యలక్ష్మి, శ్వేతా రాణి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి

- మంత్రి అజారోద్దీన్
- జహీరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక నిధులకు కృషి
- ఎంపీ సురేష్ షెట్కార్

**జహీరాబాద్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. జహీరాబాద్ పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తేవడానికి కృషి చేస్తానని జహీరాబాద్ యంపీ సురేష్ షెట్కార్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి పదేపదే ఢిల్లీ వెళ్తుంటారని వివరించారు. అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదన్న సామెతల రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్ళి మంత్రులతో కలిసి అభివృద్ధి ఫలాల కోసం ప్రయత్నిస్తుంటారన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ ఉజ్వల్ రెడ్డి గెస్ట్ హౌస్ లో మంగళవారం నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎండి.యునుస్, వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష, కౌన్సిల్లర్లను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జహీరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి పాలకమండలి కృషి చేయాలన్నారు. తాను క్రికెట్ లో ఎన్నో సెంచరీలు కొట్టానని, ఇప్పుడు స్థానికులు సెంచరీ బాది కాంగ్రెస్ ను గెలిపించారని చమత్కారంగా అన్నారు. ఎన్నికల ఇంచార్జి, రాష్ట్ర టిఎంఆర్ఈఐఎస్ చైర్మన్ ఫయుమ్ ఖురేషీ మాట్లాడుతూ సిఎం కోరిక మేరకు మైనారిటీ చైర్మన్ ను చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. జహీరాబాద్ మున్సిపల్ లో పాలకమండలి మొత్తం యంగ్ స్టార్లు ఉన్నారని, వార్డుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. జహీరాబాద్ గడ్డ కాంగ్రెస్ అడ్డా అని మరోసారి నిరూపితం అయ్యిందన్నారు. ఎంపి సురేష్ కుమార్ శెట్కార్ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో ఎనిమిది మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం సంతోషకరమన్నారు. కష్టపడ్డ కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. మాజీ మంత్రి, ఇంచార్జి ఏ.చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపల్‌లను



కాంగ్రెస్ కైవసం చేసుకుందని, గెలుపుకు కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు,సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్. ఉజ్వల్ రెడ్డి, తన్వీర్,ఆత్మ చైర్మన్ రామలింగారెడ్డి, సిడిసి చైర్మన్ ముభిన్,ఎంఐఎం ఇంచార్జి అత్తర్ అహ్మద్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. నర్సింలు, పీ. నర్సింహారెడ్డి, హన్మంత్ రావుపాటిల్, బి.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ మున్సిపల్ రాజకీయాల్లో 'కింగ్ మేకర్'గా అప్పాల ప్రభాకర్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి):** నిర్మల్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు వస్తే రాజకీయ వర్గాల్లో మొదట గుర్తుకు వచ్చే పేరు అప్పాల ప్రభాకర్. ప్రత్యక్ష రాజకీయాల్లో పదవి చేపట్టకపోయినా, నాలుగు పర్యాయాలుగా ఆయన బలపరిచిన అభ్యర్థులు గెలుపొందడంతో స్థానికంగా ఆయనకు "కింగ్ మేకర్" అనే బిరుదు స్థిరపడింది. బుదవార్‌పేట్ పరిధిలోని వార్డు నం.1, 23, 36, 37లలో గత ఎన్నికల సందర్భంగా ఆయన మద్దతు తెలిపిన అభ్యర్థులే కౌన్సిలర్‌లుగా విజయం సాధించడం ఆయన ప్రభావానికి నిదర్శనం. రిజర్వేషన్లు అనుకూలంగా లేకపోయినా, ఇతర వార్డులలోనూ తన అనుభవం, వ్యూహంతో అభ్యర్థులను గెలిపించే సామర్థ్యం ఆయనకు ఉందని స్థానికులు చెబుతున్నారు.

అప్పాల ప్రభాకర్ రాజకీయ కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి అప్పాల నర్సయ్య, అన్న అప్పాల మహేష్, శ్రీమతి అనురాధ, అన్న కుమారుడు అప్పాల గణేష్ రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కుటుంబానికి చెందిన అప్పాల కావ్య మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికవడం కుటుంబ ప్రభావాన్ని మరింత బలపరిచింది. ప్రభాకర్ వ్యక్తిగతంగా ప్రజలతో, బంధువులతో సఖ్యతగా ఉండడం, అందుబాటులో ఉండే స్వభావం కలిగి ఉండడం వల్ల ఆయన సూచించిన అభ్యర్థులపై ఓటర్లు విశ్వాసం ఉంచుతారు. రాజకీయ వ్యూహాలలో నిశిత అవగాహన, స్థానిక పరిస్థితులపై పట్టు ఆయనకు ప్రత్యేక గుర్తింపునిచ్చాయి.

### ఘన సన్మానం

మంగళవారం వివేక్‌నగర్ కాలనీ వాసులు అప్పాల ప్రభాకర్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను, స్థానిక రాజకీయాల్లో చేసిన పాత్రను ప్రశంసించారు.

# పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన వరంగల్ కమిషనరేట్



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రారంభమయిన నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ క్రీడాకారులు తొలి రోజున గతంలో ఎన్నడు లేనివిధంగా సత్తా చాటారు. తొలిరొజున వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు మొత్తం 11 పతాకాలను సాధించడం జరిగింది. ఇందులో ఒక గోల్డ్ మెడల, ఐదు సిల్వర్ మెడల్స్, నాలుగు బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. పతకాలు సాధించిన వారిలో ఆర్మ్డ్ విభాగం పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ గుగులోత్ మౌనిక పది కిలోమీటర్ల పరుగు పందెంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ తోలి స్వర్ణ పతాకాన్ని అందించగా, ఆర్మ్స్ రెజ్లింగ్‌లో హెడ్ కానిస్టేబుల్ సుజాత, మహిళా కానిస్టేబుళ్ళు రమ్య, యం.కళ్యాణి, ఫ్రీ రెజ్లింగ్ విభాగంలో కానిస్టేబుల్ కొండా నవీన్, జావిలిన్ త్రోలో మహిళా కానిస్టేబుల్ యం.లత సిల్వర్ మెడల్స్ గెలుచుకోగా, 40కిలో మీటర్ల సైకిలింగ్‌లో ఎస్.ఐ సాయి దివ్య, ఆర్మ్స్ రెజ్లింగ్‌లో మహిళా కానిస్టేబుల్ ఎన్.మౌనిక,1500 మీటర్లలో మహిళా కానిస్టేబుల్ ఎస్.రవళి,కానిస్టేబుల్ రొమన్ రెజ్లింగ్‌లో కానిస్టేబుల్ జె.సతీష్‌తో పాటు, 4 ఇ 400 మీటర్ల రిలే పరుగులో మహిళా కానిస్టేబుళ్ళు హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ ఎన్.సుజాత, ఎస్.రవళీ, జి.మౌనిక, జె.పావని బృందం ఒక కాంస్య పతాకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్బంగా తొలిరోజునే పదుల్లో పతాకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందనలు తెలుపుతూ రాబోవు రోజుల్లో మరిన్ని పతకాలను సాధించాలని అకాంక్షించారు. ఈ క్రిడలకు సంబందించి ప్రారంభ వేడుకలు రేవు ఉదయం నిర్వహించబడుతాయి.

# కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు



**నల్లబెల్లి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి):** కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పులి మల్లికాంబ అనే వృద్ధురాలి ఇంట్లోకి కోతుల గుంపు చొరబడింది. దీంతో భయాందోళనకు గురై వృద్ధురాలు కింద పడగా చేతికి తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉన్నదని ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కోతులను నివారించాలని వారు కోరుతున్నారు.

# ప్రజాస్వామ్య బద్ధంగానే చైర్మన్ ఎన్నిక

- ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, ఎంపీ కావ్య



**పాలకుర్తి, ఫిబ్రవరి 17(జనంసాక్షి) :** ప్రజాస్వామ్య బద్ధంగానే తొర్రూరు మున్సిపాలిటి చైర్మన్‌ఎన్నిక జరిగిందని, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి ఆమె మాట్లాడారు. తొర్రూరు మున్సిపాలిటి చైర్మన్ ఎన్నిక కోసం బీఆర్ఎస్ పార్టీ అనేక ఎత్తులు, జిత్తులు చేసిందని, కాంగ్రెస్ ఆ కుట్రలను తిప్పికొట్టిందని విమర్శించారు. చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీకి దక్కడంతో న్యాయం గెలిచిందని అన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మోసాలను ప్రజలు తెలుసుకున్నారని సమానంగా ఓట్లు రావడం తో అధికారులు డ్రా పద్దతిన చైర్మన్ ఎన్నిక చేయడం తో కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, హనుమాండ్ల తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన చైర్మన్ గా ఎన్నికైన తూణం శ్రావన్, కౌన్సిలర్లకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఝాన్సీరెడ్డిల అధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు.

# గోదావరిలో పడి వ్యక్తి మృతి



**మంగపేట ఫిబ్రవరి 17(జనంసాక్షి) :** మండలంలోని కమలాపురం గోదావరి నదిలో మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం ఉదయం ఇంటెక్ వెల్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై టివిఆర్ సూరి తెలిపిన వివరాల ప్రకారం కమలాపురం గ్రామానికి చెందిన జాని రవి గౌడ్ (45) ఆదివారం ఉదయం మహాశివరాత్రి సందర్భంగా గోదావరి నదికి రవి స్నానానికి వెళ్లడం జరిగింది. మళ్ళీ రవి తిరిగి ఇంటికి రావకపోవడంతో ఆ రోజు నుండి ఆచూకీ కోసం వెతుకుతుండగా మంగళవారం ఉదయం గోదావరి నది ఇంటెక్ వెల్ సమీపంలో ప్రమాదవశాత్తు నీట మునిగిచనిపోయి జాలర్లకు కనిపించడం జరిగింది అని వారు వెంటనే సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని జాని రవి గా గుర్తించడం జరిగిందని ఎస్సై టివిఆర్ సూరి తెలిపారు. మృతుడి అన్నయ్య జాని శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై సూరి తెలిపారు.

# మంత్రి వివేక్ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుండు

- మంత్రి సమక్షంలోనే మహిళా కౌన్సిలర్లపై కాంగ్రెస్ కౌన్సిలర్ల దాడి అమానుషం
- క్యాతనపల్లి బంధుకు పిలుపు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్




**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 17(జనంసాక్షి):** రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో బిఆర్ఎస్,సిపిఐ కూటమి కౌన్సిలర్లతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్ లో కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ సమక్షంలో తమ మహిళ కౌన్సిలర్లపై కాంగ్రెస్ కౌన్సిలర్లు దాడి దిగి అసభ్యకరంగా ప్రవర్తించిన మంత్రి, ఎంపీ కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయడకోవం శోచనీయమన్నారు. కార్యాలయం లోపలికి తాగి వచ్చి ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి తమ కూటమి కౌన్సిలర్లు మద్దతు తెలుపాలని దాడి చేశాడని అతని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమను తలపించేలా పోలీసు బలగాలను దింపి తమ అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేయాలని చూసిన వివేక్ ప్రయత్నాలు ఫలించలేదన్నారు ముక్తకంఠంతో ప్రజలు ఇచిన తీర్పు ప్రకారమే ఎన్నిక జరగాలని కౌన్సిల్ హాల్ లో నిలబడిన తమ కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు. పోలీస్ యంత్రాంగం కాంగ్రెస్ కార్యకర్తల లాగ పని చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్ని కుట్రలు పన్నిన, భయభ్రాంతులకు గురి చేసిన తమ కౌన్సిలర్లకు బిఆర్ఎస్, సిపిఐ అండగా నిలుస్తుందని అభయం ఇచ్చారు. మహిళా కౌన్సిలర్లపై ప్రవర్తించిన తీరుకు రేపు క్యాతనపల్లి బంధుకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. బంధును ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహిళా కౌన్సిలర్లు మాట్లాడుతూ చైర్మెన్, వైస్ చైర్మెన్ పదవులకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్ అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి, ఎంపీ, ఎన్నికల అధికారులకు చెప్పుకున్న స్పంచలేదని కంటతడి పెట్టారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, బిఆర్ఎస్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా





**ఖానాపూర్ ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** కోరం సభ్యులు హాజరుకాని కారణంగా ఈ నెల 16న జరగాల్సిన మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అధికారులు వాయిదా వేసిన విషయం పాఠకులకు విధితమే. కాగా మంగళవారం నిర్వహించవలసిన ఎన్నిక సందర్భంగా హాజరు కావలసిన కౌన్సిల్ సభ్యులు హాజరు కాకపోవడంతో తిరిగి వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి జీవరత్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మొదటి రోజు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిల్ సభ్యులతో పాటు ఇండిపెండెంట్ కౌన్సిల్ సభ్యురాలు హాజరై ప్రమాణస్వీకారం చేశారు. అలాగే ఒకరోజు వాయిదా వేయడంతో ఆ సమయానికి కూడా బిజెపి, బి ఆర్ ఎస్ పార్టీలకు చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్ సభ్యులు హాజరు కాకపోగా తిరిగి కాంగ్రెస్ పార్టీ ఇండిపెండెంట్ అభ్యర్థులు నలుగురు ఎమ్మెల్యేతో కలిసి హాజరై నిర్దేశించిన సమయము తర్వాత తిరిగి వెళ్లారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠకు తెర ఎప్పుడు పడుతుందని స్థానికంగా రచ్చబండ చర్చలు జరుగుతున్నాయి. ఇది ఇలా ఉండగా ఎమ్మెల్యే స్వయంగా వైస్ చైర్మన్ అభ్యర్థి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ప్రకటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. బి ఆర్ ఎస్, బిజెపి పార్టీలు మాత్రం కలిసే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవాలని సమాలోచనలు చేస్తూ సయోధ్యకుదురుచుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### పోలీసుల భారీ బందోబస్తు

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహణ సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఎన్నికల నిర్వహణ కేంద్రమైన మున్సిపల్ కార్యాలయ పరిసరాలతో పాటు బందోబస్తు తీరును స్వయంగా ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల నియమావళిని అనుసరించి అందరూ పోలీసులతో సహకరించాలని శాంతియుత వాతావరణంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆమె ప్రకటించారు. ఏఎస్పీ సాయికిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశామని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.



# జిల్లా స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

## అభినందించిన మంత్రి సీతక్క

**గంగారం, డిసెంబర్ 17 (జనం సాక్షి) :** సీఎం కప్ పోటీల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గంగారం మండలం మడగూడెం ఏ హెచ్ ఎస్ బాయ్స్ జట్టు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందింది. మహబూబాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో మడగూడెం జట్టు విజేతగా నిలువడంపై మంత్రి సీతక్క అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీలు నిర్వహిస్తున్నదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గంగారం జట్టు రాష్ట్ర స్థాయిలోనూ విజేతగా నిలువాలని సీతక్క ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మడగూడెం జట్టు ఇంత గొప్ప ప్రతిభ కనబరచడానికి సహకరించిన కోచ్ పిడి ఈసం నాగేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం దనసరి రామ్మూర్తి ని మంత్రి సీతక్క అభినందించారు.

# రోడ్డుపై గుంతలు పూడ్చివేత

## జనంసాక్షి ఎఫెక్ట్



**బోథ్, ఫిబ్రవరి 17(జనంసాక్షి) :** మండలంలోని పోచర ఫ్యాక్టరీ నుండి ఘన్పూర్ వెళ్ళే అంతరాష్ట్ర రహదారి పూర్తిగా గుంతలమయంతో దర్శనమిస్తున్నాయి..దీంతో ఈ నెల 5న రోడ్డు పై గుంతలు చెంతన ప్రమాదాలు అనే శీర్షికన జనంసాక్షి లో ప్రచురితం అయింది. దీనికి ఆదిలాబాద్ జిల్లా ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి మంగళవారమ ఏర్పడిన గుంతలను పూడ్చారు..దీంతో నిత్యం ఆ రోడ్డు గుండా ప్రయాణించే ప్రాయణికులు హర్షం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు పాఠ్యాంశాలను ఇన్నోవేటివ్‌గా బోధించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- గూడూరు లోని జడ్పీ, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్..



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఆరు మరియు పదో తరగతుల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు అడిగారు. 'లెట్స్ ఎన్ రిచ్ ఇంగ్లీష్' పాఠ్యాంశ బోధనను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ఆంగ్ల ప్రావీణ్యంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు విద్యార్థులకు స్పష్టంగా అర్థమవుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, వంటగది మరియు మరుగుదొడ్ల నిర్మాణ స్థితిని పరిశీలించారు. అసంపూర్తిగా, నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వాటి వివరాలపై రెండు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని డీఈఓను ఆదేశించారు. క్లాస్‌రూమ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థులను బయట కూర్చోబెట్టడం సరికాదని హెచ్చరించారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా, సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాషలో పట్టు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా డీఈవో ఎల్. వి.గిరి రాజ్ గౌడ్, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు, ఎంఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి
- గ్రామపంచాయతీల నిర్వహణకు 500 కోట్ల రూపాయల నిధులు మంజూరు....
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో, ఫిబ్రవరి17 (జనంసాక్షి):** గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని,గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర కీలకంగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.మంగళవారం ములుగు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నూతనంగా ఎన్నికైనములుగు,వెంకటాపూర్,మల్లంపల్లి,గోవిందరావుపేట 4 మండలాల సర్పంచ్ లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమ ప్రారంభానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ తయారీ ,తడి చెత్త పొడి చెత్త నిర్వహణ స్టాల్ లను మంత్రి పరిశీలించారుఅనంతరం ములుగు,మల్లంపల్లి మండలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు మంత్రి సీతక్క కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అని,గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచుల పాత్ర కీలకంగా ఉంటుందని,నూతనంగా ఎన్నికైన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టం పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని, పాలకులుగా ఉంటూ సేవకులుగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు.గ్రామాల లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులకు అందరికీ ఉపయోగపడే పనులకు ఖర్చు చేయాలని,గ్రామ అభివృద్ధి పై పాలక మండలి ఆధ్వర్యం లో గ్రామ సభలు నిర్వహించాలని, ఉపాధి హామీ పథకం లో కార్మికుల సంఖ్య పెంచేలా చూడాలని అన్నారు.సుమారు 500 కోట్ల రూపాయల నిధులను గ్రామ పంచాయతీ లకు అందించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలి అనే అంశాల పై ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహించడం జరుగుతుందని, సర్పంచులకు మరిన్ని అదనపు బాధ్యతలు కల్పించి బాల్యవివాహాల నిర్మూలన, గ్రామాలలోని అత్యంత పేదరిక లో ఉన్న వారిని గుర్తించడం,మహిళ సంఘాలను ప్రోత్సహించడం, అభివృద్ధి పై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. శిక్షణ తరగతులకు విచ్చేసిన నూతన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టం గూర్చి,అదేవిధంగా సర్పంచుల విధులు వారి బాధ్యతలపై ఐదు రోజులపాటు స్పష్టమైన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,గ్రంధాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచంద్ర,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి జిల్లా పంచాయతీ అధికారి,ఆత్మ కమిటీ చైర్మన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 ఫిబ్రవరి 2026

# అత్యాశకు పోవద్దు.. సైబర్ మోసగాళ్ల బారినపడొద్దు

● చిక్కడపల్లి ఏసిపి ఎల్. రమేష్ కుమార్



**ముషీరాబాద్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** అత్యాశకు పోయి సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దని చిక్కడపల్లి ఏసిపి ఎల్. రమేష్ కుమార్ సూచించారు. ఈ మెరకు మంగళవారం సాయంత్రం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో చిక్కడపల్లి పోలీస్, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ ప్రెసిడెంట్ ఎస్ మనోహర్ రెడ్డి ల అధ్యక్షతన హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సందేశం మేరకు ప్రజలకు జాగృత్ హైదరాబాద్, సురక్షిత్ హైదరాబాద్ అనే ప్రజా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసిపి ఎల్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలను మోసం చేసే సైబర్ నేరాలు వివిధ రకాలుగా జరుగుతున్నాయన్నారు. వాటిలో ఇన్వెస్ట్మెంట్, ట్రేడింగ్, ఓటిపి, కేవైసీ, డిజిటల్ అరెస్ట్, సెక్స్టోర్షన్, హనీ ట్రాప్, ఓఎల్ఎక్స్, జాబ్, వీసా బిజినెస్, వాట్సాప్ డీపీ, పలు రకాల సైబర్ క్రైమ్ మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ అవగాహన కల్పించారు. ప్రతి కాల్, మెసేజ్, లింకును ఆలోచించి మాత్రమే స్పందించాలన్నారు. ప్రతి ఒక్కరి తమ,తమ జాగ్రత్తే మేలు అని,నిర్లక్ష్యం వహిస్తేనే నష్టమన్నారు. అనుమానస్పద కాల్స్, లింక్స్, యాప్లను నమ్మొద్దు అన్నారు. ఓటిపిలు, పాస్వర్డ్ , బ్యాంకు వివరాలు ఎవరితోనో పంచుకోవద్దని, బలమైన పాస్వర్డ్ వాడాలని తెలిపారు. యువత మహిళలు, ప్రతి ఒక్కరు అవసరంలేని సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత సమాచారం పంచుకోకుండా అపరిచితులకు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా అపరిచితులు పంపించే లింకులు, ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితులను ఓపెన్ చేయొద్దు అన్నారు.పోలీస్ ఒక్కరే కారు ప్రజలు సమాజం ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రతి ఇంట్లో సామాజిక బాధ్యతగా సిటీ పోలీస్ కమిషనర్ పిలుపు మేరకు సైబర్ శింబగా ఉండి భాగస్వాములు కావాలన్నారు.సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ మల్లేశం, ఎస్సైలు అభిలాష్, కరీం, హెడ్ కానిస్టేబుల్ అశోక్ కుమార్, పోలీస్ సైబర్ వారియర్స్ జౌర ఫాతిమా, పోలీస్ సిబ్బంది,వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ ప్రెసిడెంట్ ఎస్ మనోహర్ రెడ్డి. ఫాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి నాగభూషణం, పాస్ట్ఏవిపి కందూరి కృష్ణ, డిజిఈ శైలజ మోహన్, ఫాస్ట్ ప్రెసిడెంట్ రమేష్ రెడ్డి, వివేకానంద్, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పార్క్ పార్క్ వాకర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్షతగాత్రులను మెరుగైన చికిత్సకు పంపిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**కనగల్లు, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** రాష్ట్ర రోడ్లు, భవనముల, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటన ను ముగించుకొని తిరిగి హైదరాబాదుకు వెళుతున్న సమయంలో చిట్యాల సమీపంలోని గుండ్రంపల్లి స్టేజి దగ్గర ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై స్పృహ కోల్పోయి న యువకులను చూసి వెంటనే తన కాన్వాయి నుంచి దిగి బాధితుల వద్దకు చేరుకొని సిబ్బంది సహాయంతో 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్సను అందించాలని డాక్టర్లను ఆదేశించారు. బాధితులకు ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని కోరారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి




**సూర్యాపేట, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికుల ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీఎంయూ రాష్ట్ర చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుడిగ మల్లయ్య, టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి సుంకర శ్రీనివాస్, గౌరోజు అంజయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ముందు చలో సెక్రటేరియట్ పోస్టర్ ను వారు ఆవిష్కరించి మాట్లాడారు.ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు ఆర్టీసీ కార్మికులను పట్టించుకోవడం లేదని అన్నారు.గతంలో రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేద్దామని అనుకుంటే సమ్మె చేయడం వలన బస్సులు అగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, తమ సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని సమ్మెను విరమింపచేయాలని అన్నారని అన్నారు.కానీ ఇంత వరకు ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఫ్రీ బస్సు రావడం సంతోషకరమైన విషయమని అన్నారు.మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని కోరారు.ఈ నెల 24న జేఏసీ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ రీజియన్ కార్యదర్శి ఎస్-ఎస్ గౌడ్, సూర్యాపేట డిపో కార్యదర్శి మాచర్ల భాస్కర్, నాయకులు ఎండి ఘనీ, చెరుకు వెంకటయ్య, ఎం లక్ష్మయ్య, రమేష్, అలివేలు, సైదమ్మ, రాజేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణదాతలుగా నిలుస్తున్న మలక్‌పేట్ యశోద డాక్టర్లు




**దేవరకొండ, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** మనిషికి ఆయువు పోసేది భగవంతుడు అనేది ఒక నమ్మకం, ఆ నమ్మకానికి రూపమిచ్చిందే వైద్యుడు. అటువంటి వైద్యులే హైదరాబాద్ మలక్పేట్ యశోద హాసిటల్లో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న యువకుడికి లివింగ్ రిలేటెడ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేసి ప్రాణాలు కాపాడిన మలక్‌పేట్ యశోదా హాస్పిటల్స్ వైద్య బృందం ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు యశోద హాస్పిటల్ వైద్య బృందం తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం దేవరకొండ పట్టణం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ వైద్య బృందం ఒక 30 ఏళ్ల యువకుడికి విజయవంతంగా లివింగ్ రిలేటెడ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించి అతని ఆరోగ్యాన్ని పునరుద్ధరించింది. క్రానిక్ గ్లోమెరులోనెఫ్రైటిస్ కారణంగా ఎండ్ స్టేజ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఈ రోగికి శస్త్రచికిత్స అనంతరం తక్షణమే కిడ్నీ పనిచెయ్యడం ప్రారంభించిందని వైద్యులు డా. చేతన్ వీరమనేని, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ ఌ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్,డా. యశస్వి రెడ్డి టి, కన్సల్టెంట్ యూరాలజిస్ట్, అంద్రాలజిస్ట్ ఌ యూరో-ఆంకాలజిస్ట్ తెలిపారు. ఈ విజయవంతమైన చికిత్స యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, నెఫ్రాలజీ నిపుణులు, అనస్థీషియా మరియు ట్రాన్స్‌ప్లాంట్ క్రిటికల్ కేర్ బృందాల సమన్వయానికి నిదర్శనంగా నిలుస్తోంది. యశోదా హాస్పిటల్స్‌లోని అన్ని శాఖల్లో 24 గంటల ట్రాన్స్‌ప్లాంట్ ఐసీయూ సేవలతో పాటు ఆధునిక వైద్య మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస రెడ్డి, మరియు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు.

## జిల్లాలో మోడల్ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** జిల్లాలో మోడల్ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లోని మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మోడల్ అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని,అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి పోషక లోపం ఉన్న పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలో పిల్లలకు ప్రత్యేక నూతన ఫ్రీ స్కూల్ సిలబస్ ప్రకారం బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రాలు ఓపెన్ చేసి పోషన్ ట్రాకర్ ద్వారా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వయో వృద్ధుల మెయింటెనెన్స్ కేసులు, సమస్యలు పరిష్కరించాలనీ మహిళాల పట్ల ఎలాంటి ఆకృత్యాలు జరగకుండా చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా శిశు సంరక్షణ ,ఉమెన్ వెల్ఫేర్, వయో వృద్ధుల గురించి చేయవలసిన వివిధ విషయాలపై సమీక్షించారు .అంగన్వాడి కేంద్రాలలో టాయిలెట్, డ్రింకింగ్ వాటర్ , రిపేర్స్ తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు, సూపరింటెండెంట్ జి.హుస్సేన్, డిసిపివో రవి కుమార్, ఏఫ్ఆర్వో బి.వినోద్ కుమార్, సంకల్ప జిల్లా కోఆర్డినేటర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు



**తలకొండపల్లి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ఆమనగల్ పట్టణంలో సోమవారం మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ను ఎన్నుకునే కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన 6వ వార్డు కౌన్సిలర్ నేనావత్ పత్యా నాయక్ పార్టీ ఆదేశాలను ధిక్కరించి కాంగ్రెస్ పార్టీలో చేరి పురపాలక సంఘం చైర్మన్ గా ఎన్నికవ్వడం పట్ల బిఆర్ఎస్ నాయకులు పట్టణంలో ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్,బిజెపి పార్టీల అనైక్యత పొత్తును వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టి నిదానాలు చేశారు.దీంతో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పత్యా నాయక్,కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆవేదనతో కొంతమంది కార్యకర్తలు పత్యానాయక్ నిర్వహిస్తున్న ప్రైవేటు క్లినిక్ లోని ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు.దీనికి సంబంధం లేని రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,కౌన్సిలర్ పాపిశెట్టి రామకృష్ణ,మాజీ ఎంపీపీ నిర్మల,కొంతమంది నాయకులపై అక్రమంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం పట్ల వ్యతిరేకిస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో బారాస నాయకులు ధర్నా చేపట్టి,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ మాట్లాడుతూ..ప్రతిపక్ష పార్టీగా ప్రశ్నించిన,శాంతియుతంగా నిరసనలు చేపట్టిన,అధికార కాంగ్రెస్ అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని విమర్శించారు.జరిగిన దాడికి సంబంధంలేని వ్యక్తులపై అన్యాయంగా కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి కేసులు నమోదు చేయాలన్నారు.బే షరతుగా అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని పాలకపక్షం గుర్తుంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు గోపాల్ నాయక్,సర్పంచ్ కటికల శేఖర్,ఉప సర్పంచ్ కోటేశ్వర్,నాయకులు కోట్ర కృష్ణ,విఠల్,జగతయ్య గుప్తా,కుమార్,వెంకటేష్ యాదవ్,జంగయ్య,మల్లేష్,రవి కుమార్,వెంకటాచారి, యాదయ్య, బాలకృష్ణ, బాలరాజ్,విజేందర్ నాయక్,దశరథం, పాండు, తుమ్మ రమేష్,రవి డాక్టర్,ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పర్వతగిరి ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

● రికార్డులను పరిశీలించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్



**కనగల్లు, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** మండలంలోని పర్వతగిరి ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపకేంద్రంలోని రిజిస్టర్, మెడికల్ కిట్టు, రోజువారి నిర్వహించే ఓపి రిజిస్టర్, మరుగుదొడ్ల లను పరిశీలించారు. ఆరోగ్య ఉపకేంద్రంలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలింతలకు, చిన్నారులకు ఇచ్చే మాస టీ కాల ను ఆలస్యం చేయకుండా ఇవ్వాలని, ఆస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని, గర్భిణీ స్త్రీలకు ప్రతినెల పరీక్షలు నిర్వహించి ప్రసవాలు సమయానికి జరిగేలా చూడాలన్నారు. పేద ప్రజలే ప్రభుత్వ ఆసుపత్రి కి వస్తారని వారికి మెరుగైన సేవలు అందించాలని తెలియజేశారు.ఆస్పత్రిలోని పైకప్పు పెచ్చులు తేలాయని డిఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు వెంటనే పంపాలని తెలిపారు . కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ కళ్యాణి, చాళుక్యులు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కనగల్ వైద్యాధికారి డాక్టర్ జి.రామకృష్ణ, ఎం ఎల్ హెచ్ ఊర్మిళ, ప్రియదర్శిని, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లో జిల్లాస్థాయి జూనియర్, సీనియర్ స్థాయిలో జరిగిన సీఎం కప్పు పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంత దోహదపడతాయని అన్నారు. పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడ రాణించాలని అన్నారు. ఈ నెల 20 నుండి హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడ సూర్యాపేట జిల్లా విద్యార్థులు మొదటి స్థానం సాధించి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.వాలీబాల్ జూనియర్స్ లో బాయ్స్ అండ్ గర్ల్స్, సీనియర్ స్థాయిలో కబడ్డీ మెన్స్ అండ్ ఉమెన్స్, కోకో జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్, అథ్లెటిక్స్ లో సబ్ జూనియర్ జూనియర్ సీనియర్, బాస్కెట్ బాల్ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్, చెస్ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్, క్యారమ్ సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్, బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ మరియు బేస్ బాల్, జూడో, టైక్వాండో పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్, జిల్లా స్పోర్ట్స్ అండ్ యువజన సంక్షేమ అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లి గ్రామాన్ని సందర్శించిన నూతన అధికారులు

● ప్రభుత్వ పనితీరు, ప్రజా సమస్యలపై ఆరా..




**దేవరకొండ, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు మంగళవారం మైనంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల గ్రూప్ 1 అధికారులుగా ఎంపికైన మున్సిపల్ కమిషనర్ శ్రేయ, డిఎస్పీలు సంగీత, సాయి తేజ, డిప్యూటీ కలెక్టర్లు వెంకటరమణ,మహమ్మద్ విలయథ్ అలీ లను స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ స్వాగతం పలికారు.అనంతరం గ్రామంలోని పాఠశాలను. అంగన్వాడీ కేంద్రం,రేషన్ షాప్,పల్లె దవాఖాన లను సందర్శించి గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి,ఎంపీఓ సాగర్,ఉప సర్పంచ్ లాలూ,పంచాయతీ కార్యదర్శి అంబెద్కర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు స్టేతో ఆగిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

● ఉత్కంఠంగా మారిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక

● పోలీసుల అదుపులో 19 వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక కొలిక్కి రాకపోవడంతో రాజకీయ నాయకులల్లో, ప్రజలు ఆసక్తిగా ఎదురు చూశారు.మరో పక్క కోర్టు నుంచి స్టే వచ్చిందాన్ని ప్రచారం జరిగింది.కోర్టు స్టే కు సంబంధించిన ఆర్డర్ కాపీ అధికారకంగా అందకపోవడంతో ప్రతిష్ఠంభన నెలకొంది.స్టే కాపీ రానప్పుడు ఎన్నికను ఎందుకు ప్రకటించడం లేదని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పట్టుబడుతున్నారు.చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక పత్రం ఇవ్వండి లేకపోతే స్టే ఆర్డర్ కాపీని చూపించాలని డిమాండ్ చేశారు.

### చేతులెత్తేసిన ఎన్నికల అధికారి

ఉదయం 10:45 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ పరిస్థితిని సమీక్షించారు.ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే అక్కడి నుంచి మధ్యలోనే వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.కాసేపు మున్సిపల్ కార్యాలయం గందరగోళం పెరిగింది.

### ఎన్నిక ఆపడం అన్యాయం

అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని స్థానిక నేతలు డిమాండ్ చేస్తున్నారు. కౌన్సిలర్లు ఆందోళన చేస్తూ కోర్టు స్టే కాపీ అందకుండానే ఎన్నికను వాయిదా వేస్తే పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది.మున్సిపల్ కార్యాలయం వెలుపల భారీగా కార్యకర్తలు మోహరించారు.శాంతిభద్రతలు సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఇబ్రహీంపట్నం ఎన్నిక హాట్ టాపిక్‌గా మారింది.పోలీసుల అదుపులో 19 వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి ఉన్నాడు.చైర్మన్ ఎన్నిక జరిగిన తర్వాత ఆకుల యాదగిరిని నేడు హైకోర్టు కు హాజరు పర్చాలని ఇబ్రహీంపట్నం పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# విపణి





## ఆంథ్రోపిక్‌తో ఇన్ఫీ జట్టు.. ఐటీ షేర్ల జంప్

**న్యూఢిల్లీ:**కృత్రిమమేధ 'ఆంథ్రోపిక్' భయాలతో గత వారం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురైన భారత ఐటీ కంపెనీల షేర్లు.. మంగళవారం కోలుకున్నాయి. నేటి ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ వంటి కంపెనీల షేర్లు రాణిస్తున్నాయి. దీంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ నేడు 2శాతం మేర పెరిగింది. 'ఆంథ్రోపిక్‌తో ఇన్ఫీ జట్టు కట్టడమే ఈ ర్యాలీకి ప్రధాన కారణంగా కన్పిస్తోంది. అధునాతన ఏఐ ఆవిష్కరణల కోసం ఆంథ్రోపిక్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ (ఎనిటనీబఎబ) ప్రకటించింది. ఆంథ్రోపిక్ క్లాడ్ ఏఐ మోడళ్లతో.. ఇన్ఫీ తోపజ్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను మిళితం చేసి కస్టమ్ ఏఐ ఏజెంట్లను రూపొందించనున్నారు. ఇటీవలే బెంగళూరులో ఆంథ్రోపిక్ తన తొలి కార్యాలయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా ప్రకటన వెలువడటం టెక్ షేర్ల సెంటిమెంట్‌ను బలపర్చింది. ఈ ప్రకటనతో మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో ఇన్ఫోసిస్ షేర్లు రాణిస్తున్నాయి. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో ఎన్ఎస్ఈలో ఇన్ఫీ షేరు ధర 4.28శాతం పెరిగి రూ.1,424 వద్ద ట్రేడ్ అవుతోంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు ధర 2.73శాతం పెరిగి రూ.1,501 వద్ద, టీసీఎస్ షేరు ధర 1.47శాతం లాభంతో రూ.2,746 వద్ద కొనసాగుతున్నాయి. విప్రో, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ లిమిటెడ్, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎంఫసిస్, ఎల్‌టీఎం లిమిటెడ్, టెక్ మహీంద్రా వంటి కంపెనీల షేర్లు కూడా ఒక శాతానికి పైగా పెరిగాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఐటీ సంస్థల షేర్లలోనూ కొనుగోళ్లు బలంగా ఉన్నాయి.

## ఉద్యోగం ఉండాలంటే ఏఐ టూల్స్‌పై పట్టు తప్పనిసరి

### యువతకు టెక్ దిగ్గజాల సూచన
### ఏఐ ఇంపాక్ట్ సమిట్

**న్యూఢిల్లీ:**కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోతున్నాయని ఆందోళన చెందుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు భరోసానిచ్చే సలహాను టెక్ పరిశ్రమ దిగ్గజాలు సూచిస్తున్నారు. 'ప్రశాంతంగా ఉండండి, నైపుణ్యాలు పెంచుకోండి' అని తెలిపారు. ఏఐ సముద్రాన్ని ఈదాలంటే, జీవితాంతం నేర్చుకునే సామర్థ్యం ఉండాలన్నారు. వచ్చే 3-5 ఏళ్ల పాటు ఏఐ మారుతూనే ఉంటుందని, అందువల్ల కంపెనీల్లో ఉద్యోగుల విషయంలో మార్పులు భారీగానే కనిపించొచ్చని సోమవారం దిల్లీలో ప్రారంభమైన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026'లో భాగంగా పలువురు వివరించారు. 'ఏఐ కారణంగా ప్రస్తుతం ఉన్న కొన్ని రకాల ఉద్యోగాలు పనికిరాకుండా పోవచ్చు. అదే సమయంలో కొన్ని కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ఉద్యోగులు ఏ నైపుణ్యం నేర్చుకోవాలో తరచూ గమనిస్తూ ఉండాల'ని 'ద ఫ్యూచర్ ఆఫ్ ఎంప్లాయబిలిటీ ఇన్ ద ఏజ్ ఆఫ్ ఏఐ' అనే సెషన్‌లో నిపుణులు పేర్కొన్నారు. నౌకరీ వ్యవస్థాపకుడు సంజీవ్ బిఖ్‌చందానీ మాట్లాడుతూ 'కంప్యూటర్లు వచ్చినపుడు, బ్యాంకుల్లో ఉద్యోగాలు పోతాయని చాలా మంది భావించారు. ఎవరి ఉద్యోగమూ పోలేదు. పైగా ఉత్పాదకత పెరిగింద'ని గుర్తు చేశారు. 'ఎక్కువగా ఆందోళన పడకండి. ఏఐ వల్ల మీ ఉద్యోగం పోకుండా ఉండాలంటే ఏం చేయాలో ఆలోచించండి. వచ్చే 3 నెలల్లో మీకు అవసరమయ్యే ఏఐ టూల్స్ నేర్చుకోవాలనే లక్ష్యం పెట్టుకోండి' అని యువతకు సలహానిచ్చారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ ఎడ్జ్‌వర్వ్ సీఈఓ సతీశ్ సీతారామయ్య మాట్లాడుతూ 'కంపెనీలకు మరింత ఉత్పాదకతను ఏఐ అందిస్తోంది. ఆ పనులను చూసుకోవాల్సిన బాధ్యత మనిషిదే. కాబట్టి ఉద్యోగాలు ఎక్కడికీ పోవు. చేసే పనే మారుతుంద'న్నారు. 'ఏఐతో 50% ఉద్యోగాలు




పోవచ్చు. అయితే 50% పైగా కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. మీ వృత్తిలో ఏ నైపుణ్యాలు అవసరమో గమనించండ'ని సంపర్క్ వ్యవస్థాపక ఛైర్మన్ వినీత్ నాయర్ అన్నారు.

**ఆసుపత్రుల్లో స్వయంచాలిత రోబో డెలివరీ సేవలు!**

భారత్‌లో తయారైన రోబోటిక్స్, ఏఐ వల్ల ఆసుపత్రులు, పరిశ్రమ ప్రాంగణాలు, పట్టణాల్లో లాజిస్టిక్స్ సేవల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. పూర్తిస్థాయి అటానమస్ డెలివరీ వ్యవస్థను ఓటోనమి ఇంక్ ఇక్కడి సదస్సులో ఆవిష్కరించింది. లెవెల్-4 అటానమస్ డెలివరీ రోబోట్స్ అయిన 'ఓటోబాట్స్'తో ఆసుపత్రులు, ఫ్యాక్టరీల్లోని ఫ్లోర్లు, ఎలివేటర్లతో పాటు సైడ్‌వాక్స్, సర్వీసు రోడ్ల వంటి సంక్లిష్ట ప్రాంతాల్లోనూ సేవలు అందించొచ్చు. అరైవ్‌ఏఐతో స్మార్ట్ స్టోరేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 'అరైవ్ పాయింట్స్'ను, స్కై ఎయిర్ మొబిలిటీ వద్ద డ్రోన్ సామర్థ్యాలను అందిపుచ్చుకుని ఈ డెలివరీ రోబోట్స్ రూపొందించినట్లు ఓటోనమి తెలిపింది.

**జియో ఏఐ పెవిలియన్‌ను సందర్శించిన మోదీ**

ఇండియా ఇంపాక్ట్ సమిట్‌లో 'జియో ఇంటెలిజెన్స్ పెవిలియన్'ను ప్రధాని నరేంద్రమోదీ సందర్శించారు. జియో ఏఐ స్టాక్, జియో సంస్కృతి ఏఐ, జియో ఆరోగ్య ఏఐ, జియో శిక్ష, జియో ఏఐ హోమ్ తదితర ప్లాట్‌ఫారాల లైవ్ డెమోలను ప్రధాని వీక్షించారు. భారతీయ భాషలు, సంప్రదాయ కంటెంట్‌ను ప్రోత్సహించడం, మరింత మెరుగ్గా ఆరోగ్య సంరక్షణ సేవల అందజేత, విద్యా వ్యవస్థల బలోపేతం, స్మార్ట్ లివింగ్‌కు ఏఐ వినియోగం వంటి వాటికి ఈ ప్లాట్‌ఫారాలను రూపొందించారు. ఆయా రంగాల్లో డిజిటల్ మార్పులను వేగవంతం చేసేందుకు, జియో విస్తృత స్థాయి ఏఐ వ్యవస్థలు, వాటి పాత్ర గురించి ప్రధాని మోదీకి జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ వివరించారు.

**టీసీఎస్‌తో ఏఎండీ భాగస్వామ్యం**

చిప్ తయారీదారు ఏఎమ్‌డీ, మనదేశంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇరు కంపెనీలు కలిసి ఏఎమ్‌డీకి చెందిన 'హీలియోస్' ప్లాట్‌ఫాంపై ఒక ర్యాక్-స్కేల్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిజైన్‌ను అభివృద్ధి చేస్తాయి. ఏఐ రెడీ డేటా సెంటర్ బ్లూప్రింట్‌ను సైతం సిద్ధం చేస్తాయి. తద్వారా ఎన్‌విడియా కార్పొరేషన్‌తో పోటీకి ఏఎమ్‌డీ సిద్ధమవుతోంది.

**ఎయిరిండియా, కాగ్నిజంట్‌కు ఆంథ్రోపిక్ సేవలు**

వినియోగదారు సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను సృష్టించే నిమిత్తం తమ క్లాడ్‌కోడ్‌ను ఎయిరిండియా వినియోగిస్తోందని ఆంథ్రోపిక్ ప్రకటించింది. కాగ్నిజంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ కార్ప్ లెగసీ సిస్టమ్స్‌ను తాము ఆధునికీకరిస్తున్నట్లు తెలిపింది. 'ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఏఐని అందిపుచ్చుకోవడం చాలా వేగంగా జరుగుతోంద'ని ఆంథ్రోపిక్ సహ వ్యవస్థాపకుడు డారియో అమోడే పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో కంపెనీ కార్యాలయాన్ని ఈయన ప్రారంభించారు.

**భారత కంపెనీలకు బ్లూమెషీన్స్ సేవలు**

'ఏఐ అనేది మానవ సామర్థ్యాన్ని మరింత పెంచుతుంద'ని బ్లూ మెషీన్స్ ఏఐ సీఓఓ క్షితిజ్ జైన్ అన్నారు. 'భారత్‌లో పలు పెద్ద కంపెనీలు మా సేవలను పొందుతున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల నుంచీ ఆసక్తి కనిపిస్తోంద'న్నారు. ఇటీవల ఏఐ-వర్సస్-హ్యూమన్ లైవ్ డిబేట్ నిర్వహించడం ద్వారా, ఈ కంపెనీ దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ తనవైపునకు తిప్పుకుంది.

**విదేశీ ప్రయాణికులకు ఎన్‌పీసీఐ వాలెట్ సేవలు**

భారత్‌లో పర్యటించే అంతర్జాతీయ ప్రయాణికులకు 'యూపీఐ ఒన్ వరల్డ్' పేరిట వాలెట్ సేవలను ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకురానుంది. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ప్రయోగాత్మకంగా ఈ సేవలను ప్రారంభించింది. దీని ద్వారా విదేశీయులు భారత్‌లో రియల్ టైం పర్సన్ టు మర్చంట్(పీ2ఎమ్) యూపీఐ చెల్లింపులు చేయగలుగుతారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,42,000 | ₹ 1,54,910 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,65,000

## రూ.3 లక్షల కోట్లు పెరిగిన సంపద

**న్యూఢిల్లీ:**విద్యుత్, బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్ల రాణింపుతో సోమవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. అమెరికా- ఇరాన్ చర్చల ప్రభావంతో, అంతర్జాతీయంగా చమురు ధరలు సానుకూలంగా కదలాడటం మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 8 పైసలు తగ్గి 90.74 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.35% లాభంతో 67.99 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, జపాన్ సూచీలు నష్టపోగా.. మిగతా దేశాలవి లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈలోని మదుపర్ల సంపద రూ.3.12 లక్షల కోట్లు పెరిగి రూ.468.58 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. నష్టాల్లో మొదలైనా..: బీఎస్ఈ సెన్సెక్స్ స్వల్ప నష్టాల్లో 82,480.40 పాయింట్ల (క్రితం ముగింపు 82,626.76) వద్ద ఆరంభమైంది. ఆ వెంటనే లాభాల్లోకి వచ్చిన సూచీ... క్రమక్రమంగా పెంచుకుంటూ వెళ్లింది. ఒకానొక దశలో 83,333.49 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 650.39 పాయింట్లు పెరిగి 83,277.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 211.65 పాయింట్లు పెరిగి 25,682.75 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,372.70 వద్ద కనిష్ఠాన్ని; 25,697 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. 9 మినహా మిగతావి లాభాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల్లో 9 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 4.45%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.19%, యాక్సిస్ బ్యాంక్ 1.83%, ఎన్‌టీపీసీ 1.69%, అదానీ పోర్ట్స్ 1.45%, ఐటీసీ 1.39%, ఏషియన్ పెయింట్స్ 1.38%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.35% లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 1.44%, మారుతీ సుజుకీ 1.17%, బజాజ్ ఫైనాన్స్ 1.10% నష్టపోయాయి. హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) నుంచి విభజించిన క్వాలిటీ వాల్స్ ఇండియా లిమిటెడ్ షేర్లు సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. వ్యాపార విభజన ఆధారంగా.. క్వాలిటీ షేర్లకు నిర్ధరించిన ధర (ఇండికేటివ్ ప్రైస్) రూ.38.15తో పోలిస్తే, 21.6% తక్కువగా రూ.29.90 వద్ద బీఎస్ఈలో క్వాలిటీ వాల్స్ షేర్ల ట్రేడింగ్ ఆరంభమై, రూ.29.51 వద్ద ముగిశాయి. ప్రారంభ ధరతో పోలిస్తే షేరుకు 1.30% నష్టం వచ్చింది. జెన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ యూనిస్ట్రింగ్ టెక్ సొల్యూషన్స్.. అధునాతన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ రూపకల్పన, అభివృద్ధి కోసం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) నుంచి రూ.30.01 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకుంది. పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ జ్యువెలరీ ఐపీఓ ఈనెల 24న మొదలై 26న ముగియనుంది.

# తొలి ట్రిలియనీర్‌గా మస్క్..

## సరికొత్తరికార్డు దిశగా అమెరికా కుబేరుడు



**ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డుకు చేరువవుతున్నారు. ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా మారనున్నారు. ఈ ఏడాదిలోనే ఆ మార్క్ చేరనున్నారని అంచనాలు ఉన్నాయి. ఈ ఫిబ్రవరి నాటికి 800 బిలియన్ డాలర్ల మార్క్ దాటిన తొలివ్యక్తిగా మస్క్ నిలిచారు. ప్రస్తుతం ఆయన సంపద 850 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రపంచం లో అత్యధిక సంపద కలిగిన కుబేరుల జాబితాలో ఉన్న గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్ సెర్గీబ్రిన్ మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఈ ముగ్గురి నికర విలువ కంటే మస్క్‌దే ఎక్కువ కావడం గమనార్హం. ట్రిలియన్ డాలర్ల మార్క్ దిశగా ఆయన సంపద వేగంగా పెరగడం వెనక స్పేస్‌ఎక్స్, ఎక్స్‌ఏఐ మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం కీలకంగా మారింది. కృత్రిమ మేధ, సోషల్ మీడియా సంస్థ ఎక్స్‌ఏఐని గత వారం 1.25 ట్రిలియన్ డాలర్లతో స్పేస్‌ఎక్స్ కొనుగోలు చేసింది. విలీనం అయిన సంస్థలో ఆయన వాటా 43 శాతంగా ఉంది. ఆ వాటా విలువే 530 బిలియన్ డాలర్లు. ఇక, మస్క్‌కు టెస్లా 12 శాతం వాటా ఉంది. దాని విలువ 178 బిలియన్ డాలర్లుగా ఉంది. కాగా.. ఏడాదిలో ఈ బిలియనీర్.. ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాదిలో స్పేస్‌ఎక్స్ ఐపీఓకు రానుంది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా 25 బిలియన్ డాలర్లను (సుమారు రూ.2.26 లక్షల కోట్లు) సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే.. ఆయన నికర విలువ 1.5 ట్రిలియన్ డాలర్లకు కూడా పెరగనుందన్న అంచనాలు ఉన్నాయి.**

## ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు బిల్‌గేట్స్ దూరం..

### ఎప్‌స్టీన్ వ్యవహారమే కారణమా..?



**న్యూఢిల్లీ:**భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ హాజరుకాక పోవచ్చని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌కు సంబంధించి ఇటీవల విడుదలైన ఫైళ్లలో ఆయన పేరు కూడా ఉంది. దాంతో గేట్స్‌కు ఇచ్చిన ఆహ్వానాన్ని కేంద్ర ప్రభుత్వం సమీక్షించిందని సమాచారం. ప్రభుత్వ వర్గాలను ప్రస్తావిస్తూ ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడాలని కోరుకుంటుందని పేర్కొన్నాయి. ఇటీవల ఎప్‌స్టీన్ ఫైళ్లను అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ చట్టం కింద అమెరికా న్యాయశాఖ వెబ్‌సైట్‌లో ఈ పత్రాలు, వీడియోలు, ఫొటోలు అందుబాటులో ఉంచింది. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. అతడు ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలు ఉన్నాయి. గేట్స్‌పై ఎప్‌స్టీన్ చేసిన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అయితే వాటిని ఆయన బృందం ఖండించిన సంగతి తెలిసిందే. "బిల్‌గేట్స్ ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు హాజరవుతారు. అక్కడ షెడ్యూల్ ప్రకారం ఉపన్యసిస్తారు" అని గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి జాతీయ మీడియాతో వెల్లడించారు. ఈ కథనాలపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రావాల్సిఉంది.



## నిబంధనలను అతిక్రమిస్తే సహించేదిలేదు

తమ హక్కుగా విదేశీయులు భావించొద్దని అన్నారు. అది కేవలం ఒక అనుమతి మాత్రమేనని చెప్పారు. వీసాలు పొందిన వారికి ప్రత్యేక చట్టపరమైన హక్కులు ఏవీ ఉండవని చెప్పారు. వీసా కచ్చితంగా ఇవ్వాలన్న రాజ్యాంగ నిబంధన ఏదీ లేదని అన్నారు. 'టూరిస్టుగా, స్టూడెంట్‌గా, జర్నలిస్టుగా ఈ దేశంలోకి వచ్చిన వారు అమెరికా జాతీయ భద్రతకు విఘాతం కలిగించే పనులు చేశారంటే మీ వీసాలను తీసేసుకుంటాం' అని హెచ్చరించారు. వలసల నిరోధానికి అమెరికా ఇప్పటికే పలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. గత నెలలో ఏకంగా 75 దేశాల వారికి ఇమిగ్రెంట్ వీసాల జారీని నిలిపివేసింది. ఈ దేశాల వారు అమెరికా ప్రభుత్వ ఖజానాకు భారంగా మారుతున్నారని తెలిపింది.

## మన వ్యవసాయ రంగానికి రూ.36 లక్షల కోట్ల అవకాశాలు

### అమెరికా, ఐరోపాలతో భారత్ ఒప్పందాల నేపథ్యం

**న్యూఢిల్లీ:** అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ)తో కుదిరిన వాణిజ్య ఒప్పందాల కారణంగా, భారత వ్యవసాయ రంగానికి 400 బి. డాలర్ల (దాదాపు రూ.36 లక్షల కోట్ల) అవకాశాలు లభించగలవని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాకు భారత వ్యవసాయ ఎగుమతులు 2.8 బి. డాలర్లుగా ఉండగా, దిగుమతులు 1.5 బి. డాలర్ల మేర ఉన్నాయి. వివిధ దేశాల నుంచి మనదేశానికి వస్తున్న వ్యవసాయ దిగుబడుల విలువ 35 బి. డాలర్లు (సుమారు రూ.3.15 లక్షల కోట్లు)గా ఉండగా, ఇక్కడి నుంచి వెళ్లే ఎగుమతులు విలువ 51-52 బి. డాలర్ల (సుమారు రూ.4.59-4.68 లక్షల కోట్లు) ఉన్నాయి. 'అమెరికా, ఐరోపా ఒప్పందాలతో ఇంతకు కొన్ని రెట్లు అధికంగా 400 బి. డాలర్ల మార్కెట్లు అందుబాటులోకి వస్తాయి. మన వ్యవసాయ రంగానికి ఇది ఒక గొప్ప అవకాశమ'ని పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల మన రైతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, ఆయన ఇలా వ్యాఖ్యానించారు. ఏ దేశంతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలోనూ డెయిరీ, పౌల్ట్రీ, తృణధాన్యాలకు సుంకం మినహాయింపులను మనదేశం ఇవ్వడం లేదన్నారు. మధ్యంతర ఒప్పందంలో డిజిటల్ వాణిజ్య అంశం లేదు: అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో, డిజిటల్ వాణిజ్యం అంశం లేదని, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)లో ఇది భాగంగా ఉంటుందని మరో అధికారి తెలిపారు. విదేశీ ఇ-కామర్స్ సరఫరాలపై 2% సుంకాన్ని గతేడాది మనదేశం ఉపసంహరించిన సంగతి తెలిసిందే.



## పోతూ.. పోతూ.. భారత్‌పై కవ్వింపులు

### యూనస్ నోట మళ్లీ 'సెవెన్ సిస్టర్స్' మాట



**ఢాకా:**బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఇప్పటివరకు తాత్కాలిక ప్రభుత్వ సారథిగా ఉన్న మహమ్మద్ యూనస్ సోమవారం తన పదవి నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అయితే, అందులో ఆయన మరోసారి భారత వ్యతిరేక వైఖరిని ప్రదర్శించారు. మన ఈశాన్య రాష్ట్రాలైన 'సెవెన్ సిస్టర్స్‌ను ప్రస్తావిస్తూ అక్కసు వెళ్లగక్కారు. "విశాల సముద్రం మా దేశానికి కేవలం భౌగోళిక సరిహద్దు మాత్రమే కాదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థతో అనుసంధానం కావడానికి బంగ్లాదేశ్‌కు ఉన్న మార్గం అది. నేపాల్, భూటాన్, సెవెన్ సిస్టర్స్‌తో కలిసి ఈ ప్రాంతం గొప్ప ఆర్థిక సామర్థ్యాన్ని కలిగిఉంది" అని యూనస్ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. భారత్ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. మన ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్ తో కలిపి ఓ సబ్-రీజియన్‌గా పేర్కొనడం రెచ్చగొట్టే చర్యేనని స్పష్టమవుతోంది. మన దేశంపై యూనస్ ఇలా నోరు పారేసుకోవడం కొత్తేం కాదు. గతంలో చైనా పర్యటన సందర్భంగా భారత ఈశాన్య రాష్ట్రాల గురించి ప్రస్తావించారు. ఈ రాష్ట్రాల వారు సముద్రానికి చేరుకోవడానికి వేరే మార్గం లేదని, ఈ ప్రాంతంలో సముద్రానికి తామే రక్షకులమని అన్నారు. చైనా ఆర్థిక బేస్‌ను విస్తరించుకోవడానికి ఇది భారీ అవకాశం అంటూ కవ్వింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యలను నాడు భారత్ తీవ్రంగా ఖండించింది. ఈశాన్య రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపుర్, మేఘాలయా, మిజోరం, నాగాలాండ్, త్రిపురను సెవెన్ సిస్టర్స్‌గా పిలుస్తారని తెలిసిందే. ఇదిలాఉండగా.. బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీఎన్‌పీ మంగళవారం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ నూతన ప్రధానిగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. 2024లో విద్యార్థుల ఆందోళనలతో మాజీ ప్రధాని షేక్ హసీనా గద్దె దిగిన సంగతి తెలిసిందే. అనంతరం ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వానికి యూనస్ సారథ్యం వహించారు. 18 నెలల పాటు ఆయన నేతృత్వంలో పాలన సాగింది. ఈ క్రమంలోనే అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. సోమవారం తన బాధ్యతల నుంచి వైదొలుగుతూ.. బంగ్లాదేశ్ ఏమాత్రం లొంగిపోయే దేశం కాదని వ్యాఖ్యానించారు. ఇతర దేశాల సలహాలు, సూచనలతో తమ ప్రభుత్వం పనిచేయబోదని వెల్లడించారు.

## పిల్లలపై లైంగిక వేధింపులు.. అమెరికాలో భారతీయుడి అరెస్ట్



**వాషింగ్టన్:**పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో భారత్‌కు చెందిన ఓ వ్యక్తి అమెరికాలో అరెస్ట్ అయ్యాడు. నిందితుడిని ఓడెల యశస్వీ కొత్తపల్లిగా గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా అతడు అగ్రరాజ్యంలోకి ప్రవేశించినట్లు అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశారు. న్యూజెర్సీలో 13 ఏళ్ల లోపు చిన్నారులను నిందితుడు లైంగికంగా వేధించినట్లు అభియోగాలు నమోదయ్యాయి. అంతేగాక.. దొంగతనాలు, శాంతి భద్రతలకు భంగం కలిగించడం వంటి నేరాలతోనూ అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే, నిందితుడిపై కేసు ఎక్కడ నమోదైంది?, ఎప్పుడు అరెస్ట్ చేశారు? వంటి పూర్తి వివరాలను మాత్రం అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు వెల్లడించలేదు. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, అతడిని దేశం నుంచి బహిష్కరించేందుకు న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలోకి ప్రవేశించారన్న కారణంతో గతేడాది పెద్దసంఖ్యలో భారతీయులను అగ్రరాజ్యం నుంచి వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దాదాపు 3,800 మంది భారత పౌరులను అమెరికా స్వదేశానికి తిప్పిపంపింది.

# విద్యుత్ శాఖలో..వింత

### బాధ్యతలు కమాన్‌పూర్‌లో.. విధులు కార్పొరేట్ ఆఫీస్‌లో..!

- కమాన్ పూర్ సబ్ ఇంజనీర్ ను వర్కింగ్ ఇన్స్ట్రక్షన్స్ పేరిట వరంగల్ కార్పొరేట్ ఆఫీస్‌కు
- ఇటు పనుల పెండింగ్.. అటు ఏఈపై పని భారం
- ఉన్నతాధికారులు స్పందించి తిరిగి కమాన్‌పూర్‌కు పంపించాలని వినతి



**మంథని, (జనంసాక్షి) :** టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో వింత సంఘటన నెలకొందని చెప్పక తప్పదు. పెద్దపల్లి జిల్లా విద్యుత్ శాఖ ఎన్పీడీసీఎల్‌లో కమాన్‌పూర్ సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రావణ్ కుమార్ ను గత నాలుగు నెలల క్రితం వర్కింగ్ ఇన్స్ట్రక్షన్స్ పేరిట ఉన్నతాధికారులు వరంగల్ కార్పొరేట్ ఆఫీస్ కు పంపించారు. మండల స్థాయిలో ఏఈ కార్యాలయంలో కీలక విధులైన పనుల ఎస్టిమేషన్లు తయారు చేయడం గాని, స్కెచ్‌లు వేయడం గాని బాధ్యతలు సబ్ ఇంజనీర్ చేయాల్సి ఉంటుంది. అయితే ఉన్నతాధికారులు సబ్ ఇంజనీర్ ను వర్కింగ్ ఇన్స్ట్రక్షన్స్ పేరిట వరంగల్ కార్పొరేట్ కార్యాలయానికి పంపించడంతో పనులు ఎక్కడికక్కడ పెండింగ్‌లో పడుతున్నాయి. మరోవైపు ఏఈ అశోక్ కుమార్ ఇటు తన బాధ్యతలు అటు సబ్ ఇంజనీర్ బాధ్యతలు రెండు నిర్వర్తిం చాల్సి వస్తున్నది. రెండు బాధ్యతలు నిర్వర్తించలేక ఏఈ అశోక్ కుమార్ సైతం సతమతమవు తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కమాన్ పూర్ సబ్ శ్రవణ్ కుమార్ ను వరంగల్ కార్పొరేట్ ఆఫీస్ నుంచి తిరిగి కమాన్ పూర్ కు పంపించాలని విద్యుత్ శాఖ సిబ్బంది, మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

## ప్రధాన రహదారిపై కారు బైక్ ఢీ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17,(జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లి గ్రామ కామారెడ్డి – సిరిసిల్ల ప్రధాన రహదారి మంగళవారం రాత్రి కారు ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అతని కారులో సిరిసిల్ల వైపు వెళ్తుండగా కామారెడ్డికి చెందిన ఒక వ్యక్తి ద్విచక్రవాహనం టిఎస్17ఈ7972 నెంబర్‌పై సిరిసిల్ల నుండి కామారెడ్డివైపు వెళ్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలం చేరుకొని, పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# కేసులకు అదిరేది లేదు... బెదిరేది లేదూ





- ఎమ్మెల్యేకు ఓ న్యాయం... మాకు ఓ న్యాయమా?
- తాండూరులో అన్నదమ్ముల రాజకీయ బాగోతం
- మరో రాయలసీమగా తాండూరు మారనుందా?
- కాంగ్రెస్ అవినీతి పాలనను అడ్డుకుంటాం : బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**తాండూరు, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు కేసులు పెడితే అదిరేది లేదు, బెదిరేది లేదని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... కౌంటింగ్ కేంద్రంలోకి ఎమ్మెల్యే తోపాటు అనుచరులు వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులపై గౌరవం ఉందని, 48 గంటలు గడిచినా కాంగ్రెస్ నేతలపై ఎలాంటి చర్యలు లేవని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కొత్త సంస్కృతికి తెరలేపిందని, 11న పోలింగ్ రోజు ఆర్‌బీఎల్ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి 23వ వార్డులో దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. పోలీసు అధికారులు సమాన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటే రౌడీలా... కాంగ్రెస్‌లో ఉంటే నాయకులా అని వ్యంగ్యంగా అన్నారు. బీఆర్ఎస్ నుంచి వెళ్లి కాంగ్రెస్‌లో చేరి నీతులు మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. డీసీసీబీ అధ్యక్షులు దారాసింగ్ తన సోదరుడు ఓడిపోయారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు చేస్తున్న ఆరాచక పాలనకు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. శ్రీనివాస్ రెడ్డి అధికారంతో లోపలికి వెళ్లారని, 36వ వార్డుపై దృష్టి పెట్టాలని, సాయిపూర్‌ను మాత్రమే అభివృద్ధి చేస్తామని చెప్పడం చైర్‌పర్సన్ నిరజ బాల్ రెడ్డికి దక్కిందని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో ఉంటాం, సమస్యలపై నిలదీస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, పోలీసులపై వత్తాసు తెచ్చి బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టారని ఆరోపించారు. రోహిత్ రెడ్డిని అరెస్టు చేస్తే తాండూరు అగ్నిగుండంగా మారుస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు కేసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ 2 సంవత్సరాల ఆరాచక పాలన కొనసాగిస్తోం దని, బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆరోగ్యం, టిల్లు ఆమలు చేయాలని, ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని తెలిపారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భం గా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దేముల్ మండల అధ్యక్షులు కోహిర్ శ్రీనివాస్, బషీరాబాద్ మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, తాండూరు మండల అధ్యక్షులు వీరేందర్ పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్, కౌన్సిలర్లు యోగానంద్, జావిద్, మాజీ కౌన్సిలర్లు శోభారాణి, పరిమళ రవిందర్, యువ నాయకులు సంతోష్ గౌడ్, ఆసిబ్, సిద్రాల శ్రీనివాస్, మండల జనరల్ సెక్రటరీ రాకేష్ గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 19న ఉచిత ఆయుర్వేద శిబిరం

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సేవా సమితి ఆర్జీ–1 ఆధ్వర్యంలో ఆయుర్వేద స్పెషలిస్టు డాక్టర్ విశ్వనాథ మహర్శి మాత రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ స్వచ్ఛంద సంస్థ హైదరాబాదు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆర్‌సిఓఏ క్లబ్‌లో ఈ నెల 19 (గురువారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించ నున్నారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ఆయుర్వేద స్పెషలిస్టు ప్రత్యేకించి వివిధ వ్యాధులకు ఆనారోగ్య సమస్యలకు చర్మవ్యాధులకు, మోకాళ్ళ నొప్పులకు, గుండెదడ, బిపి, షుగర్, థైరాయిడ్, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా, స్త్రీలకు సంబంధించిన వ్యాధుల నివారణ కోసం ఈవైద్య శిబిరాన్ని ఉచితంగా నిర్వహించనున్నట్టు సింగరేణి సేవా సమితి తెలిపింది. మందులకు మాత్రం నామమాత్రపు వెల తీసుకుంటారని పేర్కొన్నారు. వివరాలకు డాక్టర్ విశ్వనాథ మహర్శి,అయుర్వేద స్పెషలిస్టు సెల్ నెం.9849574706 సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సింగరేణి ఉద్యోగస్తులు.. వారి కుటుంబ సభ్యులు, సింగరేణి ప్రభావిత, పారిశ్రామిక ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మాస్ట్రో విద్యార్థి

### సిఎం కప్ బెస్ బాల్ ఎంపిక



**కథలాపూర్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** కథలాపూర్ మండల కేంద్రం మాస్ట్రో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి చొప్పరి ప్రణవ్ ఈనెల 13వ తారీఖున జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ బేస్ బాల్ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ఈనెల 17 నుండి హైదరాబాదులోని గచ్చిబౌలి లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొనడం జరుగుతుంది అని పాఠ శాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ ప్రిన్సిపల్ ఆకుల రంజిత్ వ్యాయామ ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం తెలియడం జరిగింది.

# నిర్లక్ష్యం వద్దు.. ఫైర్ సేఫ్టీలో రాజీ పడొద్దు

- హాస్టళ్ల నిర్వాహకులకు సూచించిన హైడ్రా కమిషనర్
- ఫైర్ సేఫ్టీపై హాస్టళ్ల నిర్వాహకులకు హైడ్రా అవగాహన




**హైదరాబాద్, ఫిబ్రవరి 17:** అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండా లి.. ఫైర్ సేఫ్టీ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని హాస్టళ్ల నిర్వాహకులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వస్తున్నది వేసవి కాలం.. ఎక్కడ ఏమాత్రం పొరపాటు జరిగినా పెనుముప్పు సంభవిస్తుంది.. ఇటీవ ల నగరంలో జరిగిన అగ్ని ప్రమాదాలే ఇందుకు నిదర్శనమన్నారు. నగరంలో లెక్కకు మిక్కిలిగా ఉన్న హాస్టళ్లు చాలావరకు ఫైర్ సేఫ్టీ నిబంధ నలు పాటించడం లేదని ఫిర్యాదుల నేపథ్యంలో అగ్ని ప్రమాదాలపై హైడ్రా మంగళవారం ఓ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది. హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఫైర్ సేఫ్టీ విషయంలో పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. దేశవ్యాప్తంగా అనేకమంది నగరానికి వచ్చి జీవనోపాధి పొందుతున్నారు. నగరంలోని పలు హాస్టళ్లలో నివాసం ఉంటున్నారు. మీరు నిర్వహిస్తున్న హాస్టల్ వారికి ఓ వరం కావాలి. వారి బంగారు భవిష్యత్తుకు హాస్టళ్లు ఒక మెట్టుగా ఉండాలి. వారి భద్రత విషయంలో రాజీ పడొద్దని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. అగ్ని ప్రమాదాలపై హైడ్రా జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటిస్తామని హాస్టళ్ల నిర్వాహకులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడంలో ప్రభుత్వ కృషిలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని సైబరాబాద్ హాస్టళ్ల యజమానుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు అమర్‌నాథ్ రెడ్డి, కరుణాకర్ తో పాటు హాస్టళ్ల నిర్వాహకులు తెలిపారు. హాస్టళ్లలో నివాసం ఉంటున్న వారి భద్రత ప్రాధాన బాధ్యతగా భావిస్తామన్నారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ ఎఫ్‌వో జయప్రకాష్, డీఫ్‌వోలు యజ్ఞ నారాయణ, గౌతమ్, ఏడీఎఫ్‌వో మోహనరావుతో పాటు ఎస్ఎఫ్‌వోలు, జంటనగరాలలోని హాస్టళ్ల నిర్వాహకులు పలువురు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ



**గంభీరావుపేట ఫిబ్రవరి 17 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో సిఆర్ఆర్ నిధుల ద్వారా ద్వారా మంజూరైన 40 లక్షల మురికి కాలువ సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ దుంపల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు ఈ కార్యక్రమానికి విచ్చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయంగా ఉంటూ అనంతరం గెలుపు ఓటమిలను పక్కనపెట్టి అభివృద్ధే లక్ష్యంతో మా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడం తోపాటు గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూరుస్తుందని తెలిపారు రాజకీయాలలో గెలుపోటములు సహజమని ఎవరు గెలిచామని కాదు అభివృద్ధి నీ ముందుకు తీసుకు వెళ్తున్నామా లేదా అని ఆలోచనకొద్దీ పని చేస్తున్నట్లు తెలిపారు రానున్న రోజుల్లో మరిన్ని నిధులతోటి దమ్మన్నపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుకు వెళ్తామని పునరుద్ఘాటించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ గ్రామ శాఖ అధ్యక్షుడు బలరాం రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు ఎంపీడీవో మండల అధికారులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## మర్యాదపూర్వకంగా ఉపరాష్ట్రపతిని కలిసిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి):** భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ ను మంగళవారం రోజు న్యూఢిల్లీలోని తన నివాసం లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు తన కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని ప్రస్తుత సామాజిక–ఆర్థిక పరిస్థితులు, వివిధ ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, జాతీయ ప్రాధాన్యత గల అంశాలపై సానుకూల చర్చ జరిగినట్లు. దేశాభివృద్ధి దిశగా కేంద్ర–రాష్ట్ర సమన్వయం, ప్రజాసేవలో పారదర్శకత, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు వంటి విషయాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఉప రాష్ట్రపతి కి శుభాకాంక్షలు తెలియజేసి, దేశ ప్రగతికి ఆయన నాయకత్వం మరింత దోహదపడాలని ఆకాంక్షించారు.



## శేరిలింగంపల్లిలో 101 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్ - రూ.25.72 లక్షల విలువ
- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిందితులు
- పరారీలో ఉన్న ఒడిశా మూలం వ్యక్తి కోసం గాలింపు
- సమాచారం ఇచ్చినవారికి రివార్డు ప్రకటన

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించడానికి వక్రమార్గంలో పయనిస్తున్న ఇద్దరు వ్యక్తులు మంగళవారం భారీ మొత్తంలో గంజాయిని విక్రయించే క్రమంలో అడ్డంగా దొరికిపోయారు. శేర్లింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్ ఈ మేరకు మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అక్రమంగా గంజాయిని నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటి సిబ్బంది సహకారంతో జాయింట్ ఆపరేషన్ నిర్వహించి అరెస్టు చేశారు. కాగా నిందలిద్దరూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్వ జగన్నాథం (37), పల్లపు లక్ష్మీనారాయణ (52) అని పోలీసులు పేర్కొన్నారు. మద్యానికి జల్సాలకు బానిసగా మారిన వీరిద్దరూ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి వ్యాపారానికి అలవాటు పడడం జరిగిందన్నారు. ఒడిశాకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి సుమారు 101.7 కిలోల గంజాయిని సేకరించి తెల్లాపూర్ పరిధిలోని శిల్పా వెంచర్ సమీపంలో కార్మికుల క్యాంపుల వద్ద విక్రయించేందుకు నిల్వ చేయడం జరిగిందని డిసిపి వివరించారు. ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడి నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుంచి రూ. 25.72 లక్షల విలువైన గంజాయితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు రాజు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని డిసిపి సిహెచ్ శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కొల్లూరు సిఐ గణేష్ పటేల్, ఎస్ఓటీ బృందాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. గంజాయి లేదా మాదకద్రవ్యాల సరఫరాపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా సైబరాబాద్ ఎన్‌డీపీఎస్ సెల్ వాట్సాప్ నంబర్ 9490617444కు ఫిర్యాదు చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు






**ఖమ్మం, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వరాష్ట్ర సాధకుడు, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం కెసిఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి హాజరై కేసీఆర్ జన్మదిన కేకును కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు, పార్టీ కార్యకర్తలకు పంచారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిపోసి, కోట్లాది మంది ఆకాంక్షలకు స్వరూపం కల్పించిన మహా నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు నడిపి, తెలంగాణను సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్వరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. సాగునీటి రంగంలో కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టులతో తెలంగాణను సస్యశ్యామలం చేసిన దూరదృష్టి గల నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ ప్రసాద్ రావు పువ్వాడ అజయ్ కుమార్ గారి వ్యక్తిగత సహాయకులు చిరుమామిళ్ల రవి కిరణ్, ఆరో డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండ జ్యోతి రెడ్డి,23వ డివిజన్ కార్పొరేటర్ మాగబుల్,బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాంకుడోత్ సురేష్ నాయక్, రఘునాధపాలెం మండల అధ్యక్షులు అజ్మీర వీరు నాయక్, రఘునాధపాలెం మండల నాయకులు పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, నగర యువజన విభాగం త్రీ టౌన్ అధ్యక్షులు మాటేటి కిరణ్, నగర ప్రచార కార్యదర్శి సకిన, మహిళా విభాగం నాయకురాలు కొల్లు పద్మ,బీసీ సెల్ నాయకులు వీరేంద్ర గౌడ్, యువజన విభాగం నాయకులు కొమ్ము విజేత,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమై పారదర్శక పాలన సాగించాలి

- గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి
- సర్పంచులకు శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్
- తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యంపై ప్రాధాన్యత
- బాల్య వివాహాలు, ఆక్రమణల నిర్మూలనకు చర్యలు



**తాండూరు, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** పల్లెల సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తూ తమ శక్తి సామర్థ్యాలను చాటాలని అదనపు కలెక్టర్ సుధీర్ పిలుపునిచ్చారు. తాండూరు నియోజకవర్గం ఎంపీడీఓ భవనంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ సర్పంచుల అధికారాలు, విధులు, బాధ్యతల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమర్థవంతమైన పాలన అందిస్తూ రిజర్వేషన్లకు సార్థకత చేకూర్చాలని సూచించారు. గ్రామ పాలనలో కుటుంబ సభ్యుల జోక్యానికి అవకాశం ఇవ్వకుండా గ్రామ ప్రథమ పౌరులుగా గౌరవాన్ని పెంపొందించు కోవాలని, ఇది భవిష్యత్తులో ఉన్నత పదవులకు ఆస్కారం కల్పిస్తుందని తెలిపారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత సర్పంచులపై ఉందని పేర్కొన్నారు.

తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, అంగన్వాడి కేంద్రాలను సందర్శిస్తూ లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి సవరించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల ప్రగతి కోసం జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. బాల్య వివాహాలు వంటి దురాచారాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై పారదర్శకంగా పాలన సాగించాలని, గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై పూర్తి అవగాహన ఏర్పరచుకుంటే సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. పన్నులు, ఇతర స్థానిక వనరుల ద్వారా సమకూరే ఆదాయ వనరులపై దృష్టి కేంద్రీకరించాలని, ఆదాయం సమకూరితే ప్రజోపయోగ పనులను చేపట్టి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని, వినూత్న ఆలోచనలతో పల్లెల ప్రగతికి పాటుపడి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. శిక్షణా తరగతుల్లో చెప్పే ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకుని గ్రామాల్లో సమర్థవంతమైన పాలన అందిస్తూ ఉత్తమ సర్పంచులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఆయా గ్రామాల సర్పంచులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై భారత పతాకం రెపరెపలు

- అబుదాబిలో ఓపెన్ మాస్టర్స్ క్రీడల్లో రెండు బంగారు పతకాలు
- 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగుల్లో సత్తా చాటిన డాక్టర్ కొలన్ జగజ్జీవన్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల్లో నిలబడటం ఒక్కటే పెద్ద సవాలు కాగా, అందులోనే రెండు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించడం అరుదైన ఘనతగా నిలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబిలో ఎమిరేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ మాస్టర్స్ గేమ్స్––2026లో భారతదేశానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ డాక్టర్ కొలన్ జగజ్జీవన్ రెడ్డి 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగుపందాల్లో మొదటి స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి 6న ప్రారంభమైన ఈ క్రీడా మహోత్సవంలో 148 దేశాలకు చెందిన సుమారు 27 వేల మంది క్రీడాకారులు పాల్గొనగా, తీవ్ర పోటీ మధ్య ఆయన ప్రదర్శించిన పట్టుదల, స్థైర్యం ప్రత్యేకంగా నిలిచింది. ౨ గత విజయాల జాడలోనే కొత్త రికార్డు: ఇప్పటికే 2024లో అమెరికాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఆయన, అదే ఆత్మవిశ్వాసంతో అబుదాబి వేదికపై మరోసారి ప్రతిభ చాటుతూ దేశానికి కీర్తి తీసుకువచ్చారు. ౨ దేశ గౌరవమే లక్ష్యం: భారత పతాకం ఎగురవేయడం ప్రతి క్రీడాకారుడి కల కాగా, స్వర్ణ పతకాలతో దేశానికి గౌరవం తేవడం గర్వకారణమని డాక్టర్ జగజ్జీవన్ రెడ్డి పేర్కొన్నారు; రాబోయే రోజుల్లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి దేశ ప్రతిష్ఠను మరింత పెంచాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్నట్లు తెలిపారు.



# షబ్బీర్ అలీ కామారెడ్డికి పట్టిన శని

### ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్ర విమర్శలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** కామారెడ్డి ప్రజలు ఐదుసార్లు ఓడగట్టినా షబ్బీర్ అలీకి బుద్ధి లేదని, ఇంకా ఎన్నేళ్లు ఇక్కడ ఉంటారని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచామని విర్రవీగుతున్నాడని, మాపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీజేపీ కార్యాలయంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి రమణారెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిసారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ఆయన ఆస్తులెన్ని.. ఇప్పుడు ఎన్ని అని ప్రశ్నించారు. అరోరా కాలేజీకి తమ తండ్రి గజం స్థలం అమ్మినట్టు ఆధారాలున్నా అరగుండు కొట్టించుకుంటానని సవాల్ విసిరారు. కామారెడ్డిలో షబీర్ అలీ, ఆయన సోదరుడు కలిసి చేసిన భూకబ్జాలకు సంబంధించిన వివరాలు అన్నీ ఉన్నాయని, ఎమ్మెల్సీ పోటీచేస్తే తమవద్ద ఎన్ని డబ్బులు తీసుకున్నావో గుర్తులేదా అని అన్నారు. షబ్బీర్ అలీ వల్ల ఒక్క నాయకుడూ, కార్యకర్త బాగుపడ్డ పరిస్థితి లేదన్నారు. ఇందిరా చౌక్‌లో ఆమె విగ్రహం పెట్టడానికి 20 లక్షలు వసూలు చేశారని గుర్తుచేశారు. తాను తప్పు చేయబోనని, ఎవరు చేసినా వదిలేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు.



# వీధి రౌడీలా కామారెడ్డి ఎమ్మెల్యే తీరు

### మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ చేజారిందన్న ఫ్రస్టేషన్‌లో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సైకోలా ప్రవర్తిస్తున్నారని, ప్రజాప్రతినిధి హోదాను మరచి వీధి రౌడీలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొని ఎమ్మెల్యేపై సంచలన ఆరోపణలు చేశారు. షబ్బీర్ అలీపై ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. షబ్బీర్ అలీ, వారి కుటుంబ సభ్యులు చట్టబద్ధంగానే భూములు కొనుగోలు చేశారు తప్ప ఎవరినీ బెదిరించలేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల భూమిని కబ్జా చేసి ప్రహరీ గోడ కట్టిందెవరో అందరికీ తెలుసన్నారు. రైతుల బిడ్డల కోసం సేకరించిన 260 ఎకరాల భూమిని అరోరా ఇంజనీరింగ్ కాలేజీకి దారదత్తం చేసి, ఆ భూములను బ్యాంకులో కుదవపెట్టి రూ. 7 కోట్లు తీసుకున్నది వాస్తవం కాదా అని నిలదీశారు. ఎమ్మెల్యే తన సొంత మిత్రులను, వ్యాపార భాగస్వాములను కూడా వదలలేదని నాయకులు ఆరోపించారు. ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోతే ప్రజలే ఆయన బట్టలు ఊడదీసే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు అంజద్, మాజీద్, లడ్డు, సిద్ధిక్, కళ్లెం సత్యం, యూనిస్, వాజీద్, అనంతరెడ్డి, గంప ప్రసాద్, జమీల్, విద్యార్థి నాయకులు సందీప్ చందు, తుడుము ప్రదీప్ పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లకు సన్మానం

### సన్మానించిన ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్



**ఆర్మూర్,ఫిబ్రవరి 17 (జనంసాక్షి):** ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణానికి నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘు,వైస్ చైర్మన్ కాటిపల్లి వెంకట్ రెడ్డి లను ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ సభ్యులతో కలిసి మంగళవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణ ప్రజలు ఇచ్చిన తీర్పు చాలా గొప్పదన్నారు.పట్టణ ప్రజలు చైతన్య వంతులై ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధతతో సామాజిక సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తులనే ఎన్నుకున్నారన్నారు.నూతన పాలకవర్గ సభ్యులందరూ ప్రజలకు మంచి సేవలు అందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో అర్గుల్ నర్సయ్య,పిసి గంగారెడ్డి, కాటిపల్లి చిన్న గంగారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు రాంప్రసాద్, వినోద్, రామచందర్, శేఖర్, ఇస్తాకుద్దీన్, భాస్కర్, దొండి గంగ మోహన్, రజనీష్ కిరాడ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### జెఈఈ మెయిన్‌లో మెరిసిన

# బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు

- 318 మంది హాజరు- 5 మంది 90+ పర్సంటైల్
- 28 మంది 80ం పర్సంటైల్ సాధన
- మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీధర్ అభినందనలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా జరిగిన జెఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షల్లో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. మొత్తం 318 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 5 మంది 90 పర్సంటైల్ పైగా సాధించారు. మరో 28 మంది 80 పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19), సిహెచ్ గాయత్రి (91.50), ఎం. సహస్ర (87.69), పి. చరిత (86.20), ఎం. స్నేహ (85.09) మంచి పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్ (91.58), ఆర్. కౌశిక్ (91.25), బి. మల్లేష్ (90.50), బి. హరీష్ (89.19), డి. రోహన్ (88.05) ఉత్తమ స్థానాల్లో నిలిచారు. గతంలో రెండు సీఓఈల్లో మాత్రమే పోటీ పరీక్షల కోచింగ్ ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 10 సీఓఈలను ఏర్పాటు చేసి లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తోంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రానున్న రోజుల్లో మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఎంజెపి సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు.

# నగర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాం

- బీజేపీని గెలిపించి మేయర్ పీఠం కట్టబెట్టిన ప్రజలకు కృతజ్ఞతలు
- కాంగ్రెస్ వ్యవహారం సిగ్గుచేటు
- రాజేందర్ రావుకు సవాల్
- ప్రజల సేవలో ఉంటాం



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** నగరపాలక సంస్థలో అత్యధిక స్థానాల్లో బీజేపి పార్టీని గెలిపించి మేయర్ పీఠాన్ని కట్టబెట్టిన నగర ప్రజలకు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ లోని గోదాంగడ్డ ఎస్ బి ఎస్ ఫంక్షన్ హాల్ లో డిప్యూటీ మేయర్ సునీల్ రావు మంగళవారం రోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీ విజయానికి కారణమైన మా నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, పోటిచేసే అవకాశం కల్పించిన బీజేపి అధిష్టాన పెద్దలకు, రాష్ట్ర అధ్యక్షులు రాంచంధర్ రావు, జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, మా గెలుపు కోసం కష్టపడి పనిచేసిన భారతీయ జనతా పార్టీ శ్రేణులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా మేయర్ గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో నగరపాలక సంస్థ ఆద్వర్యంలో తప్పకుండా ప్రజల శ్రేయస్సుకోసం మంచి కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. రాబోయే రోజుల్లో నగరపాలక సంస్థ ను ఒక ఆదర్శవంతమైన కార్పోరేషన్ గా మార్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను, రుణాన్ని తీర్చుతునే బాధ్యత మా పై ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కరీంనగర్ కార్పోరేషన్ లో కమలం వికసించేలా ఓటు వేసి మాకు అధికారం కట్టబెట్టిన ప్రజలకు మంచి చేసే బాధ్యత మాపై ఉందని, ప్రజలు మాకు మంచి జరిగిందని సంతృప్తి చెందేలా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. మేజారిటీ 30 స్థానాలు బీజేపి గెలిచినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహారించిన తీరు చూస్తుంటే ప్రజలు అసహించుకునేలా ఉందని మండి పడ్డారు. గెలిచింది 14 స్థానాలకు నలుగురు మంత్రులు, ఎమ్మెల్యే లు కరీంనగర్ ప్రజలు ఇచ్చిన తీర్పును వక్రీకరించే ప్రయత్నం చేశారని మండి పడ్డారు. ప్రజా స్వామ్యంలో ప్రజల తీర్పును అపహాస్యం చేసే ప్రయత్నం చేయడం చాలా దురదృష్టకరం అని, ప్రజలంతా, భగవంతుడు మా పక్షాణ ఉన్నడు కాబట్టి కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలు ఫలించలేవని అన్నారు. 14 స్థానాలు గెలిచినా మేయర్ ఎందుకు కాకూడదని ఓ మంత్రి స్థాయి నాయకులు మాట్లాడటం చాలా సిగ్గు చేటన్నారు. మిగితా పార్టీల్లో గెలిచిన సభ్యలను ఎన్నో ప్రలోభాలకు గురి చేసి భారతీయ జనతా పార్టీకి అడ్డుకట్ట వేసే ప్రయత్నం ప్రజలంతా చూశారని అన్నారు. మా పై నమ్మకంతో ఓటు వేసిన ప్రజలకు నీతి న్యాయవంతమైన పాలనతో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తామని తెలిపారు. మా మేయర్ తో సహా మా పాలకవర్గం మొత్తం ప్రజల సేవలో ఉంటామని స్పష్టం చేశారు. మీ లాంటి నాయకున్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని ధ్వజమెత్తారు. నగరపాలక సంస్థ లో విజిలెన్స్ విచారణ జరిపించి చాలా రోజులౌతుందని, ఏమైంది అని ప్రశ్నించారు. మేయర్ పదవి ముగిసన వెంటనే కార్పోరేషన్ లో ఏమైనా తప్పులు జరిగితే విచారణ చేయాలని దరఖాస్తు ఇచ్చిన చరిత్రమాది. నీలాగా కాంట్రాక్టలు చేసి దొంగ బిల్లులు తీస్కోని కోట్లు సంపాదించిన చరిత్రమాది కాదన్నారు. భారతీయ జనతా పార్టీ గెలుపును ప్రజలు పార్టీని ఆదరించిన తీరును జీర్ణించుకోలేక మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండి పడ్డారు. ఇలాంటి నాయకున్ని మల్లి అచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల వరకు ఇంచార్జ్ గా ఇలాగే కొనసాగించాలని ఇలా కొనసాగిస్తే మాకు సహాకారం అందించిన వాళ్ళు అవుతారని ఎద్దేవ చేశారు. బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో కరీంనగర్ నగరపాలక సంస్థ ను మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకునేలా మా పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపి పార్టీ కార్పోరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# శభాష్ యాదన్న-సీఎం రేవంత్ రెడ్డి



**మొయినాబాద్ ఫిబ్రవరి 17 జనంసాక్షి :** యాదన్న అంటూ చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్యను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మునిసిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చైర్ పర్సన్లు గా ఎన్ను కోవడం పట్ల ప్రత్యేకంగా ఎమ్మెల్యే యాదయ్యని ప్రత్యేకంగా అభినందించి మూడు మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాల యాదయ్య తెలిపారు



## మెరీనా అబ్రమోవిక్ ప్రదర్శనకు భారత్‌లో విశేష స్పందన

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** ప్రపంచ ప్రఖ్యాత సెర్బియన్ ప్రదర్శన కళాకారిణి మరీనా అబ్రమోవిక్ ప్రదర్శనకు భారత్‌లో విశేష ఆదరణ లభించింది. జైదూస్ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు మేహా పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమం కొచ్చి ముజిరీస్ బిన్నాలేలో భాగంగా జరిగింది. శరీరం, సాన్నిహిత్యం, ప్రేక్షకుల భాగస్వామ్యాన్ని కళలో కేంద్రబిందువుగా నిలిపే వినూత్న శైలితో ఆమె ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కళను సమాజంతో మమేకం చేయడం, అందరికీ అందుబాటులోకి తేవడం అత్యంత ముఖ్యమని మేహా పటేల్ పేర్కొన్నారు. అనుభవం , సందర్భం, భాగస్వామ్యం ద్వారా కళ మరింత సజీవంగా మారుతుందని చెప్పారు. ప్రముఖ కళా కారుడు నిఖిల్ చోప్రాతో కలిసి ఈ అరుదైన అను భూతిని ప్రేక్షకులకు అందించడం ఆనందంగా ఉం దన్నారు. ప్రేక్షకులే ఈ అనుభవానికి సహసృష్టి కర్తలుగా మారడం ఈ ప్రదర్శన ప్రత్యేకతగా పేర్కొ న్నారు. పశ్చిమ దేశాల ఐకాన్‌ను ఆహ్వానించడం మాత్రమే లక్ష్యం కాదని, భారతీయ సాంస్కృతిక మూలాలతో అనుసంధానమయ్యే ఆలోచనా విధానాన్ని పరిచయం చేయడమే ముఖ్యమని మేహా పటేల్ స్పష్టం చేశారు. ఆచారం, సహనం, ఆధ్యాత్మిక భావనలతో కూడిన ఆమె ప్రదర్శనలు భారతీయ సంప్రదాయాలకు దగ్గరగా ఉంటాయని తెలిపారు. కళను ప్రజలతో పంచుకునే వేదికగా కొచ్చి బియన్నేలే విశిష్ట స్థానాన్ని సంపాదించిందని పేర్కొన్నారు.

## ఈనెల 20న ఆహార కమిషన్ జిల్లాలో పర్యటన : జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ హైదరాబాద్ సభ్య కార్యదర్శి, చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సబ్యులు ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, శారద, భారతి, జ్యోతి లు ఈ నెల శుక్రవారం 20న కామారెడ్డి జిల్లాను సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ -2013 కింద అమలవుతున్న పథకాల పై క్షేత్ర పర్యటనలు నిర్వహించి, సంబంధిత పౌర సరఫరాల సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని సజావుగా జరిగేలా సంబంధిత అధికారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఐడిఓసి మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 1:00 - సాయంత్రం 5:30 గంటల వరకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# మొదటి విడత పరీక్ష ఫలితాలలో "అల్ఫోర్స్"కు పర్సంటైల్ పంట







**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి):** ఐఐటి - జేఈఈ (మెయిన్స్) 2026 మొదటి విడత పరీక్ష ఫలితాలు మంగళవారం రోజు విడుదల చేయబడ్డాయని అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి.నరేంద ర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఫోర్స్ చైర్మన్ మాట్లాడుతూ... ఈ ఫలితాలలో మా అల్ఫో ర్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభతో జాతీయ స్థాయిలో అత్యద్భుత పర్సంటైల్ సాధించారని తెలిపారు. సిహెచ్.లక్ష్మీ హాసిని 99.94, పర్సంటైల్తో అగ్రస్థానంలో నిలువగా వి. శ్రేయాస్ రెడ్డి 99.83, కె.ధనుష్ 99.82, పటేల్ అక్షయ 99.74, బి.లిఖిత్ సాయి 99.6, ఎ. సత్య వర్ధన్ 99.6, జి.ఆశిష్ రెడ్డి 99.53, ఎన్. రత్న ప్రకాష్ 99.38, బి.శ్రీహాన్ 99.27, యు.అభినవ్ చౌదరి 99.25, ఎల్.ప్రణయ్నా రెడ్డి 99.13, వి.సుహానీ 99.11 సాధించారు. 99 పర్సం టైల్ ఆపై 12 మంది విద్యార్థులు సాధించారు. 90 పర్సం టైల్ ఆపై 113 మంది విద్యార్థు లు సాధించడం విశేషం, రెండవ విడత ఫలితాలలో కూడ మా అల్ఫోర్స్ విద్యార్థులు అఖండ విజయం సాధిస్తారని తెలిపారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, పర్యవేక్షణ, విద్యార్థుల నిరంతర కృషి వల్ల ఇంతటి ఘనవిజయం సాధించడం జరిగిందని రాబోయే ఐఐటీ (అడ్వాన్స్), నీట్, ఎంసెట్ లో కూడ మా అల్ఫోర్స్ చిన్నారులు అద్భుత ర్యాంకులు సాధిస్తారని నేను విశ్వసిస్తున్నానని తెలిపారు. ఐఐటి - జేఈఈ (మెయిన్) ఫలితాలలో అద్భుత పర్సంటైల్ సాధిం చిన మా అల్ఫోర్స్ ఆణిముత్యాలను మనస్ఫూర్తిగా అభినందిస్తూన్నానని, ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు.

# 23 వారాలకు జన్మించిన శిశువులను సైతం కాపాడవచ్చు

- శిశువు తల్లి గర్భంలో ఉండగానే సమస్యల గుర్తింపుతో ప్రాణ రక్షణ
- అవగాహన సదస్సులో హైదరాబాద్ హైటెక్‌సిటీ మెడికవర్ వైద్యులు నియోనాటలిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి వెల్లడి




**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి):**
23 వారాల్లో జన్మించిన శిశువులను కాపాడే అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని హైటెక్‌సిటీ మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్ పిల్లల వైద్య నిపుణులు నియోనాటలిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ మధుమోహన్, గైనకాలజిస్టు డాక్టర్ భార్గవి వెల్లడించారు. మంగళవారం రోజు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో హై రిస్క్ గర్భధారణల్లో నెలలు నిండకుండా జన్మించిన శిశువులకు ఆధునికి పరికరాలతో చేపడుతున్న నియోనాటల్ చికిత్స విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల
నియోనాటలిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ మధుమోహన్, గైనకాలజిస్టు డాక్టర్ భార్గవి మాట్లాడుతూ... హైరిస్క్ గర్భదారణ తల్లుల్లో ప్రతి నిమిషం విలువైనదేనని, 'గోల్డెన్ అవర్' కీలకమన్నారు. కరీంనగర్ వంటి ప్రాంతాల్లో హై రిస్క్ గర్భధారణలు, నెలలు నిండకుండా జరిగే ప్రసవాల సందర్భాల్లో సమయానుకూలంగా ప్రత్యేక వైద్యం అందకపోవడం తల్లి, శిశువుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని తెలిపారు. ప్రతి పది మంది శిశువుల్లో ఒకరు నెలలు నిండకుండా జన్మిస్తుండగా, వీరిలో చాలామందికి జన్మించిన తొలి గంటలోనే "గోల్డెన్ అవర్" ప్రత్యేక నియోనేటల్ చికిత్స అవసరం అవుతోందన్నారు. 23, 24 వారాల్లో జన్మించిన శిశువులకు ఆధునిక శ్వాస సహాయం, ఇన్ఫెక్షన్ నియంత్రణ, పోషకాహార నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. హైటెక్‌సిటీ మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్‌లో అత్యాధునిక ఎన్ఐసీయూ సదుపాయాలు, 24 గంటల నియోనేటాలజీ సేవలు, పీడియాట్రిక్ సర్జరీ, ప్రత్యేకంగా శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హై రిస్క్ గర్భధారణలు, నవజాత శిశువుల సమస్యలను తొలిదశలోనే గుర్తించి సరైన కేంద్రాలకు రిఫర్ చేస్తే చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. హైరిస్క్ గర్భధారణలను తొలిదశలోనే గుర్తించడం అత్యంత అవసరమని తెలిపారు. తీవ్రమైన రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, శిశువు ఎదుగుదల లోపం వంటి సమస్యలు ప్రసవానికి ముందే సంకేతాలు చూపుతాయని చెప్పారు. గర్భధారణ సమయంలో లేదా జన్మించిన వెంటనే గుర్తించి, పుట్టుకతో శస్త్రచికిత్స అవసరమైన సమస్యలను ప్రసూతి , నియోనేటాలజిస్టు, పీడియాట్రిక్ సర్జన్ల సమన్వయంతో సురక్షితంగా చికిత్స చేయవచ్చని చెప్పారు. హైటెక్‌సిటీ మెడికవర్‌లో అత్యాధునిక వైద్య సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. కరీంనగర్ మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో మార్కెటింగ్ హెడ్ కోట కర్నాకర్, హెచ్ ఆర్ మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





# నేర పరిశోధనలో జాగిలాలు ఎంతో కీలకం

- ఇంటిలిజెంట్ అదనపు డిజిపి విజయ్ కుమార్
- మొయినాబాద్ ఐటిపి జాగిలాల శిక్షణ పూర్తి చేసుకున్న 76 జాగిలాలు
- అందర్నీ ఆకట్టుకున్న జాగిలాల విన్యాసాలు..

**మొయినాబాద్ ఫిబ్రవరి 17 జనంసాక్షి :** నేర పరిశోధనలో జాగిలాలు ఎంతో తోడ్పడతాయని శిక్షణ పొందిన 76 జాగిలాలతో నేరాలను వేగవంతం చేయవచ్చునని తెలంగాణ రాష్ట్ర ఇంటిలిజెన్స్ అదనపు డిజిపి విజయ్ కుమార్. ఐఎస్ఓడబ్ల్యూఎస్ అధికారి కమలహాసన్ రెడ్డి లు పేర్కొన్నారు మంగళవారము రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఐఐటిఏ జాగిలాల శిక్షణ కేంద్రంలో తెలంగాణ బిఆర్ కు చెందిన 76 జాగిలాలు శిక్షణ పూర్తి చేసుకున్నాయి ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న జాగిలాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయ్ కుమార్ కమలహాసన్ రెడ్డి పాల్గొని పుణ్యాసాలను తిలకించారు ఈ సందర్భంగా జాయిలర్ ముఖ్య అతిథులకు పూలపొడి సమర్పించి గౌరవ వందనం చేశాయి. శిక్షణ పొందిన జాగిలాలు వివిధ రకాల విన్యాసాలను ప్రదర్శించడంతో అందరినీ ఆకట్టుకున్నాయి అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ జాగిలాలు ఎంతో నేర పరిశోధనలో ఉపయోగపడతాయని తెలిపారు నేరాలను వేగవంతం చేసేందుకు ఈ జాగిలాలు పోలీసులకు ఉపయోగపడేందుకు మంచి శిక్షణ పొందాలని తెలిపారు 76 జాగిలాల శిక్షణ పూర్తిలో 105 మంది సిబ్బంది కృషి చేయడం వారిని అభినందించారు రాచకొండ కమిషనరేట్ లో మరింత చేసేందుకు ఈ జాగిలాల కృషి ఎంతో ఉంటుందన్నారు మందు పాత్రలు పరిశోధన ఛేదించేందుకు జాయిలర్ కృషి ఉంటుందని తెలిపారు వరంగల్ రామగుండం మహబూబాబాద్. అదిలాబాద్ నిజాంబాద్ ఖమ్మం ఈ జాగిలాలను ఉపయోగించనున్నట్లుఅన్నారు అదేవిధంగా రాచకొండ ప్రాంతంలో లోని. కమిషనరేట్ పరిధిలో ఈ జాగిలాల ఉపయో గం ఎంత ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు సిబ్బంది శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

## మరో మూడు మున్సిపల్ ఛైర్మన్ల ఎంపిక వాయిదా

**హైదరాబాద్, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** తెలంగాణలో మున్సిపాలిటీ ఛైర్మన్ల ఎన్నిక కొనసాగుతోంది. సోమవారం 105 మున్సిపాలిటీలకు ఛైర్మన్ల ఎన్నిక పూర్తి కాగా.. మిగిలిన 11 మున్సిపాలిటీ ఛైర్మన్ల ఎన్నికలు ఇవాళ నిర్వహించారు. అయితే, వివిధ కారణాల వల్ల మూడు మున్సిపాలిటీల్లో ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే, హైకోర్టు ఈ ఎన్నికపై స్టే విధించడంతో ఆయనకు అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు.

## హారిక డ్రగ్స్ పరిశ్రమలో పేలిన రియాక్టర్



**సంగారెడ్డి, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** జిల్లాలోని గుమ్మడల మండలం హారిక డ్రగ్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలింది. గుమ్మిడదల కేంద్రంలోని హారిక డ్రగ్స్ పరిశ్రమలో మంగళవారం రాత్రి రియాక్టర్ పేలింది. పేలుడు తీవ్రతతో పక్కనే ఉన్న ప్రహరీ గోడ కూలింది. ఘటన సమయంలో పరిశ్రమలో కార్మికులు విధుల్లో ఉన్నట్టు సమాచారం. పేలుడు శబ్దంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం కనిపిస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గాయాల వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పేలుడు కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## బాలిక హత్యపై మదనపల్లెలో ఉద్రిక్తత

- హైవేను దిగ్బంధించిన ప్రజలు
- నిందితుడిని ఉరితీయాలంటూ ఆందోళన



**అన్నమయ్య, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** మదనపల్లిలో అదృశ్యమైన ఓ మైనర్ బాలికను దారుణంగా హత్య చేయడంపై స్థానికంగా ఆందోళన కొనసాగుతోంది. కొన్ని గంటలుగా కదిరి- మదనపల్లి హైవే దిగ్బంధించి స్థానికులు ఆందోళన చేపట్టారు. కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి. ఆందోళనకారులతో మాట్లాడినప్పటికీ స్థానికులు మాత్రం నిందితుడ్ని ఉరి తీయాలనే డిమాండ్‌తో నిరసన చేపట్టారు. కాగా, మదనపల్లిలో అదృశ్యమైన బాలిక కేసు విషాదాంతమైంది. బాలికను హత్య చేసి డ్రమ్ములో దాచాడు నిందితుడు. మదనపల్లి పట్టణం, నీరుగట్టువారిపల్లిలోని కాట్లాటపల్లి రోడ్డులో కాపురం ఉంటున్న చేనేత కార్మికుడు గోపీనాథ్ కుమార్తె రిషిక ప్రియా(7)ను హత్య గావించబడింది. తొలుత బాలిక కన్పించకపోవడంపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనిలో భాగంగా బాలిక ఆచూకీ తెలపాల్సిందిగా పత్రికా ప్రకటన ఇచ్చారు పోలీసులు. ఆపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డీఎస్పీ మహేంద్ర సూచనల మేరకు సీఐ మహమ్మద్ రఫీ, సిబ్బందితో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఆ బాలిక హత్యగావించబడినట్లు తేలింది. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా రిషిక ప్రియను ఓ వ్యక్తి దారుణంగా చంపి డ్రమ్ములో కుక్కినట్లు గుర్తించి, హత్య జరిగినట్లు నిర్ధారించారు. మదనపల్లెలో ఆందోళన కొనసాగుతోంది. అనుమానితుడి ఇంటిని స్థానిక గ్రామస్తులు చుట్టుముట్టారు. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎస్పీతోపాటు పోలీసులు ఎంత సర్ది చెబుతున్న బాధితులు మాత్రం వినడం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు బాలిక శవాన్ని బయటకి తీయలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క నిందితుని కఠినంగా శిక్షించాలంటూ అన్నమయ్య సర్కిల్లో కొనసాగుతున్న రాస్తారోకో కొనసాగుతోంది. పాప తల్లితో ఫోన్లో మాట్లాడి న్యాయం చేస్తామని హోంమంత్రి చెప్పారు. అనుమానితుడి ఇంటి చుట్టూ ప్రజలు ,హిజ్రాలు, ప్రజాసంఘాల నాయకులు భారీగా చుట్టుముట్టారు. కర్నూలు డీఐజీ సైతం ఘటనా స్థలికి బయల్దేరి వస్తున్నట్లు తెలుస్తోంది.

## శ్రీలంక ప్రభుత్వం సంచలన నిర్ణయం

- ఎంపిల పెన్షన్లు రద్దుకు పార్లమెంట్ ఆమోదం

**కొలంబో, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** శ్రీలంక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఎంపీల పెన్షన్లను పూర్తిగా రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో మంగళవారం ఆమోదం పొందింది. 225 మంది సభ్యులు కలిగిన సభలో 154 మంది ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. మిగిలిన సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. శ్రీలంకలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన పార్లమెంట్ సభ్యులకు ప్రస్తుతం పెన్షన్ అందుతోంది. కొత్త చట్టం ఆమోదం పొందడంతో ఇప్పటికే అందుకుంటున్న వారితో పాటు, కొత్తగా అర్హత సాధించిన వారికీ పెన్షన్లు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే మాజీ అధ్యక్షులకు ఇచ్చే ప్రయోజనాలను దిసనాయకే ప్రభుత్వం నిలిపివేసింది. ఇంటి అద్దె, అలవెన్సులు, పెన్షన్లు, రవాణా సౌకర్యాలను గతేడాది సెప్టెంబర్‌లో రద్దు చేసింది. పర్యాటకంపై ఆధారపడిన దేశమైన శ్రీలంకకు కరోనా, ఉగ్రవాద దాడుల కారణంగా విదేశీయుల రాక తగ్గింది. నాటి పాలకుల ఆర్థిక నిర్వహణ లోపం కారణంగా పరిస్థితి మరింత తీవ్రమైంది. 2022లో దివాళా తీసింది. దీంతో నాటి పాలకులపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేశంలో ఆహారం, ఔషధాలు, విద్యుత్, చమురుకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది. ప్రజల నుంచి ఆందోళనలు చెలరేగడంతో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మార్క్సిస్టు నేత దిసనాయకే విజయం సాధించి అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడంలో భాగంగా ఎన్నికల వాగ్దానంలో ఒకటైన పెన్షన్ల రద్దుకు బిల్లు తీసుకొచ్చారు. దేశం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న వేళ చట్టసభ సభ్యులకు పెన్షన్లు పొందే నైతికత లేదంటూ ఈ బిల్లుపై చర్చ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి హర్షణ నానాయక్కర పేర్కొన్నారు.

## నేటి నుంచి 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలు

- సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ ఆతిథ్యమిస్తున్న 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ తెలిపారు. ఫిబ్రవరి 18న సైబరాబాద్ కార్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. గచ్చిబౌలి స్టేడియం, దుర్గం చెరువు, ఎల్‌బి స్టేడియం, సైబరాబాద్ షూటింగ్ రేంజ్‌లలో వివిధ క్రీడా పోటీలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 20న క్రీడాకారులందరితో కలిసి నిర్వహించే 'బడా ఖానా', సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. ఈ క్రీడలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించి, వసతి, భోజనం, రవాణా, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3 కమిషనరేట్లు, 7 పోలీస్ జోన్లు, అలాగే గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్, రైల్వే పోలీస్, టీఎస్ఎస్పీ బెటాలియన్లు తదితర ప్రత్యేక విభాగాల నుంచి మొత్తం 2,532 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. వీరిలో 1,933 మంది పురుషులు, 599 మంది మహిళా సిబ్బంది ఉన్నారు. ఈ రాష్ట్ర స్థాయి క్రీడల్లో మొత్తం 31 రకాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రీడల్లో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, జుడో, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, షూటింగ్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, క్రాస్ కంట్రీ, యోగా, ఆర్చరీ, సెపక్ తక్రా, సైక్లింగ్, ఫెన్సింగ్, మల్లఖాంబ్, పెన్కాక్ సిలాట్, తైక్వాండో, వుషు మరియు ట్రయాథ్లాన్ వంటి మొత్తం 31 రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనం, రవాణా, వైద్య సదుపాయాలు పకడ్బందీగా కల్పించామని, ఈ క్రీడలు పోలీసు సిబ్బందిలో ఐక్యతను పెంపొందించడంతో పాటు వృత్తి ఒత్తిడికి ఉపశమనం కలిగిస్తాయని సీపీ పేర్కొన్నారు. క్రీడాకారుల సౌకర్యార్థం తెలంగాణ పోలీస్ అకాడమీ లోని బ్లాకుల్లో 806 పడకలతో వసతి కల్పించారు. అధికారుల హోదాను అనుసరించి ప్రత్యేక వసతి బ్లాకులు కేటాయించడమే కాకుండా, పౌష్టికాహారం అందించేలా మెనూను స్వయంగా పర్యవేక్షిస్తున్నామని సీపీ పేర్కొన్నారు. క్రీడల నిర్వహణ కోసం నియమించిన నోడల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, క్రీడాకారుల రవాణా, భోజనం, వైద్య సదుపాయాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సీపీ ఆదేశించారు. ఈ క్రీడలు పోలీసు సిబ్బందిలో ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు వృత్తిపరమైన ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తాయని ఆయన తెలిపారు.

## మంత్రి ఆదేశాలను అమలు చేయండి

- కేబుల్ చానెల్స్‌కు ఐఅండ్ పీఆర్‌లో అక్రెడిటేషన్స్ ఇవ్వండి
- కమిషనర్ ప్రియాంకకు టీయూడబ్ల్యూజే, కేబుల్ జర్నలిస్టుల జేఏసీ నేతల వినతి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేబుల్ చానెల్స్‌కు గతంలోలాగే ఐఅండ్‌పీఆర్‌లో అక్రెడిటేషన్ కార్డులు ఇస్తామని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్ ప్రియాంక హామీ ఇచ్చారు. సవరించిన జీఓలో సైతం కేబుల్ చానెల్స్‌కు జరిగిన అన్యాయాన్ని టీయూ డబ్ల్యూ జే, కేబుల్ చానెల్స్ జేఏసీ నేతలు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు. జీఓ 239 లో కేబుల్ చానెల్స్‌కు ఇచ్చిన అక్రెడిటేషన్స్ వివరాలను ఈ సందర్భంగా యూనియన్ నేతలు కమిషనర్ కు వివరించారు. కేబుల్ ఛానెల్స్‌కు జరుగుతున్న అన్యాయాన్ని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ క్షుణ్ణంగా వివరించారు. గతంలో ఇదే విషయాన్ని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పాత జీఓ ప్రకారం కేబుల్ జర్నలిస్టులకు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కమిషనర్ కు తెలిపారు. దీంతో స్పందించిన కమిషనర్ ఇదే విషయాన్ని మరో మారు మంత్రితో చర్చించి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. 15 సంవత్సరాల జర్నలిస్టుగా అనుభవం కలిగిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కూడా ఫ్రీ లాన్స్ జర్నలిస్టులుగా అవకాశం కల్పించాలని, ప్రస్తుతం కేవలం ప్రింట్ మీడియా వారికి మాత్రమే ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో కూడా సానుకూలంగా స్పందించిన కమిషనర్ తప్పకుండా వారికి కూడా అవకాశం కల్పిస్తామన్నారు. అక్రెడిటేషన్స్ జారీలో కేబుల్ చానెల్స్ కు న్యాయం చేసేలా త్వరలో సవరణలు చేస్తామని కమిషనర్ ప్రియాంక స్పష్టం చేశారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్, తెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూ డబ్ల్యూ జే కోశాధికారి పి.యోగానంద్, కేబుల్ చానెల్స్ జేఏసీ నేతలు కడకంచి వెంకటేష్, హెచ్.వి చలపతి రాజు, దేవేందర్, భరత్, అరవింద్ తదితరులు ఉన్నారు.

## మొహాలిలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు

- సిఎం మాన్ చికిత్స పొందుతున్న ఆసపత్రికి కూడా మెయిల్

**మొహాలీ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** పంజాబ్ మొహాలీలోని కొన్ని స్కూళ్లకు మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. వీటితోపాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ చికిత్స తీసుకుంటున్న ఫోర్టిస్ ఆసుపత్రికి కూడా మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై మొహాలీ సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ..'మొహాలీలో కొన్ని స్కూళ్లతోపాటు, ఫోర్టిస్ ఆసుపత్రికి కూడా బాంబు బెదిరింపులొచ్చాయి. వెంటనే బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టాము. బాంబు బెదిరింపులు రావడంతో.. ఫోర్టిస్ ఆసుపత్రిలో అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతున్నాయి. అత్యవసరం కానీ సేవల్ని నిలిపివేశాము. స్కూళ్లలో కూడా తనిఖీలు చేపట్టాము' అని ఆయన అన్నారు. పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స కోసం సోమవారం అడ్మిట్ అయ్యారు. సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన భగవంత్‌మాన్ కొద్ది గంటల తర్వాత ఆయాసంతో బాధపడుతూ మళ్లీ అడ్మిట్ అయ్యారు అని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 11న మొహాలీలో 16 ప్రైవేటు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. పోలీసులు ఆ స్కూళ్లలో తనిఖీలు చేపట్టారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో చండీగఢ్, అమృతసర్, జలంధర్, పటియాలా, హర్యానాలో స్కూళ్లకు బాంబు బెదిరింపులొచ్చాయి.

## బీఆర్ఎస్ ఖాతాలో ఇంద్రేశం

**సంగారెడ్డి, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** జిల్లాలోని ఇంద్రేశం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా కిషంగుల ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా పటోళ్ల హరీశ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఇంద్రేశం పురపాలికలో మొత్తం 18 వార్డులకుగాను అత్యధికంగా 9 వార్డులను బీఆర్ఎస్ గెలుచుకోగా, ఆరు వార్డులు కాంగ్రెస్, రెండు వార్డులు బీజేపీ, ఒకటి ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. కానీ, నిన్న జరగాల్సిన ఛైర్మన్ ఎన్నికను వాయిదా వేశారు. మంగళవారం ఎన్నిక నిర్వహించగా మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది.

## అసోంలో కాంగ్రెస్‌కు బిగ్‌షాక్

- మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా
- బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం



**గౌహతి, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** అస్సాం ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. అస్సాం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ పరిణామం తర్వాత అస్సాం సీఎం, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మ, బోరాను వ్యక్తిగతంగా కలువనున్నట్లు ప్రకటించారు. బోరా రాజీనామాపై హిమంత మాట్లాడుతూ.. భూపెన్ బోరా అస్సాం కాంగ్రెస్ లో అట్టడుగు స్థానం నుంచి ఎదిగిన ప్రముఖ హిందూ నేత. ఆయన ఆహ్వానం మేరకు ఈ సాయంత్రం ఆయనను కలవనున్నాను. బీజేపీలో ఆయన చేరితే అస్సాం, దేశ సేవలో మరింత బలం చేకూరుతుందని అన్నారు. అస్సాం కాంగ్రెస్ చీఫ్‌గా గౌరవ్ గొగోయ్ బాధ్యతలు తీసుకునే ముందు 2021-25 వరకు అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోరా పనిచేశారు. ప్రస్తుతం, అస్సాం కాంగ్రెస్‌లో గొగోయ్ ఆధిపత్య ధోరణి కారణంగానే బోరా రాజీనామా చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. బోరా తన రాజీనామా లేఖను కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. 32 ఏళ్లగా పార్టీ కోసం పనిచేస్తున్నా, ఇప్పుడు విస్మరించారని, తనకు తగిన గౌరవం కల్పించలేదని ఆయన ఆరోపించారు. బోరా రాజీనామా ద్వారా కాంగ్రెస్‌లో సాధారణ వ్యక్తి అభివృద్ధి చెందలేదనే సందేశాన్ని పంపిందని, బోరాను బీజేపీలోకి స్వాగతిస్తున్నామని, బీజేపీలో చేరాలని నిర్ణయించుకుంటే ఆయనకు సురక్షిత స్థానం నుంచి ఎన్నికయ్యేలా చేస్తామని హిమంత చెప్పారు. సీఎం హిమంత తనను కలుస్తాననే వ్యాఖ్యలపై బోరా స్పందిస్తూ.. ఏ ముఖ్యమంత్రి అయినా తన ఇంటికి వస్తే అది తనకు గర్వకారణం అని బోరా అన్నారు. ఇదిలా ఉంటే, రాజీనామాపై పునరాలోచన చేయాలని గొగోయ్, ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్, దేబబ్రత సైకియాతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కోరారు.

## సోనియాజీ సోనాదో.. ప్రియాంకాజీ స్కూటీదో..

- మహిళలకు రూ.2500 ఇవ్వండి
- కవిత మెరుపు ధర్నా!



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సోనియా గాంధీ సోనా దీజియే , ప్రియాంక గాంధీ స్కూటీ దీజియే, మహిళలకు నెలకు రూ. 2,500ఇవ్వండి అంటూ ఆందోళన చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో బేగంపేటలోని ప్రజా భవన్ వద్ద మెరుపు ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులతో పాటు పలువురు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అలాగే పింఛన్‌లను పెంచాలని నినాదాలు చేశారు. అనంతరం, కవిత తన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్యకు సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజావాణికి వచ్చిన తమ విద్యార్థులు, మహిళలను పోలీసులు తప్పుగా అరెస్ట్ చేసి, దురుసుగా ప్రవర్తించారని కవిత తీవ్రంగా ఖండించారు.

రోజూ ప్రజావాణిలో ఉంటానన్న సీఎం మాట నిలబెట్టుకోలేదని, ఒక్కసారి మాత్రమే హాజరయ్యారని విమర్శించారు. తమ వారిని అరెస్టు చేస్తున్నారంటేనే వచ్చానని ఆమె తెలిపారు. వినతి పత్రాలు ఇచ్చేందుకు ఆధార్ కార్డులు, దరఖాస్తు ఫామ్‌లతో శాంతియుతంగా వచ్చామని, పోలీసులతో నియంత్రించే చర్యలు చేపడితే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని కవిత హెచ్చరించారు. రానున్న ఫిబ్రవరి 26న ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో మహిళలకు ఇచ్చిన హామీలైన రూ.2,500, స్కూటీలు, తులం బంగారం కోసం నిధులు కేటాయించాలని కవిత డిమాండ్ చేశారు. అలాగే, రూ.2,000 ఉన్న పింఛన్‌ను రూ.4,000లకు పెంచాలని కూడా ఆమె స్పష్టం చేశారు. బడ్జెట్‌లో ఈ హామీలను నెరవేర్చకుంటే సెక్రటేరియేట్, అసెంబ్లీలను ముట్టడిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కవిత హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయన్న ఆమె, బీఆర్ఎస్ దయతోనే బీజేపీకి ఒకటి, రెండు ఛైర్మన్ సీట్లు వచ్చాయని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు మున్సిపల్ ఎన్నికల్లో లభించిన సహకారమే తొలిమెట్టు అని కవిత వ్యాఖ్యానించారు. రైతులకు బోనస్ ఇవ్వడం గొప్ప ఘనత కాదని, అది ప్రభుత్వం ఇచ్చిన హామీనే తప్ప కొత్తది కాదని ఆమె ఎత్తిచూపారు. మహిళల హామీలను విస్మరించవద్దని, వారి తరఫున మాట్లాడే వారెవరూ లేరనుకోవద్దని కవిత హెచ్చరించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ప్రభుత్వం కనీసం వారికిస్తామన్న రూ.2.500 అయినా వెంటనే అందజేయాలని కవిత డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణ జాగృతి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## ధవలేశ్వరం కొత్త గేట్లకు 150 కోట్లు విడుదల

- జలవనరుల శాఖమంత్రి రామానాయుడు వెల్లడి

**అమరావతి, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** ధవలేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల దుస్థితిపై ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. నాడు బ్యారేజ్‌కు నిధులు ఇచ్చిన చంద్రబాబే.. మళ్లీ నేడు ధవలేశ్వరం బ్యారేజ్ కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాడైపోయిన గేట్లను తొలగించి కొత్త గేట్లను అమర్చనున్నట్టు వెల్లడించారు. బ్యారేజ్‌లోని 117 గేట్లను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా గోదావరి జలాలు సమర్థవంతంగా నిల్వ ఉండి, డెల్టా ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ సీజన్‌లోనే అన్ని పనులు పూర్తి చేసి, కొత్త గేట్లను పూర్తి స్థాయిలో అమర్చనున్నట్లు మంత్రి రామానాయుడు ప్రకటించారు. టెండర్లు, ఇతర చర్యలు వేగంగా పూర్తి చేసి త్వరితగతంగానే కొత్త గేట్లను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో 2014-19లో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని.. టీడీపీ ప్రభుత్వంలో 58 కొత్త గేట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. తిరిగి ఇప్పుడు మిగిలిన 117 గేట్లను కూడా కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2019-24 మధ్య కాలంలో ధవలేశ్వరం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని సీడబ్ల్యూసీ హెచ్చరించినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.

## తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

- 72 కిలోల కేక్ కట్ చేసిన పార్టీ నేతలు
- తెలంగాణ ఉద్యమ నేపథ్య పాటలు, డాక్యుమెంటరీ విడుదల
- కెసిఆర్ మళ్లీ సిఎం అవుతారన్న మాజీమంత్రి తలసాని
- ముమ్మాటికీ కెసిఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కెటిఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు. కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటెర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి టైగర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి'గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్ర్యం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపితగా ప్రజలు పిలుచుకుంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్తున్నాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళ తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు తెలుసనన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370